ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ  సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్ పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
సంపాదక మండలి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్. మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 19 - సంచిక 08
**జనవరి 2015**



పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## ప్రణామము (నమస్కారము)

మీకు, మీవారందరికీ ప్రణామము! 2015వ సంవత్సరము మొదటిరోజున తొలి వందనము. నూతన సంవత్సర అభివాదము–అభినందనలతోపాటు ఒక సందేశం కూడా ఇవ్వబడుతున్నది. 'ప్రణామము' అన్న శబ్దమునకు 'నమస్కారము' అన్న పదమునకు అవినాభావ సంబంధమున్నది. ప్రణామము చేయుట అన్న పదమునకు అర్థము వినమ్రముగా ఉండుట. **'ప్రణామము' భారతదేశపు సాంస్కృతిక పరంపర!!** నమస్కారము చేసే వ్యక్తి తన రెండు చేతులను జోడించి హృదయము వద్ద నిలుపుకుంటూ నమస్కారముద్ర ద్వారా తనలోని వినమ్రతాభావనను వ్యక్తపరుస్తాడు. కైమోడ్చి చేయబడిన ఈ నమస్కారము ద్వారా ఒకరికొకరు తమ తమ భావనలను ఇచ్చిపుచ్చుకుంటారు.

సమవయస్కులు ఎదురుపడినప్పుడు చేసుకునే నమస్కారము మాత్రమే కాకుండా, గురువులకు చేసే **'సాష్టాంగదండ ప్రణామము'**. ఏ నమస్కారమునకు అయినా అర్థమేమిటంటే పెద్దల పాదాలచెంత భావయుక్తంగా మోకరిల్లుట. ఈరకముగా ప్రణామము చేయుట వెనుక గల ఉద్దేశ్యము ఒక్కటే. గురుదేవుల శ్రీచరణముల వేళ్ళ కొసలనుండి ప్రవహించే శక్తిని తన శిరస్సున ధరించుట. ఈ ఆధ్యాత్మికశక్తి ప్రవాహము వలన శిష్యుని జీవితములో గుణములకు సంబంధించిన మార్పు–చేర్పులు అలవోకగా వాటికవే చోటుచేసుకుంటాయి. అనగా శిష్యుడిలో సద్గుణముల సంపద వర్షిస్తుంది.

కానీ పరిస్థితులు, మానసికస్థితి రెండూ మారిపోయాయి. ఈనాటి పరిస్థితులలో నమస్కరించే రివాజు మాత్రము పూర్వము వలెనే అన్నిచోట్లా పాటించబడుతున్నది. కానీ హృదయములోని భావనలను నిష్కపటముగా అర్పించే నిజమైన మానసికస్థితి కనిపించడంలేదు. ఈ కారణముగానే ప్రణామము చేసే సంప్రదాయమును పాటిస్తున్నప్పుడు బాంధవ్యములలో మధురిమ తొణికిసలాడటము లేదు, మధుర భావనలు ఒకదానితో మరొకటి మేళవించ బడటములేదు. ఇవన్నీ సవ్యముగా జరగాలంటే **మనము మన అంతఃకరణమును ధారణకు యోగ్యమైనదిగా మలచుకుని శిరస్సు వంచి ప్రణమిల్లటానికి సిద్ధపడాలి. అప్పుడు నూతన సంవత్సరములో ఒకరికొకరు చేసుకునే అభివాదము మనుష్యుల మధ్య అల్లుకున్న సంబంధములలో మాధుర్యమును నింపుతుంది. గురుసత్తా పదములకు చేసిన సాష్టాంగ దండప్రణామము మన జీవితము మీద వారి అనంత ఆధ్యాత్మిక ఆశీస్సులను వర్షింపజేస్తుంది.**

*– అఖండజ్యోతి, జనవరి 2015*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**అన్ని సమస్యలకు పరిష్కార మార్గం ఒక్కటే - ఆలోచనలలో మార్పు**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ప్రణామము (నమస్కారము) 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** మంచి అలవాట్లతోనే ఎదుగుదల 4
3. **వేదమంత్రం :** దైవేచ్ఛ 5
4. **గాయత్రీ విద్య - 50 :** స్త్రీలకు గాయత్రీ సాధన 6
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 31 :** స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి-4 10
6. **కుండలినీ మహావిజ్ఞానం-16 :** నవసృజన కొరకు సాధనా పరాక్రమం 14
7. **శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 4:** శబ్దశక్తి చూపించే మంచి-చెడు ప్రభావము 18
8. **భావసంవేదనల గంగోత్రి - 7 :** అంతరంగం జ్వలిస్తే... 22
9. **జీవన దేవత సాధన, ఆరాధన - 5 :** ప్రజ్ఞాయోగం-2 24
10. **వసంత పంచమి ప్రత్యేకం :** జ్ఞానము, తపస్సు, ప్రేమల కలయికే వసంత పర్వము 27
11. **బోధ కథ :** ఒక బాద్‌షాగారి విలక్షణ న్యాయం 30
12. **నేతాజి జయంతి ప్రత్యేకం :** సుభాష్ చంద్రబోస్ జీవితములోని రహస్య పక్షము 33
13. **జీవించే కళ :** స్వార్థం - పరమార్థం 36
14. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** లోకశిక్షకుల జీవనోద్దేశ్యం, లక్ష్యం - 1 39
15. **నా వారితో నా మాట :** అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులకు హృదయపూర్వక విన్నపం 42
16. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 45
17. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 9** 46
18. **2016లో ఆంధ్రప్రదేశ్‌లో అశ్వమేధ మహాయజ్ఞము నిర్వహణ** 49




## సద్గురు వాణి

### మంచి అలవాట్లతోనే ఎదుగుదల

చెడు అలవాట్లను మార్చుకోవచ్చు. వాటిని సంకల్పశక్తితో ఒకే దెబ్బతో నెట్టివేయవచ్చు. కానీ ఇది చాలా అరుదుగా జరుగుతుంటుంది. బాహ్య ప్రపంచంలోని ఇబ్బందులను ఎదుర్కోవడానికి అనేక మార్గాలు ఉంటాయి. కానీ మన లోపల ఉన్న లోపాలను, శక్తిహీనతను వదిలించుకోవడానికి దృఢనిశ్చయం అనివార్యమవుతుంది. ఇది తప్ప వేరే మార్గం ఏమి లేదు. మామూలు సామాన్యవ్యక్తులు తమ లోటుపాట్లకు ఇతరులను, పరిస్థితులను నిందిస్తుంటారు. బాగా ఎదగాలని కోరుకునేవారు, ధనవంతులు కావాలని కోరుకునేవారు పనికిరాని అలవాట్లను దృఢనిశ్చయంతో వదిలించుకోవాలి. మంచి అలవాట్లను చేసుకోవాలి.


## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 50/- చందాకు అదనంగా పంప ప్రార్థన. అట్లు పంపించని వారి చందాకాలము దామాషా పద్ధతిలో తగ్గించబడును. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ 15/- | 3 సం॥ చందా రూ॥ 420/- |
| సం॥ చందా రూ॥ 150/- | 10 సం॥ చందా రూ॥ 1300/- |


**ఒక లక్ష్యం కోసం పనిచెయ్యడమే తపస్సు**

వేదమంత్రం

# దైవేచ్ఛ

**ఉద్యానం తే పురుష నావయానం**
**జీవాతుం తే దక్షతాతిం కృణోమి ।**
**ఆహి రోహేమమమృతం సుఖం**
**రథమథ జిర్వ్రిర్విదథమా వదాసి ॥ - *(అధర్వవేద 8/1/6)***

**భావార్థం:** ఎవరు దైవేచ్ఛ, గురుజనుల శిక్షణను స్వీకరించి, కష్టాలలో కూడా వాటిని పాటిస్తూ ముందుకు వెళ్తూ ఉంటారో వారికి సమాజంలో గౌరవం ప్రశంస లభిస్తుంది.

**సందేశం:** దైవేచ్ఛ వలన మనకు ఈ మనుష్య శరీరం లభిస్తుంది. జీవితంలోని ఇబ్బందులు తొలగించుకుంటూ ఎల్లప్పుడు తన యొక్క, సమాజం యొక్క ఉన్నతికి పనిచేయుట మన ముఖ్య కర్తవ్యంగా పరమాత్మ నిర్ధారించాడు. మనం ఎప్పుడు నిరాశ చెందనక్కర్లేదు. ఎందుకంటే మన కృషిలో సహకరించుటకు పరమేశ్వరుడు స్వయంగా ప్రతిసారి సిద్ధంగా ఉంటాడు. మనం కేవలం పురుషార్థం చేయవలసి ఉన్నది. భగవంతుడు ఎన్నడు మన పతనం కోరుకోడు. మనమే స్వయంగా దుష్ప్రవృత్తుల వలలో చిక్కుకొని మనపతనాన్ని మనమే కొనితెచ్చుకుంటున్నాము. ఆయన మన జీవితాన్ని ఎంత ప్రాణవంతం, శక్తివంతం చేసాడంటే దాని తేజస్సు ముందు సమస్త ప్రపంచము తలవంచుతుంది. మనం మన ఆత్మ యొక్క శరీరం యొక్క శక్తిని ఎంతగా గుర్తించితే అంత మంచిది.

ఎక్కువ మంది వ్యక్తులు తమ ఆత్మశక్తిని గుర్తించరు. తమ శరీరమే సర్వస్వంగా భావించి, దాని సేవలోనే తమను తరింప చేసుకుంటున్నారు! దీనివలన అసంఖ్యాక శారీరక, మానసిక వికారాలు ఉత్పన్నమవుతాయి. వారి అంతఃకరణ కషాయ కల్మషాల దుర్గంధంతో పూర్తిగా నిండిపోతుంది. ఈ శరీరం ఆత్మ యొక్క వాహనం మాత్రమేనని వారు మరచి పోతారు. ఎవరు శరీరాన్ని ఆత్మ మీద పెత్తనం చేయనిస్తారో వారి ఆత్మ ప్రకాశం నుండి బయటికి రాలేక ప్రగతిలో సహాయ పడదు. కానీ ఎవరి ఆత్మ, శరీరరూప గుఙ్జాన్ని కళ్ళెంలాగి పట్టగలుగుతుందో అతడు ఉత్తరోత్తర ఆత్మవికాస సోపానాలను అధిరోహించి ఉన్నతశిఖరం చేరుకోగలడు.

అటువంటి మనుష్యుల ప్రాణబలం దినదినము పెరుగుతూ పూర్ణవికాసం చెందుతుంది. తన జ్ఞానము, అనుభవంతో సమాజాన్ని సంస్కారవంతము చేయుటలో సహాయం చేయ గలుగుతారు. సమస్యలను ఎదుర్కునే సామర్థ్యం వికసిస్తుంది. జీవనమార్గంలో చికాకులు వస్తూనే ఉంటాయి. అన్నీ మన ఇష్టప్రకారమే జరగవు. గడ్డు పరిస్థితులను సఫలతా పూర్వకంగా ఎదుర్కొనే సామర్థ్యం మన వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతంగా చేస్తుంది. దానివలన అంతటా గౌరవం, ప్రశంస ప్రాప్తిస్తుంది. సంఘర్షణ మన ఆత్మబలం, ప్రాణశక్తికి పరీక్ష వంటిది.

పరమాత్మ ఇచ్ఛవలనే ఈ ఆటంకాలు వస్తుంటాయి, మనలను సుషుప్తావస్థ నుండి మేల్కొలిపి ఆత్మోన్నతికి ప్రేరేపిస్తాయి. పరమపిత పరమేశ్వరుడు ఎంతో దయాళువు. ఆయన కృప తన ప్రియపుత్రులపై అనంతంగా వర్షిస్తూ ఉంటుంది. జీవితంలో కష్టాలు వస్తాయి తర్వాత అవే వరాలుగా రూపొందుతాయి. పూర్వ పాపకర్మలకు శిక్షణ రూపంలో ఇవి మనుష్యునికి ప్రాయశ్చితం చేసుకొనే ఒక అవకాశం ఇస్తాయి. అతని ఆత్మబలం బంగారం వలె మెరవటానికి ఇది ఒక కొలిమి యొక్క పాత్ర వహిస్తుంది.

ఎవరు ఈ సంకట పరిస్థితులలో హతాశులుకారో, ఇతరులకు తగిన ప్రోత్సాహం ఇస్తారో వారే నిజమైన బ్రాహ్మణులు.

★★★

## పండుగలు

**జనవరి 2015**

| | |
|---|---|
| 01-01-2015 | ఆంగ్ల సంవత్సరాది |
| 15-01-2015 | సంక్రాంతి |
| 24-01-2015 | వసంత పంచమి |
| 26-01-2015 | రిపబ్లిక్ డే / రథసప్తమి |

**ఫిబ్రవరి 2015**

| | |
|---|---|
| 13-02-2015 | సమర్థగురు రామదాస్ జయంతి |
| 17-02-2015 | మహాశివరాత్రి |
| 20-02-2015 | శ్రీరామకృష్ణ పరమహంస జయంతి |

**స్పష్టమయిన ఆలోచన స్పష్టమైన ఫలితాన్ని ఇస్తుంది**



గాయత్రీ విద్య-50

# స్త్రీలకు గాయత్రీ సాధన

ప్రాచీనకాలంలో గార్గీ, మైత్రేయి, మదాలస, అనసూయ, అరుంధతి, దేవయాని, అహల్య, కుంతి, శతరూప, బృంద, మండోదరి, తార, ద్రౌపది, దమయంతి, గౌతమి, అపాల, సులభ, శావతీ, ఉశిజ, సావిత్రి, లోపాముద్ర, ప్రతిశ్రేయ, వైశాలిని, బైందుల, సునీతి, శకుంతల, పింగళ, జరుత్కార, రోహిణి, భద్ర, విదుల, గాంధారి, అంజని, సీత, దేవహూతి, పార్వతి, అదితి, శచి, సత్యవతి, సుకన్య, శైవ్య మొదలైన స్త్రీలందరు వేదజ్ఞులు మరియు గాయత్రీ ఉపాసకులు.

వారు గాయత్రీ శక్తిని ఉపాసించడం ద్వారా తమ ఆత్మలను సమున్నతం గావించుకొనుటయేగాక, యోగసిద్ధులను పొందారు. వారు సౌభాగ్యవతియై, గృహస్థులై, గాయత్రిని ఆరాధించుటలో సఫల మనోరథులైనారు. వీరి విస్తృత వృత్తాంతాన్ని, వారి సాధనలను, సిద్ధులను వర్ణించుట ఇక్కడ సంభవము కాదు. భారతీయ ఇతిహాస, పురాణములను పఠించిన వారికి పైన ఉదహరించిన దేవతా స్త్రీమూర్తుల విద్వత్తు, సాహసము, శక్తి, శౌర్యము, దూరదృష్టి, నీతి, ధర్మము, సాధన, ఆత్మోన్నతి మొదలైన పరాక్రమాలు తమ పద్ధతిలో అమూల్యమైన, జాజ్జ్వల్యమాన తారకలు. వారు వివిధ సమయాలలో గావించిన చమత్కారములను గమనించిన మనము ఆశ్చర్యచకితులవుతాము.

ప్రాచీనకాలంలో సావిత్రి గాయత్రీ జపం ఆచరించి తాను సాధించిన శక్తితో మరణించిన తన పతి సత్యవంతుని ప్రాణములను యమధర్మరాజు నుండి తీసుకురాగలిగినది. గాంధారి తన కళ్ళకు గంతలు కట్టుకొని, ఘోరతపం ఆచరించి, పొందిన శక్తితో, తన దృష్టి ప్రసారిత మైనంత మాత్రాన, దుర్యోధనుని శరీరము వజ్రతుల్యము గావించినది.

అనసూయ తపస్సు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శిశువులుగా మార్చింది. సతీ శాండిలీ తన తపోబలంచే సూర్యరథ గమనాన్ని నిలిపివేసినది. సుకన్య తపఃశక్తిచే ముసలివాడైన చ్యవనుని యవ్వనుడిగా చేసింది. స్త్రీల యొక్క అపూర్వ తపో ఇతిహాసం పురుషుల కంటే తక్కువేమి కాదు. స్త్రీ, పురుషులు ఇద్దరికీ ప్రముఖ తపోమార్గము గాయత్రీయేనని స్పష్టమైనది.

వర్తమాన కాలంలో కూడా, అనేకమంది గాయత్రీ సాధన చేసిన స్త్రీలు మాకు చిరపరిచితులు. గాయత్రీ ద్వారా వారు అధిక ఆత్మికశక్తిని, ప్రాపంచిక శాంతిని పొందినట్లు తెలియ పరచారు. ఢిల్లీలో, అత్యంత ఉన్నత కుటుంబానికి చెంది, సుశిక్షితురాలైన శ్రీమతి చంద్రకళాదేవి, బి.ఎ. గాయత్రీమాత యొక్క అనన్య సాధిక. ఈ సాధన ద్వారా రోగగ్రస్తులకు స్వస్థత చేకూర్చటములో ఫలితమును పొందినది. ఈమె హస్త స్పర్శతో రోగ నిర్మూలనము పొందేవారు. హైదరాబాద్‌లోని శ్రీమతి విమలాదేవి అత్తగారు మహాకర్కశ స్వభావురాలు. భర్త త్రాగుబోతు. వేశ్యగమనాది దురలవాట్లన్నీ ఉన్నాయి. విమలాదేవి మేనత్త ఆమె విపత్తి నివారణార్థముగా గాయత్రీ మాత ఉపాసనా విధానాన్ని నేర్పించినది. ఆమె ఆ సాధన చేయడము ప్రారంభించినది. ఫలితం ఊహాతీతంగా జరిగినది. కొన్ని రోజులలోనే అత్త, భర్తల యొక్క స్వభావములో ఆశ్చర్య జనకమైన మార్పు వచ్చింది.

'వారీసాల్' (బెంగాల్)లో ఒక పెద్ద ఆఫీసరు ధర్మపత్ని శ్రీమతి హేమలత చటర్జీకి 33 సంవత్సరముల వరకు సంతానము కలుగలేదు. ఆమె భర్త, ఇతర కుటుంబసభ్యులకు అది బాధాకరంగా ఉండేది. అప్పుడప్పుడు ఆమె భర్తకు ద్వితీయ వివాహ చర్చ కూడా రావడము జరిగేది. హేమలతకి అది వ్యధగా ఉండి, దానివలన ఆమెకు మూర్ఛరోగం వచ్చింది. ఒక గాయత్రీ సాధకుడు ఆమెకు గాయత్రీ సాధనా విధిని బోధించాడు. ఆమె శ్రద్ధా పూర్వకముగా గాయత్రిని ఉపాసన చేయడం ప్రారంభించినది. గాయత్రీమాత కృపచే సంవత్సరం తరువాత ఒక పుత్రికను ప్రసవించినది. ఆమెకు గాయత్రి అని నామకరణము చేశారు. తరువాత రెండు, రెండు సంవత్సరాలు వ్యవధిలో ఇద్దరు పుత్రులు కూడా జన్మించారు.

**ఏ పని అయినా తక్షణమే చెయ్యండి, కానీ అవి ఇతరులకు బాధపెట్టనివి, ఇబ్బంది పెట్టనవి అయి ఉండాలి**

గోదావరి జిల్లాలో వాసంతీదేవి భూతోన్మాదముతో బాధ పడుతుండేది. భూతప్రేతాలు ఆమె శిరస్సుపైనుండేవి. 12 సంవత్సరాల వయస్సులోనే ఆమె వృద్ధురాలిగా మారింది. తన కుమార్తె యొక్క పీడను వదలించడానికి ఆమె తల్లిదండ్రులు చాలా ధనమును ఖర్చుచేశారు. వారికి వ్యాకులత పెరిగినది కానీ ప్రయోజనము కనిపించలేదు. చివరకు గాయత్రీ పురశ్చరణ గావింపచేసిన పిదప వారి కుమార్తెకు వ్యాధి నయం అయింది.

కాన్పూర్‌లోని అయోధ్యా ప్రసాద్ ధర్మపత్ని శాంతిదేవి. మిడిల్ క్లాసు మాత్రమే ప్యాస్ అయినది. 12 సం॥లోపు చదువు మానివేసి కుటుంబ జంఝాటములో పడింది. తరువాత ఒక సంవత్సరంలోగా మెట్రిక్ పరీక్ష గాయత్రీ ఉపాసనా బలంతో, కొద్ది ప్రయత్నముతో పూర్తిచేసి ఉత్తీర్ణురాలు అయినది.

వాలంపూర్‌లో సావిత్రీదేవి దుబే పేరుగల ఒక మహిళ యొక్క భర్త మృతి ఆమెకు 13 సం॥ల వయస్సులో జరిగినది. దానితో ఆమె అధిక రోగగ్రస్తురాలయినది. ఒకరోజు ఆమెకు భర్త స్వప్నములో కనిపించి "నీవు గాయత్రీ ఉపాసన చేయి నీ ఆత్మకు దానివలన సద్గతి కలుగుతుంది. నీ వైధవ్యము పరమ శాంతిప్రదంగా ఉంటుంది అని చెప్పేవాడు. ఆమె భర్త ఆజ్ఞానుసారము అటులనే గావించినది. ఆమె కుటుంబములో ఉంటూనే ఉచ్ఛస్థితిని పొందినది. ఆమె జిహ్వ నుండి వెలువడే ప్రతిమాట జరిగేది.

కటక్ జిల్లా రామపూర్ గ్రామంలో ఒక కుమ్మరి కన్య సోనాబాయికి నిత్యము స్వప్నంలో, జాగ్రదావస్థలో అప్పుడప్పుడు గాయత్రీమాత దర్శనము అయ్యేది. ఆమె భవిష్యత్ వాణి ఎల్లప్పుడు సత్యమయ్యేది.

రంగాపూర్‌కు చెందిన శ్రీమతి సరళాదేవి చౌదరిగారి పెక్కు సంతానము మృత్యువాతబడ్డారు. ఒక్క కుమారుడు కూడా జీవించనందువలన ఆమె కడు దుఃఖించింది. ఆమెకు గాయత్రీ ఉపాసన నేర్పబడినది. ఆమె గాయత్రీ మంత్రమును తనదిగా జేసుకుని ముగ్గురు కుమారులకు తల్లిగా సుఖము నొందినది.

స్త్రీ, పురుషులు, నర, నారీమణులిద్దరు వేదమాత గాయత్రి యొక్క పుత్రికా పుత్రులు. ఇద్దరు గాయత్రీమాతకు నేత్ర జ్యోతులు. ఆమె ఎవరినీ భేదభావంతో చూడదు. తల్లికి పుత్రుని కంటే పుత్రికపై వాత్సల్యము మెండు. వేదమాత గాయత్రీ సాధన పురుషులకంటే స్త్రీలకు అధిక సులభము. అధిక శీఘ్ర ఫలదాయిని.

## స్త్రీలకు గాయత్రీ ఉపాసనకు అధికారము

భారతదేశంలో ఎల్లప్పుడు స్త్రీలకు సముచిత గౌరవం లభిస్తుంది. వారిని పురుషులకన్నా అధిక పవిత్రమైన వారిగా భావిస్తారు. స్త్రీలను 'దేవి'గా సంబోధిస్తారు. వారి పేరుతోపాటు 'దేవి' అనే శబ్ధం జోడింపబడి ఉంటుంది. శాంతాదేవి, గంగాదేవి, దయాదేవి మొదలైన 'దేవి' శబ్దమును కన్యల పేరుతో కలుపుతారు. బి.ఎ. శాస్త్రి, సాహిత్యరత్న మొదలైన పదాలు పరీక్షలు పాసయిన తరువాత పేరుతోపాటు చేరుస్తుంటారు. అలాగే కన్యలకు జన్మించుటతోనే ఈశ్వర ప్రదత్తమైన దేవీ గుణములు, దైవీ ఆలోచనలు, దివ్యమైన విశేషతల కారణంగా 'దేవి' అనే పదాన్ని వారిపేరుకి చేర్చుతారు.

దేవతల, మహాపురుషుల పేర్ల ముందు వారి అర్థాంగి పేరు కలుపుతారు. సీతారాం, రాధేశ్యాం, గౌరిశంకర్, లక్ష్మీ నారాయణ, ఉమామహేశ్వర, సావిత్రీ-సత్యవంతుడు మొదలైన పేర్లలో మొదట నారికి, తరువాత స్థానం నరునికి ప్రాప్తించింది. పవిత్రత, దయ, కరుణ, సేవ, సానుభూతి, స్నేహం, వాత్సల్యం, ఉదారత, భక్తిభావన మొదలైన గుణములు నరుడిలో కన్నా నారీలో ఎక్కువ ఉంటాయని భావిస్తారు.

అందువలన ధార్మిక, ఆధ్యాత్మిక, ఈశ్వరప్రాప్తికి సంబంధించిన కార్యములలో స్త్రీలకు సర్వత్రా స్వాగతం ఇచ్చారు, వారి మహానతను గౌరవించారు. వేదములలో దృష్టిసారిస్తే మంత్రద్రష్టలైన అనేక ఋషులవలె, ఋషికలు కూడా కనిపిస్తారు. ఎవరి ద్వారా వేదములు ప్రకటితమయ్యాయో వారిని ఋషులని అంటారు. ఋషులు కేవలం పురుషులే కాదు, వారిలో అనేక మంది స్త్రీలు కూడా ఉన్నారు. పరమేశ్వరుడు స్త్రీల అంతఃకరణలో కూడా వేదజ్ఞానమును ప్రకాశింపచేశాడు. ఎందువలన అంటే వారు ఇరువురు ఆయన సంతానమే. మహాదయాళువు, న్యాయాధీశుడు. నిష్పక్ష భగవంతుడు తన సంతానంలో నరనారీ అనే భేదభావాలు ఎలా చూపించగలడు?

ఋగ్వేదం 10/85లో సంపూర్ణ మంత్రముల ఋషిక 'సూర్య-సావిత్రి' నిరుక్తంలో ఋషి అంటే అర్థం ఇలా చెప్పారు. **'ఋషిర్దర్శనాత్। స్తోమాన్ దదర్శేతి (2.11) ఋషయో మంత్ర**

**తక్షణం పనిచేయడం వలన కల్పవృక్షం అనే చేతనత్వం మీలో అభివృద్ధి చెందుతుంది**

ద్రష్టారః (2.11) అంటే మంత్రముల ద్రష్ట దాని రహస్యములను అర్థం చేసుకుని ప్రచారం చేసే వ్యక్తి ఋషి అవుతాడు.

ఋగ్వేదంలోని 'ఋషిక' ల యొక్క సూచి బృహద్దేవతా 2వ అభ్యాసంలో ఈవిధంగా ఉన్నది.

**ఘోషా గోధా విశ్వవారా, అపాలోపనిషన్నిషత్ ।**
**బ్రహ్మజాయా జహుర్నామ అగస్త్యస్య స్వసాదితి ॥84॥**
**ఇంద్రాణి చేన్ద్రమాతా చ సరమా రోమశోర్వశీ ।**
**లోపాముద్రా చ నద్యశ్చ యమీ నారీ చ శాశ్వతీ । ॥85॥**
**శ్రీర్లాక్ష సార్పరాజ్ఞీ వాక్ర్శద్ధా మేధా చ దక్షిణా ।**
**రాత్రి సూర్యా చ సావిత్రీ బ్రహ్మవాదిన్య ఈఃరితః । ॥86॥**

**అర్థము:** ఘోష, గోధ, విశ్వవార, అపాల, ఉపనిషత్తుల, జహు, ఆదితి, ఇంద్రాణి, సరమ, రోమశ్, ఊర్వశి, లోపాముద్ర, యమీ, శాశ్వతి, సూర్య, సావిత్రి మొదలైన వారందరు బ్రహ్మ వాదినులు.

పురుషుల మాదిరే స్త్రీలు కూడా యజ్ఞములు చేసేవారు, చేసేవారనడానికి ఈవిధంగా అనేక ప్రమాణాలున్నాయి. వారు యజ్ఞవిద్య, బ్రహ్మవిద్యలలో పారంగతులు. అనేకమంది నారీమణులు ఇందులో తమ తండ్రికి, భర్తకు మార్గదర్శనము గావించారు.

తైత్తరీయ బ్రాహ్మణంలో "సోమ" ద్వారా "సీత, సావిత్రి" ఋషికలకు మూడు వేదములు ప్రసాదించే వర్ణన విస్తార పూర్వకంగా వస్తుంది.

**తం త్రయౌ వేదా అన్వస్సృజ్యంత అథహ సీతా సావిత్రీ సోమ రాజనాం చకమే-తస్యా ఉ హ త్రీన్ వేదాన్ ప్రదదౌ।**
**– తైత్తిరీయ బ్రాహ్మణం 2/3/10/13**

ఏవిధముగా సోముడు, సీత, సావిత్రులకు మూడు వేదములు ఒసగినాడో ఈ మంత్రములో చెప్పబడినది.

ప్రాచీన కాలంలో స్త్రీలు గృహస్థాశ్రమములను నడిపేవారు. మరియు బ్రహ్మపరాయణులు గూడా. ఈ రెండు తమ తమ కార్యక్షేత్రాలలో నిర్వహించేవారు.

శతపథ బ్రాహ్మణములో యాజ్ఞవల్క్య పత్ని మైత్రేయి బ్రహ్మవాదినిగా చెప్పబడినది.

**తయోర్హ మైత్రేయి బ్రహ్మవాదినీ భభూవ ।**
**– శ.ప. 14/7/3/18**

పూర్వకాలంలో అనేక సుప్రసిద్ధ బ్రహ్మచారిణులు ఉండే వారు. వారి ప్రతిభ, విద్వత్తు, కీర్తి నలుదిక్కులకు వ్యాపించింది. మహాభారతంలో ఇటువంటి అనేకమంది బ్రహ్మచారిణుల వర్ణన ఇవ్వబడింది.

**భారద్వాజస్య దుహితా రూపేణాప్రతిమా భువి ।**
**శృతావతీ నామ విభో కుమారీ బ్రహ్మచారిణీ ॥**
*– మహాభారతం శల్యపర్వం 48-2*

భరద్వాజునకు శృతావతీయను కుమార్తె కలదు. ఆమె బ్రహ్మచారిణి కుమారియను శబ్దంతోపాటు బ్రహ్మచారిణియను శబ్దమును జోడించుటకు అర్థము ఆమె అవివాహిత అనియు, వేదాధ్యయనం చేయునదని.

**అత్రైవ బ్రాహ్మణీ సిద్ధా కౌమార బ్రహ్మచారిణీ ।**
**యోగయుక్తా దివం మాతా, తపః సిద్ధాః తపస్వినీ ॥**
*– మహాభారతం శల్యపర్వం 54-6*

యోగసిద్ధిని పొంది కుమారిగా ఉన్నప్పుడే వేదాధ్యయనం గావించే తపస్విని సిద్ధా అను పేరుగల బ్రాహ్మణికి ముక్తి ప్రాప్తించినది.

మహాత్మ శాండిల్యుని పుత్రి శ్రీమతి ఆమె వ్రతధారిణి. వేదాధ్యయనమందు నిరంతర ప్రవృత్తి కలిగినది. అత్యంత కఠిన తపస్సొనరించి ఆమె దేవబ్రాహ్మణలచే పూజించబడింది. స్వర్గప్రాప్తి పొందినది.

**అత్రసిద్ధా శివానామ బ్రాహ్మణీ పాదపారగా ।**
**ఆధిత్య సకాలావేదాన్ లేభేసద్ దేహమక్షయమ్ ॥**
*– మహాభారతం, ఉద్యోగపర్వం 180-18*

శివ యను పేరుగల బ్రాహ్మణి వేద పారంగతురాలు. ఆమె అన్ని వేదములనభ్యసించి మోక్షపదమును పొందినది.

మహాభారతంలోని శాంతిపర్వమందు 320 అధ్యాయంలో సులభా పేరుగల బ్రహ్మవాదిని, సన్యాసిని యొక్క వర్ణన కలదు. ఆమె జనక మహారాజుతో శాస్త్రార్థము గావించినది. ఈ అధ్యాయంలో సులభ తన పరిచయము గావించుకుంటూ ఇటుల వచించినది.

**ప్రధానో నామ రాజర్షివ్యక్తం తే శ్రోత్రమాగతః ।**
**కులే తస్య సముత్పన్నా సులభాం నామ విద్ధింమామ్॥**

**ప్రకృతికి అనుగుణంగా జీవించటమే ఆధ్యాత్మికత**

**సో౽హం తస్మిన్ కులేం జాతా భర్తర్యసతి మద్విధే ।**
**వినీతా మోక్షధర్మేషు చరామ్యేకామునివ్రతమ్ ॥**

*- మహాభారతం శాంతిపర్వం-20*

"నేను సుప్రసిద్ధ క్షత్రియకులముతో ఉద్భవించిన 'సులభా' ను నాకు తగిన భర్త దొరకనందున నేను గురువుల నుండి శాస్త్రాధ్యయనమును అభ్యసించాను. సన్యాసమును స్వీకరించాను" అని చెప్పింది. పాండవపత్ని ద్రౌపది విద్వత్తును వర్ణిస్తూ, శ్రీ ఆచార్య ఆనందతీర్థుల వారు (మధ్వాచార్యులు) "మహాభారత నిర్ణయము"లో ఇటుల ఉల్లేఖించారు.

**వేదాశ్చాయుత్తమస్త్రీభిః కృష్ణాద్యాభిరివాఖిలాః ।**

అర్థము: ఉత్తమ స్త్రీలు కృష్ణ (ద్రౌపది) వలె వేదములను అభ్యసించవలెను.

**బ్రహ్మ చర్మేణ కన్యా యువానాం విన్దతే పతిమ్ ।**

*- అధర్వణవేదం 11-7-18*

అర్థము: కన్య బ్రహ్మచర్యానుష్ఠానము గావించుతూ దాని ద్వారా ఉపయుక్తమైన పతిని పొందును.

మహర్షి గార్గ్యాయణాచార్యుల వారు ప్రణవవాదములో నిటుల నుడివినారు.

**బ్రహ్మచారిణాం చ బ్రహ్మచారిణిభిః**
**సహ వివాహః ప్రశస్యో భవతి ।**

అర్థము: బ్రహ్మచారుల వివాహము బ్రహ్మచారిణులతో జరుగుట ఉచితము. ఏలనన జ్ఞానము మరియు విద్య మొదలైన వాటి దృష్టికోణము నుండి సమానులయినందున వారు సుఖంగా, సంతుష్టులుగా ఉంటారు. మహాభారతంలో కూడా ఈ భావము బలపరచబడినది.

**యయోరేవ సమం విత్తం యయోరేవ సమం శృతమ్ ।**
**తయోర్మైత్రీ వివాహశ్చ న తు పుష్ట విపుష్టయోః ॥**

*- మహాభారతం ఆదిపర్వం 1-131-10*

అర్థము: ఎవరి ధనము, జ్ఞానము సమానంగా ఉంటుందో, వారితో మిత్రత్వము, వివాహము ఉచితము. న్యూనాధికములు ఎక్కువ, తక్కువ ఉండదు.

**యాః కన్యా యావచ్చతుర్వింశతివర్షమాయుస్తావద్**
**బ్రహ్మచర్యేణ జితేంద్రియాః**
**తథా సాంగోపాంగ వేదవిద్యా అధీయతే**
**తాః మనుష్య జాతి భూషికా భవంతి ॥**

అర్థము: ఏ కన్య అయినా 24 సం॥ల వయస్సు వరకు బ్రహ్మచారిణిగా ఉండి వేదవిద్యను సాంగోపాంగంగా అభ్యసించిన యెడల, ఆ కన్య మనుష్య జాతిని శోభింపజేస్తుంది.

విద్యాధ్యయనము గావించుటకొరకు ఎప్పుడు స్త్రీలకు పురుషులవలె అవకాశమిస్తారో, అప్పుడు ఈ దేశంలో స్త్రీలు గార్గీ, మైత్రేయిలవలె విదుషీమణులవుతారు.

ఈరోజున స్త్రీలను శాస్త్రాధ్యయనము చేయకుండా నిరోధించుచున్నారు. ఆరోజులలో ప్రస్తుతమున్న ప్రతిబంధము ఉన్న యెడల యాజ్ఞవల్క్యుని, శంకరుల వారిని పోటీ చేయగల స్త్రీలెలా ఉండగలిగారు? ప్రాచీనకాలంలో అధ్యయనం చెయ్యడం నరనారులిద్దరకు సమాన అవకాశములుండేవి.

స్త్రీలు యజ్ఞబ్రహ్మలుగా ఉన్నారనుటకు ఉపాధ్యాయులు గాను, ఆచార్యులుగా ఉండేవారనే దానికి ప్రమాణాలున్నాయి. ఋగ్వేదంలో స్త్రీలను సంబోధిస్తూ, నీవు ఉత్తమ ఆచరణ ద్వారా బ్రహ్మపదమును పొందగలవు అని చెప్పబడినది.

**ఆచార్యస్య స్త్రీ ఆచార్యాణీ పుంయోగ ఇత్యేవ**
**ఆచార్య స్వయం వ్యాఖ్యాత్రీ**

అర్థము: స్త్రీ వేదములకు ప్రవచనము జేయుచున్నందున ఆచార్య అనుబడుచున్నది. ఆచార్య లక్షణములను మనువు ఇలా వచించారు.

**ఉపనీయ తు యః శిష్య వేదమధ్యాపయేద్ ద్విజః ।**
**సంకల్పం సరహస్యం చ తమాచార్య ప్రచక్షతే ॥**

అర్థము: శిష్యునకు యజ్ఞోపవీత సంస్కారము గావించి కల్పసహిత, రహస్యసహిత వేదమును ఎవరు నేర్పెదరో వారిని ఆచార్యుడు అంటారు.

**ఇతి వ చనేనాపి స్త్రీణాం వేదాధ్యయనాధికారో ధ్వనితః॥**

అర్థము: దీనివలన స్త్రీలకు వేదాధ్యయనము గావించుటకు అధికారము ఉన్నదని విదితమవుతుంది.

పైన చెప్పబడిన ప్రమాణములను పరిశీలించిన పాఠకుడు స్త్రీలకు గాయత్రీ ఉపాసన చేయుటకు అధికారము లేదని చెప్పడం ఎంతవరకు సమంజసం?

*- గాయత్రీ మహావిజ్ఞాన్ నుండి*


**మనుష్యులు దేవతలు కలిసి పనిచెయ్యవలసిన సమయం ఆసన్నమయింది**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-31

# స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి - 4

### సంపాదకత్వం

పాలీవాల్‌జీ ఉద్యమం, సంఘటనల పని చూస్తూ బయట ఉండేవారు. శ్రీరామ్ వచ్చిన తర్వాత ఆయనకు కొంత నిశ్చింత ఏర్పడింది. పూర్తి సమయం ఇచ్చి పని చేయడానికి వచ్చిన తర్వాత ఈ క్రొత్త పాత్రికేయుడు మొదటి రోజే పత్రికలో $2^1/_2$ పుటలను తయారుచేశారు. అది నాలుగు పుటల పత్రిక. మొదటి రోజున స్థాపించిన ఈ రికార్డు ద్వారానే కాక, గతంలో చేసిన పనుల ద్వారా కూడా పాలీవాల్‌జీ మనస్సుపై శ్రీరామ్ చెరగని ముద్ర వేశారు. ఈయన వచ్చిన తర్వాత పాలీవాల్‌జీ నిశ్చింతగా ఉండసాగారు.



'సైనిక్' పత్రికలో ప్రచురితం అవుతున్న వ్యాసాలు, వార్తలు ప్రభుత్వానికి ఆందోళన కలిగించాయి. ఉద్యమకారులకు 'సైనిక్' కార్యాలయం స్థావరం కావడం ప్రభుత్వాన్ని మరింతగా కలవరపరిచింది. ఈ ఆందోళనను, ఈ కలవరాన్ని తొలగించుకోవడానికై ప్రభుత్వం సైనిక్ పత్రికను మూసివేయించేందుకు పథకాన్ని తయారుచేసింది. ఉద్యమం కొద్దిగా మందగించడంతో, ఆ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వానికి అవకాశం దొరికింది. ఆయుధాలు కలిగి ఉన్నారనే ఆరోపణపై ప్రభుత్వం ఇద్దరు పాత్రికేయులను అరెస్టు చేసింది. 6-7మంది ఉద్యోగులను బెదిరించి, పనిలోకి రాకుండా వారిని అడ్డుకున్నది.

ఇలా అనేకమంది ఉద్యోగులు పనిలోకి రాకపోవడంతో 'సైనిక్' పత్రిక తాజా సంచికను ప్రచురించే సమస్య ఎదురయింది. ఆ సమయంలో పాలీవాల్‌జీ సంస్థ పనిమీద పొరుగూరు వెళ్ళారు. ఆయనకు కబురు చేయడానికి వ్యవధి లేదు. కబురు పంపినా ఏమవుతుంది! ఆయన వచ్చేసరికి 'సైనిక్' పత్రిక వెలువడే సమయం దాటిపోతుంది. కార్యాలయంలో మిగిలి ఉన్న ఉద్యోగులు, పాత్రికేయులు ఈ మీమాంసలో పడ్డారు.

ఇటీవలనే పత్రికలో చేరిన శ్రీరామ్ అందరి చింతలకు పరిష్కారం సూచించారు. అందుకు తనను తాను సమర్పించుకున్నారు. సమాచారాన్ని సేకరించడం నుండి దానిని వ్రాయడం, కంపోజు చేయడం, ప్రూఫ్ దిద్దడం వరకు అన్ని పనుల భారాన్ని తనమీద వేసుకున్నారు. వార్తాపత్రిక సమయానికి వెలువడడం సాధ్యం కాదని తోటి ఉద్యోగులు భావించారు. వారు మధ్యలో విమర్శలు చేయసాగారు. నిష్క్రియంగా చేతులు ముడుచుకుని కూర్చుని చింతించడం వలన సాధ్యమయ్యే పనిలో కూడా ఇబ్బందులు ఏర్పడతాయి. శ్రీరామ్ తన సహచరులకు ఆ విషయం నచ్చజెప్పారు. ఇలా అనుమానాలు వ్యక్తం చేయడం కన్నా మౌనంగా ఉండడం మంచిదని ఆయన వారికి సూచించారు. పనిపట్ల నిజంగా శ్రద్ధ ఉంటే ఎంతో కొంత సహకారం అందించవలసిందని ఆయన వారిని కోరారు.

ఇద్దరు సహచరులు తమ పొరపాటు గుర్తించారు. వారు కూడా పనిలో నిమగ్నం అయ్యారు. వారికి మెషీన్ నడపడం తెలుసు. ఇలా ముగ్గురు వ్యక్తులతో చక్కని జట్టు ఏర్పడింది. ఆ రోజు వార్తాపత్రిక తయారై బజారులోకి వచ్చింది. 'సైనిక్' పత్రికను మూసి వేయించడానికి కుట్ర పన్ని, పత్రిక మరునాటి సంచిక వెలువడదని భావించిన అధికారులు దిగ్భ్రాంతి చెందారు. ముగ్గురు వ్యక్తుల జట్టు వార్తాపత్రికను వెలువరించింది. 'సైనిక్' పత్రిక ఇబ్బందులలో ఉన్నదని ఆ పత్రికలోని పంక్తులలో, ముద్రణలో ఏమాత్రం కనిపించలేదు.

మరునాటి సంచిక కూడా అదే స్థాయిలో వెలువడింది. ఆ సంచికలోని మొదటి పుటలో శ్రీరామ్ ఒక నివేదన వ్రాశారు. గత రెండు రోజులలో పత్రికపై జరిగిన అప్రకటిత చర్యను గురించి అందులో వివరించారు. ఆ చర్యను దమనచర్యగా వర్ణిస్తూ, సైనిక్ పరివార్ సభ్యుల జీవాన్ని, జనాన్ని అందులో తెలియచెప్పారు. ఆ నివేదనకు మంచి ప్రతిస్పందన వచ్చింది. కార్యకర్తలుగా తమను తాము అర్పించుకుంటూ వ్యక్తులు

**పనిచేసే విధానం తెలిస్తే అసంభవాన్ని సంభవం చేయగలరు**

ఆరోజు మధ్యాహ్నం నుండే కార్యాలయానికి రాసాగారు. వీరు మామూలు పాఠకులు మాత్రమే. పత్రికారచనలో కాని, ముద్రణలో కాని వీరికి ఎలాంటి అనుభవం లేదు. అయినా, వీరు చూపిన నిష్ఠ సైనిక కార్యాలయంలో అద్భుతశక్తిని నింపింది. గతంలో కార్యాలయాన్ని విడిచి వెళ్ళిపోయిన ఉద్యోగులు తిరిగి రాసాగారు. వారిలో ధైర్యసాహసాలు మేలు కొన్నాయి. మరునాటి నుండి పత్రిక ఆఫీసులో మామూలు పరిస్థితి ఏర్పడింది.

## సైనిక్‌కు దొరికాడు సేనాపతి

మూడవ రోజున పాలీవాల్‌జీ తిరిగివచ్చారు. 'సైనిక్'పై ప్రమాదం వచ్చిపడిన కబురు ఆయనకు అందింది. ఆయన చింతించారు. కార్యాలయానికి వచ్చి చూస్తే పని అంతా యథా ప్రకారం జరిగిపోతోంది. ప్రమాదం ఎంత తీవ్రతమైనదో, అది ఎంతటి సవాలుగా పరిణమించిందో అక్కడి సహచరులు ఆయనకు వివరించారు. ఆ ప్రమాదకర పరిస్థితి నుండి వెలికి వచ్చిన కథను కూడా పాత్రికేయులు, ఉద్యోగులు ఆయనకు వినిపించారు. 'సైనిక్' మొదటి పుటలో ముద్రించబడిన నివేదనను చదివి ఆయన గద్గదులు అయినారు. ఆ నివేదనలో వ్యక్తమైన విజ్ఞతను, నిష్ఠను గుర్తించి, ఆయన పరవశించి పోయారు. శ్రీరామ్‌ను కౌగలించుకున్నారు. ఆయన మనస్సు మహోల్లాసంతో నిండిపోవడంతో, ఆయన నోట మాట రాలేదు. శ్రీరామ్ వీపు తట్టుతూ రుద్ధమైన స్వరంతో ఆయన ఇలా అన్నారు – 'సైనిక్‌కు సేనాపతి లభించాడు.' శ్రీరామ్ మౌనంగా ఇదంతా చూస్తూ, వింటూ ఉండిపోయారు.

పాలీవాల్‌జీ ఆ వెంటనే పత్రిక వ్యవస్థకు కొత్త రూపు ఇవ్వడం ప్రారంభించారు. గత మూడు నాలుగు రోజులలో ఆకృతి పొందిన రూపాన్ని పెద్దగా సంస్కరించవలసిన అవసరం ఏర్పడలేదు. శ్రీరామ్‌కు క్రొత్త సహాయకులను ఎంపిక చేశారు. పాతవారిలో కొందరు పత్రిక వదలి వెళ్ళిపోయారు. ఇద్దరు మాత్రమే కార్యాలయానికి వస్తున్నారు. వారికి సంపాదకత్వ బాధ్యత, ప్రొడక్షన్ బాధ్యతలు అప్పగించారు. క్రొత్తగా ఎంపిక చేసిన వ్యక్తులలో ఒకరికి పంపిణీ పని అప్పగించారు. శ్రీరామ్‌కు ప్రధానంగా సంపాదకత్వ బాధ్యత మాత్రమే మిగిలింది. పత్రిక నడపడంలో ఆయనకు ప్రత్యేక అనుభవం లేదు. పూర్వం కన్నా ఎక్కువ సమయం పత్రిక కోసం తాను ఇస్తానని పాలీవాల్‌జీ అన్నారు. 'సైనిక్' పత్రిక నడవడానికి శిక్షణ ఇచ్చిన తర్వాతనే పోరుగూళ్ళకు వెళ్ళాలని ఆయన నిర్ణయించుకున్నారు. మాటల సందర్భంలో ఆయన శ్రీరామ్‌తో ఇలా అన్నారు –

'నాకు కుడి చేయి దొరికింది. 'సైనిక్' కుటుంబంలోనే ఉంటానని, దీనిని విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళనని నాకు మాట ఇవ్వు"

## వాగ్దానం కాదు, సంకల్పం

ఇందుకు జవాబివ్వడానికి శ్రీరామ్‌కు క్షణం కూడా పట్టలేదు. ఆయన ఇలా అన్నారు –

'పరిస్థితులు ఎప్పుడు ఎక్కడికి తీసుకుపోతాయో ఎవ్వరు చెప్పలేరు. కనుక, నేను మాట ఇవ్వను. కానీ మీరు నన్ను ఎల్లప్పుడు సహచరునిగానే పరిగణిస్తారని మాత్రం నేను గట్టిగా చెప్తున్నాను.'

ఆ మాట విన్న పాలీవాల్‌జీ తాను ఆశించింది భావావేశ పూరితమైనదని గుర్తించారు. శ్రీరామ్ ఇంతవరకు చెప్పడం కూడా ఆయనకు సంతృప్తి కలిగించింది.

స్వరాజ్య ఉద్యమపు వేడి తాత్కాలికంగా చల్లబడింది. కొన్ని నెలలవరకు వాతావరణం శాంతిస్తున్నట్లు కనిపించింది. లండన్‌లో జరిగే రెండవ రౌండ్‌టేబుల్ సమావేశానికి కాంగ్రెసుకు ఏకైక ప్రతినిధిగా గాంధీజీ ఆహ్వానించబడ్డారు. మొదటి రౌండ్‌టేబుల్ సమావేశం 1930 నవంబరులో జరిగింది. దానిలో కాంగ్రెసు ప్రతినిధిగా ఎవరు పాల్గొనలేదు. కనుక అది ఏకపక్షంగానే మిగిలిపోయింది. అయినా, కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు శాసన సంబంధమైన బాధ్యతలు అప్పగించడానికి బ్రిటీష్ ప్రభుత్వం అంగీకరించింది. కాంగ్రెస్ దీనిపట్ల ప్రత్యేకమైన ఉత్సాహం చూపలేదు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశం 1931 సెప్టెంబరు నుండి డిసెంబరు వరకు జరుగవలసి ఉన్నది. మహాత్మాగాంధీ దానిలో పాల్గొనడంతో, దాని సాఫల్య వైఫల్యాల విషయంలో రకరకాల అభిప్రాయాలు వ్యక్తం కాసాగాయి. సమాజంలో ఆ అభిప్రాయాలపై చర్చ జరుగుతోంది. సమావేశ సమయం సమీపిస్తున్న కొద్దీ ప్రజలలో ఉత్సుకత పెరుగుతూ వచ్చింది.

గాంధీజీ లండన్ వెళ్ళడానికి పూర్వమే శాసనసభలలో మతం ఆధారంగా ప్రాతినిధ్యం ఇవ్వడం అనే సమస్య

**కష్టపడితే సరిపోదు, ఆకర్షించే గుణం ఉంటే ధనం వస్తుంది**

ఉదయించింది. ముస్లింలీగ్ అలాంటి ప్రాతినిధ్యాన్ని కోరుతోంది. ఆంగ్లేయులు దానికి ప్రాణం పోశారు. ఈ కోరిక నుండే పాకిస్థాన్‌కు బీజం పడిందని చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు. మతం ఆధారంగా ప్రాతినిధ్యాన్ని ముస్లింలు ఒక్కరే కోరడం లేదు. సిక్కుల, క్రైస్తవుల, జైనుల, పార్శీల, గిరిజనుల సంస్థలు కూడా దానిని కోరుతున్నాయి. రెండవ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఈ సమస్య ఆవరిస్తుందనే అనుమానం ఆ సమయంలో వ్యక్తమయింది. అలాగే జరిగింది కూడా.

రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానాన్ని గాంధీజీ అంగీకరించిన నాటి నుండి ఆ సమావేశం పూర్తయ్యేవరకు గల కాలవ్యవధిలో శ్రీరామ్ 'సైనిక్' పత్రికలో వ్యాఖ్యలు వ్రాశారు. 'మత్త', 'శ్రీరామ్', 'శ్రీరామ్‌శర్మ' మున్నగు పేర్లతో వ్యాసాలు, విశ్లేషణలు, ఉత్సాహాన్ని ఉప్పొంగింపజేసే గీతాలు, వ్యాఖ్యలు వ్రాశారు. వాటివల్ల పత్రికకు ప్రజాదరణ బాగా పెరిగింది. ఆయన రచనలకు మూలాధారం జాతీయత. ఆయన స్పష్టంగా, సూటిగా ఇలా వ్రాశారు.

'భారత్‌లో నివసించే ప్రజలందరు మొదట భారతీయులు, ఆ తర్వాతనే వేర్వేరు మతాలవారు, ప్రాంతాలవారు, కులాల వారు. వేర్వేరు అభిరుచులు, ప్రకృతులు, స్వభావాలు కలిగిన ప్రజలు ఇక్కడ నివసిస్తూ వచ్చారు. వారి విశ్వాసాలకు ఆదరణ లభించేది. మన విశ్వాసాలకు దూరం కాకుండా ఇతరుల పట్ల సద్భావ, సహకార సంబంధాలను నిలిపి ఉంచుకునేవాళ్ళం మనం. ఈ సూత్రం ఆధారంగానే దేశంలో సామరస్యాల వాతావరణం ఉండేది.'

శ్రీరామ్ వ్యాసాలలో చరిత్ర నుండి, పురాణాల నుండి పెక్కు సంఘటనలు, పెక్కు సూక్తులు ఇవ్వబడేవి.

ఏడెనిమిది వారాలలోనే శ్రీరామ్ తన పాఠక గుణాన్ని నిర్మాణం చేసుకున్నారు.

### మొదటి ఉపన్యాసం

అనుమానించిన విధంగానే మహాత్మాగాంధీ లండన్ నుండి బయలుదేరకముందే, భారత్‌లో దమనకాండ ఉధృతం అయింది. శ్రీరామ్ మొదటి నుండి పంచ, లాల్చీ ధరించేవారు. 'సైనిక్'లో పని చేస్తున్నప్పుడు ఆయన దానిలో కొంత మార్పు చేశారు. ఒక్కోసారి నిక్కరు, కమీజులు కూడా ధరించసాగారు. పనిచేస్తున్న సమయంలో, ప్రదర్శనలు, సత్యాగ్రహాల సమయంలో ఆయన ఇవి ధరించేవారు. ప్రదర్శనల సమయంలో ఆయన చేతిలో ఒక చిన్న లాఠీని పుచ్చుకునేవారు. గ్రామంలో జెండా ఊరేగింపు జరిగిన తర్వాత ఆయన శ్రీకృష్ణుని మురళివలె చేతిలో చిన్న లాఠీ పుచ్చుకొనసాగారు. భుజానికి తరచుగా ఒక సంచి వ్రేలాడుతూ ఉండేది. ఆ సంచిలో ఒకటి రెండు పుస్తకాలు, రుమాలు, ఇంకొక చిన్న సంచి ఉంచేవారు. రౌండ్ టేబుల్ సమావేశంలో చేసిన ప్రతిపాదనలు తిరస్కరించి గాంధీజీ స్వదేశానికి తిరిగివచ్చిన రోజున శ్రీరామ్ పూర్తిగా సత్యాగ్రహి వేషం ధరించారు. కార్యాలయం వెలుపలికి వచ్చారు.

ఆయన న్యూస్‌ప్రింట్ కాగితం మీద సిరాతో పెద్ద పెద్ద అక్షరాలతో 'మహాత్మాగాంధీకి జై' అని వ్రాసి, ఆ పోస్టరును బయట గోడకు అతికించారు. ఆ దారిన వెళ్ళేవారు ఆ పోస్టరు చూడడానికి ఆగారు. 8-10 మంది పోగయారు. అప్పుడు శ్రీరామ్ చిన్న ఉపన్యాసం ఇచ్చారు.

మహాత్మాగాంధీ స్వదేశానికి తిరిగిరావడం, దానిలో ఇమిడి ఉన్న జాతీయ సమైక్యతా సందేశం-ఆ ఉపన్యాసంలోని విషయం. శ్రీరామ్ ఉపన్యసిస్తూ నిలబడ్డ స్థలం కార్యాలయం గోడను ఆనుకొని ఉన్న అరుగు. జనం వింటూ నిలబడ్డ స్థలం 'సైనిక్' కార్యాలయ ప్రాంగణం.

ఏర్పాటయిన సభ కాదది. శ్రీరామ్ అందుకు తయారు చేసుకోలేదు. ఆయన యథాలాపంగా వెలుపలికి వచ్చారు. పోస్టరు చూడడానికి ఆగిన జనాన్ని చూసి ఉత్సాహం పొందారు. ఆ ఉత్సాహంలోనే ఆయన మాట్లాడడం ప్రారంభించారు. శ్రీరామ్ చేసిన మొదటి బహిరంగ ఉపన్యాసం ఇది. ఇంతకు ముందు సంభాషణలలో, గోష్ఠులలో, సమావేశాలలో మాత్రమే ఆయన మాట్లాడారు. వాటిలో మాట్లాడడం చర్చయే అవుతుంది. వాటిలో ఇతరులు కూడా సమానంగా పాల్గొన్నారు.

ఈ ఉపన్యాసం సంగతి పాలీవాల్‌జీకి తెలిసింది. ఆయన శ్రీరామ్‌ను అభినందించారు. ఆయన ఇలా అన్నారు -

'మీ సామాజిక జీవితంలో ఒక క్రొత్త అధ్యాయం ఇది. సందర్భం కూడా ఎంతో మహత్తరమైనది; ఆంగ్లేయుల కుట్రను భగ్నం చేసి మహాత్మాగాంధీ భారత్‌కు తిరిగివచ్చిన రోజు.'

**గురువు కంటే గురువు పాదాలు ముఖ్యం**

గాంధీజీ సేవకు సేనాని అయిన ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వంలో క్రొత్త పువ్వు తొడిగి సువాసన గుబాళించడం అన్నది ఆయనను పరవశింపజేసింది.

ఆగ్రాలో శ్రీరామ్ 'సైనిక్' కార్యాలయం వెలుపల ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో, లేదా కొద్దిసేపటి తర్వాత, గాంధీజీ బొంబాయిలో ఒక సభలో ప్రసంగిస్తున్నారు. వారి ఉపన్యాసం వినడానికి జనం తండోపతండాలుగా వచ్చారు. వారు ఆయన చెప్పింది వింటున్నది తక్కువ, దానిని అనుభూతి పొందుతున్నది ఎక్కువ. కొల్లాయి గుడ్డ కట్టుకున్న మహాత్మా గాంధీ ఇంగ్లాండుకు వెళ్ళడం, అక్కడ తన ప్రభావాన్ని చూపి తిరిగిరావడం – ఈ వార్తయే ప్రజలకు గగుర్పాటు కలిగిస్తోంది. సమరాన్ని మరోవైపు నుంచి ప్రారంభించవలసిన అవసరాన్ని గాంధీజీ ఆ సభలో నొక్కి చెప్పారు.

మూడు రోజుల తర్వాత 1932ల సంవత్సరం మొదటి రోజున కాంగ్రెసు కార్యవర్గం సహాయనిరాకరణ ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. ఈసారి విదేశీ వస్తువుల బహిష్కరణ జరపాలని కూడా పిలుపు ఇచ్చింది. ఉద్యమం తిరిగి ప్రారంభిస్తామనే ప్రకటన పౌరులలో ఉత్సాహాన్ని నింపింది. ప్రజలు ముందుగానే తయారై ఉన్నారని ఆ పిలుపునకు వచ్చిన ప్రతిక్రియను బట్టి స్పష్టమయింది. ఉద్యమం ప్రారంభమవు తోందనే ప్రకటన వెలువడగానే ఏ చర్యలు తీసుకోవాలో కూడా ప్రజలకు తెలిసి ఉండవచ్చు.

బ్రిటీష్ ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని ముందుగా ఊహించింది. గాంధీజీ దేశానికి తిరిగిరాగానే, ప్రభుత్వం విప్లవభావాలు కలిగిన వ్యక్తులను అరెస్టు చేయడం ప్రారంభించింది. ప్రకటన వెలువడిన నాటికి మూడవ రోజున ప్రభుత్వం మహాత్మాగాంధీని అరెస్టు చేసింది. కాంగ్రెసు సంస్థ చట్టవిరుద్ధమైన సంస్థ అని ప్రకటించింది. ఆ సంస్థ గురించి ప్రచారం చేసే కార్యకర్తలపై, పత్రికలపై, సభ్యులపై దమన కాండ సాగించింది. జాతీయ ఉద్యమాన్ని గురించి వివరించే వార్తాపత్రికలను ప్రభుత్వం నిషేధించింది. ఆగ్రాలో 'సైనిక్' కార్యాలయం మూతపడింది. దాని నిర్వాహకులు, కార్యకర్తలు అక్కడక్కడ దాక్కున్నారు.

*(సశేషం)*

## వెలుగు మార్గం

*వెలుగు మార్గంలో పయనించే వానికి దైవీ సంరక్షణ వెన్నంటి ఉంటుంది. దీపం వెలుగుతూ ఉన్నది. దానిలోని నూనె నిండుకుంటున్నది. దీపకాంతి క్రమక్రమంగా క్షీణించసాగింది. గాలికెరటం దీనిని గమనిస్తున్నది. దీపంపై విజయం సాధించుటకు ఇది అత్యంత సానుకూల సమయమని గాలి భావిస్తున్నది. దీనిని ఆసరాగా చేసికొని వాయువు అలలు–అలలుగా దీపంపై దాడి చేసింది. చీకట్లు అలుముకుంటున్నాయి. అప్పుడు వాయువు దీపంతో ఇలా అన్నది. "దీపమా! ఇప్పుడు నీకు ఆఖరి క్షణాలు దాపురించాయి. మరికొద్ది సేపట్లో ఇచ్చట నా సామ్రాజ్యం స్థాపించబడనున్నది." దీనికి దీపం చిరునవ్వు నవ్వి, ఇలా అన్నది "ఎవరి సామ్రాజ్యం పోవాలి లేక రావాలి లేక నిలవాలి అనే దానిని చూసుకొనవలసినది విధాత పని. నా లక్ష్యం కేవలం ప్రకాశాన్ని విరజిమ్ముతూ నిరంతరం వెలుగుతూ ఉండుటే. కావున అంతిమ ఘడియల గురించి చింత నాకేల.*

*దీనిని గురించి కొంత తడవు యోచించిన పిదప, అంతిమ క్షణాలు రాగానే, దీపం తన యావత్‌శక్తిని కూడ తీసికొని ప్రకాశించినప్పటికి అచ్చట సంపూర్ణ అంధకారం అలుముకొన్నది. కానీ దీపం యొక్క ఈ బలిదానం వృథా కానివ్వని విధాత మరుక్షణంలో సూర్యోదయపు అరుణారుణకాంతులను ప్రసరింపజేశాడు. వెలుగు మార్గంలో ఒంటరిగా ముందుకు సాగేవాడు ఎన్ని అపజయాలెదురైనా దైవీసంరక్షణ ఎల్లవేళలా అతనికి విజయాన్ని చేకూర్చుతూ, లెక్కకు మించిన వరదానాలకు అధిపతిని చేస్తుంది.*

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2013*
*అనువాదం: ఎ. శారద*

**గురుపాదములు జీవించే విధానమును తెలుపుతాయి**


కుండలినీ మహావిజ్ఞానం-16

# నవసృజన కొరకు సాధనా పరాక్రమం

పురాణములలో ఒక వర్ణన వస్తుంది. అప్పటి పరిస్థితులతో బాధపడి విశ్వామిత్రుడు ఒక సమానాంతర ప్రపంచాన్ని తయారు చేయడానికి నిశ్చయించుకుని, దీనికొరకు తగిన సామర్థ్యాన్ని ప్రాప్తించుకొనుట కొరకు ప్రచండమైన తపస్సు మొదలుపెట్టాడు. ఆయన తపస్సు ఫలించింది. ఆయన తన కార్యక్రమాన్ని మొదలుపెట్టాడు. కానీ దేవగణములు సమానాంతరంగా ప్రపంచాన్ని తయారుచేస్తే వచ్చే కష్టాలను ఆయనతో మొరపెట్టు కున్నాయి. ఆయన ప్రయత్నాన్ని ఆపమని వేడుకున్నాయి. ఆయన వారి కోరికను మన్నించారు.

సమానాంతర విశ్వం నిర్మించడం క్రొత్త విషయం కాదు. అది మొదటి నుంచి ఉన్నదే. అది అదృశ్యంగా అనుభూతి ఆవల ఉన్నది. కానీ ఉన్నది. ఆ శక్తిని పొంది కూడా ఆ సాహసం చేయకపోవడానికి కారణం ప్రస్తుతం ఉన్న ప్రపంచం యొక్క పరిస్థితి గందరగోళమయితుందని, దాని రూపురేఖలు మారిపోతాయనే భయం.

పరమాణు ప్రతిద్వంది (opposite) యాంటి ఆటం (anti atom), పదార్థం యొక్క ప్రతిద్వంది యాంటి మేటర్ (anti matter). విశ్వం యొక్క ప్రతిద్వంది యాంటి యూనివర్స్ (anti universe). దీని శక్తిని పదార్థ విజ్ఞానులు స్వీకరించారు. అది శరీరం యొక్క నీడవలె అంటిపెట్టుకుని ఉంటుంది. ఇది త్రాసు యొక్క రెండు సిబ్బెలవలె, సైకిల్‌కి ఉన్న రెండు చక్రములవలె బేలన్స్ (balance) చేస్తూ ఉంటుంది. దృశ్యమానజగత్తు చిరకాలం నుండి అలాగే నడుస్తున్నది. ఆ కారణం వలన పదార్థం తన ఇరుసు చుట్టూ తాను తిరుగుతుంటుంది. తన కక్ష్యను పట్టుకునే సామర్థ్యం ఉంటుంది. చిన్న ఘటకములు తనకన్నా పెద్ద శక్తి కేంద్రముల పరిక్రమ (ప్రదక్షిణ) చేస్తూ విశ్వవ్యవస్థ యొక్క నిర్ధారిత పరిక్రమలు చేస్తుంటాయి.



పిండములో ఉన్న
చేతనత్వ కుండలినీ సత్తా

నీటిలో సుడిగుండాలు, గాలిలో చక్రవాకములు, బ్రహ్మాండంలో బ్లేక్‌హోల్ (Black Hole) వంటివి కనిపించి నప్పుడు ఏదో ప్రతిపక్షశక్తి సామాన్య ప్రవాహమును ఆపి వేస్తూ ఇటువంటి ఆశ్చర్యజనకమైన దృశ్యమును ప్రకటింప చేస్తుంది. లేకపోతే సామాన్య ప్రవాహములో ఇటువంటి గందర గోళం రావలసిన అవసరం లేదు. జలపాతాలలో పైనుండి క్రిందకి నీరు పడినప్పుడు అక్కడ ఇటువంటి సుడిగుండాలు చూడవచ్చు.

ఈవిధముగా నేరుగా ఉన్నదానిని తల్లక్రిందులు చేసే అగణిత ఘటనలు జరుగుతుంటాయి. తుఫానులో ఎంతో శక్తి ఉంటుంది. అది పెద్ద పెద్ద ఇళ్ళను, ద్వీపాలను, పెద్ద పెద్ద బండలను ఎక్కడి నుంచి ఎక్కడికో విసిరి వేస్తుంది. నదుల సుడిగుండాలలో పడవలు మునిగిపోతాయి. సముద్రంలోని సుడి గుండాలు పెద్ద పెద్ద స్టీమర్లను సమాధి చేస్తాయి. బర్ముడా వంటి బ్లేక్‌హోల్ (bermuda traingle - black hole) పెద్ద పెద్ద ఓడలను ఆకాశంలో ఎగిరే విమానాలను, అదృశ్యం చేసింది.


పృథ్వి యొక్క గురుత్వాకర్షణ శక్తి, అయస్కాంత శక్తి అది తిరుగుతుండటం వలన కలుగుతుందని భావిస్తుంటారు. కానీ ఆధునిక వైజ్ఞానికులు పృథ్వి యొక్క సమతుల్యమైన పదార్థ పిండం యాంటివరల్డు (anti world) ప్రతివిశ్వం తిరుగు తున్నదని, దాని వలన ఈ రెండు శక్తులు తయారవుతున్నాయని భావిస్తున్నారు. ఇంతేగాక అది సురక్షాకవచంవలె పని చేస్తుందని,

**ఆధ్యాత్మిక విద్య నేర్చుకుంటే అన్ని విద్యలు నేర్చుకున్నట్లే**

అంతరిక్షీయ వికిరణాలు, ఉల్కాపాతాలు భూతలంపై పడకుండా రక్షిస్తుందని చెప్తారు.

ఈ ప్రతిద్వంది శక్తి నీడవలె ఉంటుంది. కానీ ప్రతి విశ్వం యాంటి యూనివర్స్ (anti universe) ముందుకు వచ్చి, దృశ్య జగత్తు వెనకకు వెళ్తే అంతా క్రొత్తగా మారిపోతుంది. క్రొత్త పదార్థములు, కొత్త ప్రాణులు, క్రొత్త మనుష్యులు పుట్టుకు వస్తారు. వారికి నడక, స్వభావం క్రొత్తగా ఉంటాయి.

ఇది సంభవమేనా? మనిషిని మించిన వారు ఎవరు లేరు. భగవంతుడు మనిషిని తయారు చేయడమనేది సత్యమే. మనిషే భగవంతుడిని తయారు చేశాడనేది కూడా తప్పుకాదు. అన్య ప్రాణులు ఏది భగవంతునిని అర్థం చేసుకోలేవు. మనుష్యుడే ఆయనను అర్థం చేసుకున్నాడు, ఎవరికి ఎంత వరకు అర్థం అయిందో అలాంటి ఆకృతితో భగవంతుడి రూపొందించారు. మనిషి భగవంతుని యొక్క యువరాజు అని ఒప్పుకుని తీరాలి. మనిషిని మించిన వాడు ఎవరు లేరని వ్యాస మహర్షి చెప్పినది అక్షర సత్యము.



**విరాట్‌తో సంపర్కమును జోడించే సాధనా పరాక్రమం**

పృథ్వి తన ఇరుసు (axis)ని తరచు మార్చుకుంటుంది. ఆ స్థానం కనుక తెలిసినట్లయితే అక్కడికి వెళ్ళిన మనిషి ఒక్క దెబ్బ గట్టిగా కొడితే పృథ్వి తన కక్ష్యను మార్చు కుంటుంది. ఇప్పుడు ఉన్న సంవత్సరంలో 365 రోజులు, రోజుకి 24 గంటలు మారిపోవచ్చు, ఎక్కువ తక్కువలు అవవచ్చు. ఇంతేగాక ఉష్ణోగ్రతలు ఎక్కువ తక్కువలు అవవచ్చు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో చాలా మార్పులు వస్తాయి.

మనిషి యొక్క స్థూల శారీరిక శక్తి ఇంత చేయగలిగితే అతని చేతనత్వ శక్తి ఎంత పని చేయగలరు? శారీరిక శక్తి కన్నా చేతనత్వ శక్తి అసంఖ్యాకమైన రెట్లు ప్రచండమైనది. మనిషి తన సమగ్ర క్షమతను కూడగట్టుకుని ఒక విలక్షణమైన దెబ్బకొడితే ఎంత భయంకరమైన పరివర్తన జరుగుతుందో చెప్పలేము.

ఈనాటి భూమండలం మీద ప్రమాదకరమైన పరిస్థితులలో మార్పు తీసుకురావడం అంత తేలిక కాదు. కానీ పరిస్థితులలో మార్పు రావలసినదే. ఈ పరిస్థితులు ఎలా మారతాయి? పరిస్థితులను విశ్లేషించడం వ్యర్థమైన పని. కానీ లోతుగా ఆలోచించితే పరిస్థితులు నిర్మాణానికి కారణం మానసిక స్థితి అని అర్థమవుతుంది. మనస్సు ఆకాంక్షలను ప్రభావితం చేస్తుంది. ఆకాంక్షలు పనిచేయడానికి ప్రోత్సహిస్తాయి, పనులు అన్నీ కలసి పరిస్థితులు తయారవుతాయి. మనస్సే పరిస్థితులకు నిర్మాత – విధాత కూడా.

అందువలన ఈనాటి పరిస్థితులను మార్చడానికి మనుష్యుల ఆలోచనాసరళిని మార్చాలి. దీనికొరకు చేసే భౌతిక ఉపాయాల వలన, ప్రచారం వలన, లేక ప్రశిక్షణ వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. నీతి, ధర్మం, దేశభక్తి, కర్తవ్యం, సంస్కృతి గురించి ఉపన్యాసములు చెప్పేవారి మాటలు ఆచరణలో లేకపోతే వారి మాటలకు విలువ ఏముంటుంది? దొంగలను పట్టుకోవలసిన వారే దొంగతనం చేస్తుంటే ఎలా ఉంటుంది? ఆలోచనలలో మార్పు రావాలంటే అంతః కరణలో మార్పు రావాలి. దీనినే అంతరాత్మ అని కూడా అంటారు. మహాపురుషుల శరీరం లేక వారి సాధనములు గొప్పవిగా ఉండకపోవచ్చు. కానీ వారి గొప్పదనమంతా వారి అంతఃకరణలో ఉంటుంది. అది చాలా ఉన్నత స్థాయిలో ఉంటుంది. మామూలు మనుష్యుల అంతఃకరణాన్ని ఏదో విధంగా మార్పుచేయగలిగితే, ఉన్నతం చేయగలిగితే, దానిని యుగ పరివర్తనకు ఆధారభూత ఉపాయమని చెప్పవచ్చు.

ఒకరిద్దరిని మార్పు చేయాలంటే ప్రలోభం చూపి లేక దబాయించి, పరామర్శచేసి లేక కూటనీతి ఉపయోగించి అభీష్ఠ దిశలోకి తీసుకురావచ్చు. కానీ 500 కోట్ల వ్యక్తుల భాగ్యం. అనేక భాషల, అనేక రకాల వాతావరణాలలో ఉండే అనేక పరిస్థితుల చక్రవలయంలో ఇరుక్కుపోయిన, అనేక సంస్కారముల గల, అనేక పరంపరల వ్యక్తులను ఎలా మార్చాలి? మనిషి యొక్క శక్తి ఈ పనిచేయగలదా?

ఇలాంటి గొప్ప పనికి మానవుని శక్తి కాదు, దైవీశక్తి

**గురువుకు శిష్యుని సమర్పణాభావం కావాలి**

కావాలి. అంతరాత్మను మార్చడం ఒక అసాధారణమైన విషయం. దానిని యుగపరివర్తనకు ఆధారభూతశిలగా చెప్పవచ్చు. బాహ్య ఉపాయాల వలన, ఉపచారముల వలన, కఠోరమైన ప్రయత్నముల వలన పరిస్థితులు అదుపులోకి రావు. అంతరాత్మలో మంథనం జరిపి పరివర్తన తీసుకురావడం ఎంత కష్టమో ఊహకు కూడా అందని విషయం. కానీ భగవంతునికి అసంభవం అనేది లేదని గుర్తుంచుకోవాలి. ఆయన కలి యుగాన్ని స్వర్ణయుగంగా మార్చగలడు. త్రేతాయుగంలో ధర్మ రాజ్యస్థాపన చేస్తాడు. రావణుడు, వృత్రాసురుడి వంటి మదోన్మత్తులను ఆయన చేతిలో మసియైపోయారు. ఆయన అనుగ్రహంతో సుదాముడు, విభీషణుడు, సుగ్రీవుడు వంటి వారిని సంకట పరిస్థితులలో నుంచి బయటపడి సంపన్నులు అయ్యారు. ఓడిపోయిన దేవతలను మహాప్రళయంలో ముంచి వేయగలడు. సర్వవ్యాపకంగా ఉన్న జలం నుండి క్రొత్త సృష్టి చేయగలడు. మానవోచిత ఆలోచనలను, మానవోచిత వర్చస్సును పునర్జీవితం చేసేందుకు అంతఃకరణలో మార్పులు తేవడం ఆయనకు అసంభవమా? ఎవరి కౌశలంతో నిఖిల బ్రహ్మాండములో గ్రహానక్షత్రాలు వ్రేలాడుతున్నాయో, తమ నిర్థారిత కక్ష్యలో తిరుగుతున్నాయో అటువంటి వానికి అసంభవమైన పని ఉంటుందా? ఈనాడు అమాయకులకు ఏ సమస్యలు లేవు. వారు రాత్రంతా నిద్రపోతారు. పగలల్లా పనిచేస్తారు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే నవ్వుతారు. ప్రతికూలంగా ఉంటే ఏడుస్తారు. పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు ఆ ఇంట్లోనే ఉండి బంధుమిత్రులతో మల్లాగుల్లాలు పడుతుంటారు. కూపస్థ మండూకాలవలె వారి లోకంలో వారు ఉంటారు. కానీ కాస్త కళ్ళు పెట్టుకు చూస్తే ప్రపంచమంతా ఏ విధంగా సమస్యల వలయంలో చిక్కుకుపోయిందో తెలుస్తుంది.

అనేకమంది పూజా పునస్కారాలు చేస్తుంటారు. కానీ సమాధానం యొక్క ఆద్యంతాలు కనిపించవు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించేది ఎలా? అణుయుద్ధ ప్రమాదాలను నివారించేది ఎలా? పెరిగిపోతున్న రేడియేషన్ (radiation) మీద అంకుశం ఎలా వెయ్యాలి? పెరిగిపోతున్న జనాభా సంఖ్యను నియంత్రించేది ఎలా? పిల్లలు పుట్టడం విశ్వనాశనానికి దారితీయవచ్చని తెలియచెప్పేది ఎలా? అన్నపానాదులకు కరువు వస్తుందని వారికి తెలిపేది ఎలా? జనాభాకి తగ్గట్టు ఖనిజ సంపద ఎక్కడి నుండి తేవాలి? జీవించేకళను నేర్పే అధ్యాపకులు ఏరి? సమాజం పట్ల మన కర్తవ్యాన్ని తెలియచెప్పేది ఎలా? సమాజం పట్ల మన నిరతిని పెంపొందించేది ఎలా? మందులతో పని లేకుండా ప్రకృతి నియమాలను అనుసరించి, సంయమం పాటించి రోగాలను నుండి విముక్తిపొందడం నేర్పే వైద్యాలయాలను నెలకొల్పే వారెవరు? ఇలాంటి సమాజాన్ని ఎలా నిర్మించాలి? దోపిడీలు, పీడించడం, హింస లేకుండా అందరు కలసిమెలసి ఉన్నది పంచుకుని తినే రోజులు ఎలా వస్తాయి?

ఈ ప్రపంచాన్ని సరిచేసి నిలబెట్టాలంటే మానవశక్తి చాలదు, దైవీశక్తి కావాలి. దీనిని ఏ విధంగా జాగృతం చేయాలి? ఏవిధంగా ఏకత్రితం చేయాలి. దానిని ధరిత్రి నివాసకుల వెనుక పడేలా ఎలా చెయ్యాలి? ఇది చాలా పెద్ద పని. అన్నింటికంటే పెద్ద సమస్య సమర్థులైన వారి ఆలోచనా సరళిని మార్చడం. ధనవంతులు, శాసకులు, సాహిత్యకారులు, ధర్మాధ్యక్షులు అందరు తప్పుమార్గంలో ఉన్నారు. లోకశ్రేయస్సు గురించి మాట్లాడుతారు కానీ స్వార్థం గురించే ఆలోచిస్తుంటారు. ఈ సముదాయాన్ని తమ సామర్థ్యాన్ని మంచి వైపు, సృజన వైపు మార్చాలి, వీరిని స్వార్థం నుండి పరమార్థం వైపు మరల్చ గలిగితే స్నేహ సుహృద్భావాలు వెల్లివిరుస్తాయి.

ఆధ్యాత్మిక విజ్ఞానం ప్రకారం దీనికి ఒకే ఒక మార్గం ఉన్నది. అది కఠోర తపశ్చర్య. దానిబలంతోనే బ్రహ్మ సృష్టి చేయగలిగాడు. భగీరథుడు తపశ్చర్యతోనే స్వర్గం నుండి గంగను భువిపైకి తీసుకువచ్చాడు. వృత్రాసురుని దుండగాలను సహించ లేక దేవతలు త్రాహి-త్రాహి అని ఆక్రందనలు చేస్తుంటే దధీచి అనుగ్రహించిన వెన్నెముకతో వజ్రాయుధాన్ని తయారు చేసుకొని ఇంద్రుడు వృత్రాసురుడిని వధించగలిగాడు. పరశు రాముడు తపోబలంతో ధరిత్రిపైగల అనాచారాలను అనేకసార్లు నిర్మూలించాడు. దయానంద మహర్షి, అతని సమాకాలీన మహామానవులు కపట సన్యాసులు ఆట కట్టించారు.

నేడు పరివర్తన జరగాలంటే తపశ్చర్య బలంతోనే సాధ్యం. సమిష్టిగత సంకల్పశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తుల సమన్వయంతో బలిష్టమైన వ్యక్తిత్వం యొక్క సామర్థ్యం అభీష్టమైన సఫలతలను సహజంగానే దగ్గరకు లాక్కుంటుంది. మానవ శక్తులలోకెల్ల కుండలినీ స్థాయి ఉన్నతమైనది. జననేంద్రియ మూలంలో-

**ఆధ్యాత్మిక విద్యను మనిషి మనిషికి అందజేయాలి**

మూలాధార క్షేత్రంలో ఇది నివాసం ఉంటుంది. ధారణశక్తికి అనురూపంగా వంశవృద్ధి చేస్తుంది. ఒక చుక్కలో నూతన మానవుని జీవింపచేయగలిగే శక్తి ఉండటం చాలా ఆశ్చర్య కరమైన విషయం. ఇది శరీరంలో సీమిత క్షేత్రంలో ఉన్న స్థితి యొక్క పరిణామము.

ఈ శక్తి సాధన ద్వారా బ్రహ్మాండమంతా వ్యాప్తి చెంది నప్పుడు అసంఖ్యాకమైన మనుష్యులు మానసిక స్థితిని మార్చివేస్తుంది. అది యుగాన్ని మార్చగలదు, విశ్వామిత్రుని వలె ఒక నూతన సృష్టి చేయగలదు. మనుష్యుల జీన్స్-గుణ సూత్రములను ప్రాణశక్తి ప్రహారముతో మార్చవచ్చని ఇతిహాసములు చెప్తున్నాయి. పులస్త్య ఋషి యొక్క పుత్రులందరు రావణ పరివారంగా దైత్యులు అయ్యారు. వాలఖిల్య ఋషి దైత్యదంపతుల సంతానము కానీ ఆయన పుట్టినప్పటి నుండి ఆ వాతావరణంలో నుండి బయటపడి మర్రిచెట్టు పాలు త్రాగి పెరిగి పెద్దవాడయి ఋషి అయ్యాడు. త్రేతాయుగంలో ఋష్యమూక పర్వతంపై నివాసం ఉన్న సమస్త వానరులు తమ పశుప్రవృత్తిని వదిలిపెట్టి శ్రేష్ఠులైన మానవుల వలె మంచి ప్రవర్తన, కుశలత పొంద గలిగారు. ప్రాణశక్తి ఈ పనిచేయ గలిగింది. ఇలాంటి ఉదాహరణలు చూసినప్పుడు యుగ పరివర్తనపై విశ్వాసం కలుగుతుంది. ఈశ్వరుడు ప్రాణులను సృష్టించాడు. దీనితోపాటు మనుష్యునిలో కుండలినీ శక్తి వంటి విలక్షణమైన శక్తి భాండాగారంతో నింపాడు. అది వ్యక్తిలోనే గాక సమిష్టిగత సమూహంలో ఆశాతీత పరివర్తన తీసుకు రాగలదు. దేవాత్మ భారతదేశం యొక్క కుండలినీ జాగరణ సాధన కొరకు మొదట్లో ఒకే వ్యక్తి నడుం కట్టి పూర్తి చేసినప్పటికి, దానిలో అందరికి భాగస్వామ్యం ఉన్నది. ఈ శక్తి జాగరణ యుగ పరివర్తన చేయగలదు.

*- అఖండజ్యోతి, జనవరి 1987*

## గురుదేవులకు ప్రకృతి వైద్యంలో ప్రావీణ్యం

*ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం - ఈ రెండు శాస్త్రాల పట్ల పూజ్యగురుదేవులకు ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. 1943లో గోరఖ్‌పూర్‌లోని ప్రాకృతిక చికిత్సా కేంద్రంలో వారు స్వయంగా శిక్షణ పొందారు. ఆయుర్వేద గ్రంథాలను అన్నింటినీ అధ్యయనం చేశారు. ఆ శాస్త్రంలో ఉన్నతస్థాయి పరిజ్ఞానాన్ని ఆర్జించారు. వారు గాయత్రీ తపోభూమితో పాటు ఒక ఉచిత ఆయుర్వేద ఆసుపత్రిని స్థాపించారు. ఆ ఆసుపత్రి ఇప్పుడు కూడా నడుస్తోంది. తపోభూమిలో వారు ప్రకృతి చికిత్సకై ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. ఆ తర్వాత శాంతికుంజ్‌లో ఆరణ్యకం ఏర్పడినప్పుడు చాంద్రాయణ వ్రతశిబిరాలు, కల్పసాధనా శిబిరాలు నిర్వహిస్తూ వచ్చారు. జాతీయ ఆయుర్వేద బోర్డువారి గుర్తింపు పొందిన వైద్యులు వారు.*

*ఇంతేకాక శాంతికుంజ్ ప్రాంగణంలో వనౌషధి ఉద్యానవనాన్ని నిర్మాణం చేశారు. వాటిపై పరిశోధన కోసం అన్ని హంగులు కలిగిన ఒక పరిశోధన సంస్థను కూడా స్థాపించారు.*

## కోరికలు-విడుదలే-ఆత్మజ్ఞానానికి

*ఒక శిష్యుడు గురువు వద్ద చేరి ఇలా అన్నాడు - "గురూజీ! తమరు నాకు జ్ఞాన భిక్షనివ్వండి. ఆత్మజ్ఞానం పొందాలని నాకెంతో కోరికగా ఉన్నది. కాని నా మనస్సు మాత్రం లౌకిక సుఖాలకు, భోగాలకు, తృష్ణలకు, వాసనల బంధాల నుండి విరక్తి చెందుట లేదు. అందుకు గురువు గారు "మనసు స్వభావమే అంత. అది ఉన్నంత వరకు ఆత్మజ్ఞానం ఎలా లభిస్తుంది". గురువుగారు లేచి, మౌనంగా వెళ్ళి ఒక స్తంభాన్ని గట్టిగా పట్టుకొని నిలుచుండిపోయాడు. శిష్యుడు చాలా సమయం వరకు చూస్తూ ఉండి చివరికి ఇలా అన్నాడు. "మహారాజ్! నేను అడిగిన ప్రశ్నకు జవాబు ఇవ్వకుండా తమరేం చేస్తున్నారు?" గురువుగారు ఇలా అన్నారు. "నాయనా! ఈ స్తంభం నన్ను వదలకుండా పట్టుకున్నది. దానికి శిష్యుడు నవ్వి "జడమైన ఈ స్తంభం పట్టుకోదు. తమరు దానిని వదలండి. దీనికి గురువు "నాయనా! మనస్సు కూడా జడమే కదా! నీవే దానిని పట్టుకొని వదలకుండా ఉన్నావు. దీంతో శిష్యుని ప్రశ్నకు సమాధానం లభించినట్లు అయ్యింది!*

*- అఖండజ్యోతి, జనవరి 2011*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**దేవతల కంటే మనిషి గొప్పవాడు**

శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 4

# శబ్దశక్తి చూపించే మంచి-చెడు ప్రభావము

*(గత సంచిక తరువాయి...)*

మానవుడు వినగలిగే స్వల్పాతిస్వల్ప ధ్వనిని 'శూన్య డెసిబల్' స్థాయిలో లెక్కిస్తారు. చెవి యొక్క వినికిడి శక్తి సుమారు 10 నుండి 20 డెసిబల్స్ వరకు ఉంటుంది. 140 డెసిబల్స్ ధ్వని మానవుడి చెవిలోని కర్ణభేరిని ఛిద్రం చేసివేసి, అతడిని చెవిటి వాడిని చేస్తుంది. 150కి మించితే అది శరీరములో పెను ప్రమాదమును ఉత్పన్నము చేస్తుంది, చివరకు మృత్యువాత పడవేస్తుంది. ఈ రకముగా చూసినప్పుడు శరీరము 75 డెసిబల్స్‌నే భరించలేక, దానికి విరుద్ధముగా ప్రవర్తించడము మొదలుపెడుతుంది. భీకరశబ్దముల మధ్య జీవించే జనుల శారీరిక, మానసిక స్థితి చిన్నాపెద్దా రోగాల వైపుగా వృద్ధి చెందుతుంటుంది.

విమానములు ఎంత భయంకర శబ్దములు చేస్తాయంటే వాటికి 100 అడుగుల దూరంలో నిలబడి ఆ శబ్దములను వింటే కనుక తలతిరిగిపోతుంది. అందువల్లనే విమానము లోపల కూర్చున్న ప్రయాణీకులకు మరియు చోదకునకు (పైలెట్‌కు) ఈ భీకరశబ్దములు ఏమాత్రము కష్టమును కలిగించని రీతిలో లోపల ధ్వనినిరోధక యంత్రములు అమర్చబడి ఉంటాయి. అయితే బాహ్యాకాశములో మాత్రము ఆ ధ్వని వెలువడుతూనే ఉంటుంది. ఈ ధ్వని ప్రాణుల మీద ఎటువంటి ప్రభావమును చూపిస్తుంది అన్నది విశ్లేషించటానికి గాను కొన్ని ఎలుకలను జెట్‌విమానము నుండి శబ్దము వెలువడే ప్రదేశములో ఉంచారు. కొద్ది క్షణములలోనే అవన్నీ నిర్వీర్యమై పోయి, చివరకు ప్రాణాలు వదిలేశాయి. 'భయంకర శబ్దములు మానవుడి శరీరము మీద దుష్ప్రభావమును చూపిస్తాయి' అని ఈ ప్రయోగము ద్వారా వారు నిర్ద్వంద్వముగా తెలుసుకున్నారు. వైజ్ఞానికులు ఎంత భీతావహశబ్దములను ఆవిష్కరించారంటే 'మందుగుండు మరియు పెట్రోల్' వలెనే కేవలము ఆ శబ్దాల వలన చూస్తూచూస్తుండగానే భయంకరమైన అగ్ని రగులుకుంటుంది.

ఆస్ట్రియాకు చెందిన శబ్దవిజ్ఞాని గ్రిఫిత్ **కోలాహలములో జీవించే మానవులు త్వరగా ముసలి వారవుతారు'** అని చెప్పాడు. **ఇంగ్లండ్ వెలువరించిన ఒక ఆరోగ్యనివేదికలో 'శబ్దకాలుష్యము అధికముగా ఉన్న ప్రాంతంలో నివసించే ప్రజలలో 25% మంది న్యూరోసిస్, మెదడు సంబంధిత వ్యాధులతో బాధపడేవారే' అని తేల్చి చెప్పింది.** అమెరికాలోని అధిక శబ్దములను చేసే పరిశ్రమలలో పనిచేసే కార్మికులలో 25% మంది స్వాభావికముగా ఉండే వినికిడి శక్తిని క్రమముగా కోల్పోతున్నారు.

భారీ అయస్కాంత శక్తిని కలిగి ఉన్న యుద్ధవిమానముల (సూపర్ మేగ్నటిక్ సౌండ్ ఎరోప్లేన్) నుండి వెలువడే కర్ణకఠోర ధ్వనులు కెన్యాకు చెందిన చారిత్రాత్మక గుహలు బీటలు వారేటట్లు చేశాయి. బ్రిటన్-ఫ్రాన్స్ సంయుక్తముగా నిర్మించిన కన్‌కార్డ్ జెట్‌విమానము లండన్‌లోని సెయింట్‌పాల్‌చర్చికి, పార్లమెంట్ భవనానికి ముప్పువాటిల్లజేసింది. తత్కారణముగా ఆ ప్రాంతమునుండి ఆ విమానము పైకి ఎగరటమును నిషేధించారు. ఆ విమానము ఎగిరే సమయములో చెలరేగే ధ్వనివలన ఆ ప్రాంతమునకు చుట్టుప్రక్కల గల 100 మైళ్ళ పరిధిలో ఉన్న హృద్రోగుల జీవితానికి కీడువాటిల్లే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు.

మనిషి చెవులు 25-30 డెసిబల్స్ ధ్వనిని మాత్రమే సహించ గలవు. దానిని మించిన కోలాహలమున్న ప్రాంతములో జీవించే మానవులకు వారి చెవుల గుండా అవాంఛనీయమైన శబ్దము తాలూకు ఒత్తిడి మస్తిష్కము మీద పడుతుంది. ఇక అది శరీరములోని విభిన్న అవయవముల మీద దుష్ప్రభావంను చూపిస్తుంది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా వైద్యకళాశాల వారు ధ్వనిప్రవాహముయొక్క విభిన్న పరిణామములను అధ్యయనము చేసి **'విషపూరితమైన జలము-వాయువు వలెనే కోలాహలముతో నిండిన వాతావరణం కూడా ఆరోగ్యము మీద ప్రమాదకరమైన ప్రభావంను చూపిస్తుంది' అని ఒక నివేదికను వెలువరించారు.**

1966వ సంవత్సరములో ఈజిప్ట్‌లోని గోర్కీ నగరములో అప్పటివరకు వినని ధ్వనుల ప్రభావము పశువుల మీద ఏవిధంగా ఉంటుంది అని పరిశీలించినప్పుడు 'కఠోరమైన శబ్దములు విన్న కారణముగా పశువుల రోజూవారి దినచర్య

**దేవతలకు స్వేచ్ఛలేదు, మనిషికి స్వేచ్ఛ ఉన్నది**

గాడి తప్పుతుంది, అంతేకాక ఉద్విగ్నముగా ఉంటాయి. వాటి శ్రమశీలత మందగిస్తుంది. అనారోగ్యము ఆవరిస్తుంది. పెంపుడు-పక్షులు కూడా ఇటువంటి శబ్దములు విన్నప్పుడు బేజారెత్తి పోతాయి. సామాన్య జంతువులు ఆ కోలాహలము నుండి బయటపడి సుదూరప్రాంతములో తమ గూటిని నిర్మించు కుంటాయి' అని తేటతెల్లమైనది.

టెక్సాస్‌లోని క్లియర్ హియరింగ్ అండ్ స్పీచ్ సెంటర్ అను పరిశోధనాశాల ద్వారా 'ధ్వనులు-వాటివల్ల కలిగే ప్రతి క్రియల' మీద చేసిన ప్రయోగముల ఫలితమును చెప్తూ **'అధిక శబ్దములను వెలువరించే కర్మాగారములలో పనిచేసే శ్రామికులలో ఎక్కువమందికి పాక్షికచెవుడు వస్తుంది,** అంతే కాదు వారి పని సామర్థ్యము మరియు సహనశీలత తగ్గుముఖం పడతాయి' అని గ్లోరింగ్‌డలాస్ అను మార్గ నిర్దేశకుడు అన్నాడు. జెకోస్లోవేకియాలో 'శబ్దములు చెయ్యని' మరియు 'శబ్దములు చేసే' పరిశ్రమల మధ్య ఉత్పాదకశక్తిలో గల వ్యత్యాసమును బేరీజు వేసినప్పుడు 'శాంతయుత వాతావరణములో శారీరికం గాను మరియు మానసికముగాను కూడా శ్రమించగల శక్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది' అనే విషయము తెలిసింది.

హార్వర్డ్‌విశ్వవిద్యాలయమునకు చెందిన విలియమ్స్ సుదీర్ఘకాలముపాటు విస్తృతస్థాయి పరిశోధనలు చేపట్టి 'మానవుడి జీవనశక్తిని నష్టపరచుటలోను మరియు అతనిని అకాలమృత్యువాత పడవేయుటలోను కోలాహలము అతిపెద్ద పాత్రను పోషిస్తుంది' అని తన నివేదికలో వెల్లడించాడు. పెద్దపెద్ద నగరాలలో రహదారి ప్రక్కన నిర్మించబడిన గృహములలో ఆవాసముండే జనుల మస్తిష్కములను ఆ దారిలో ప్రయాణించే రవాణావాహనముల నుండి ఉత్పన్నమయ్యే ధ్వనికాలుష్యము బాగా దెబ్బతీస్తుంది. తత్ఫలితముగా వేరోచోట నివసించే జనులతో పోల్చినచో వీరంతా అనిద్ర, కలవరము, అలజడి, చెవుడు, రక్తపోటు, అజీర్తి వంటి వ్యాధులతో ఎక్కువగా పీడించ బడుతుంటారు' అని సుస్పష్టముగా చెప్పాడు.

జార్జియా విశ్వవిద్యాలయమునకు చెందిన విలియమ్ రణగణధ్వనులతో నిండిన వాతావరణములో ఎలుకలను విడిచి పెట్టి, ఫలితాలను సమీక్షించగా అవి రోజురోజుకు నిరసించి పోవటమును, అలాగే అక్కడున్న సమయములో గర్భం ధరించి-ప్రసవించిన ఆ ఎలుకల సంతానము చాలామటుకు ఏదో ఒక రోగముతో బాధపడుతూనో లేక అంగవైకల్యముతోనో జన్మించడమును గమనించాడు.

ఓహియోకి చెందిన శరీరశాస్త్రజ్ఞుడు సాన్‌తాంగ్ రణగొణ ధ్వనుల మధ్య జీవించే గర్భవతులు దుర్బలమైన మరియు వ్యాధిగ్రస్తులైన సంతానమునకు జన్మనిస్తారు అని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్నాడు.

1963లో లెనిన్‌గ్రాండ్‌కి సమీపాన గల గతుకుల రహదారిని బుల్డోజర్ సహాయముతో చదునుచేశారు. ఈ భారీయంత్రం చేసే భయంకరమైన చప్పుడు దగ్గరలోనే గల కోళ్ళఫారమ్‌ల మీద దుష్ప్రభావమును చూపించినది. కోళ్ళకి రెక్కలు ఊడిపోయి అవి విచిత్రమైన రీతిలో అంద విహీనంగా తయారయ్యాయి. అంతేకాదు ఉదాసీనముగా మారిపోయి, గ్రుడ్లుపెట్టడము ఆపివేశాయి. కర్ణకఠోరమైన ధ్వనులతో కోళ్ళు కలవరపడ్డాయి. వాటి రోజువారి దినచర్య అస్తవ్యస్థమై పోయింది.

రణగణధ్వనులతో కూడిన వాతావరణము నిస్సందేహంగా మానవులకు ఎంతో అహితకరమైనది, చేటును కలిగిస్తుంది. అటువంటి వాతావరణములో జీవించినంత మాత్రము చేత కేవలము పౌష్టికాహార-విహారములతోనో లేదా ఔషధసేవనము ఆసరాతోనో తమ ఆరోగ్యమును పరిరక్షించుకొనుట అన్నది అసంభవమైపోతుంది. డబ్బే సర్వస్వము అని అనుకునేవారు పెద్ద నగరాలలో ఉన్నా లేదా లోతైన సముద్రము మీద పడవలో ప్రయాణిస్తున్నా పెద్ద వ్యత్యాసమేమీ ఉండదు. కానీ **జీవనమును ప్రేమించేవారు ప్రకృతిమాత సన్నిధిలో, శాంత వాతావరణములో తమ జీవితమును గడపాలి.** రణగొణ ధ్వనుల ద్వారా అనగా శబ్దకాలుష్యము వల్ల ఉత్పన్నమయ్యే ఘాతకమైన, ప్రమాదకరమైన పరిస్థితుల నుండి ఎవ్వరు తమను తాము తప్పించుకొనలేరు కనుక సాధారణముగా జనము కోలాహలమును ఇష్టపడరు, భరించలేరు.

సరిగ్గా ఇదేవిధంగా మానసిక ఉద్విగ్నత వలన కూడా దుష్ప్రభావాలను ఎదుర్కొనవలసి ఉంటుంది. చింత, భయము, అనుమానము, నిరాశ, క్రోధము, ఆవేశము, ఈర్ష్య, మోహము, లిప్స వంటి దుష్ప్రవృత్తులు ఎవరి మనో-మస్తిష్కములను నిరంతరము ఉద్విగ్నపరుస్తుంటాయో వారికి అలజడి లేనటు వంటి శాంతి, సంతోషములను అందించే ఆనందకరమైన క్షణములు అరుదుగా లభిస్తాయి. వాతావరణములోని కోలాహలము మనశరీరములను క్షోభింపజేస్తుంది. అలజడితో నిండిన చింతన లేక ఆలోచన మానవుడిని ఒకరకముగా కుప్పకూలుస్తుంది. అటువంటి జీవితమును గడుపుతూ ఎవరైనా సుఖంగా మనగలుగుతారా చెప్పండి?

**మీ యొక్క శక్తిని మీరు ఉపయోగించుకోగలిగితే, ప్రపంచంలో మీరు చేయలేని పని ఏమీ ఉండదు**

శబ్దశక్తిలో ఆరోగ్యమును చేకూర్చే శక్తి వెలుగొందుతున్నది అన్నది వాస్తవిక తథ్యము. అది చైతన్యమయ స్థితులలో మార్పు కలిగిస్తుంది. మరోవైపు ధ్వని అన్నది కీడును కలిగిస్తుంది. మనస్సును అల్లకల్లోలపరుస్తుంది. మనోభావాలను ఉత్తేజ పరుస్తుంది, మనస్సును విహ్వలత యొక్క పరాకాష్ఠకు చేర్చే కార్యమును కూడా చేస్తుంటుంది. అప్పుడప్పుడు ధ్వనులు ఎంతో కీడును కలిగించేటంత భారీస్థాయిలో తమ దుష్ప్రభావమును చూపిస్తాయి. పెద్దపెద్ద చప్పుళ్ళు వచ్చేచోట పనిచేసే ఉద్యోగులు హృద్రోగము, తల పోటు, శ్వాసకోశ వ్యాధుల పాలబడతారు అని చెప్పక తప్పదు.

మాసాచూసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తున్న డిల్‌హటీస్ అభిప్రాయము ప్రకారము 'భీకరధ్వని రక్త కణములలో చిక్కదనమును పెంచుతుంది. తత్కారణముగా ధమనులు నెమ్మదినెమ్మదిగా గట్టిపడి, బలహీనమైపోతాయి. భయంకరశబ్దము నాడులలో వికారములను(ఇబ్బందులను) ఉత్పన్నము చేస్తుంది. యుద్ధవిమానాలు, జెట్ మరియు సూపర్ సోనిక్‌విమానములు చేసే ధ్వని అత్యంత ప్రమాదకరస్థాయిలో ఉంటుంది. హీథ్రోవిమానాశ్రయము (ఇంగ్లాండు) సమీప ప్రాంతములో ఈ విషయము మీద ప్రయోగములు నిర్వహించి 'ధ్వని కాలుష్యం ఉన్న ఈ ప్రాంతములోని 31% మంది నరాల బలహీనతతో బాధపడేవారే' అని నివేదికలో చెప్పారు.

యూ.సీ.ఎల్.ఎ, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ అప్లైడ్ సైన్స్‌లో పనిచేస్తున్న ఒక శబ్దవిజ్ఞాని కొన్ని పరిశోధనలు చేపట్టాడు. పరిశోధనలు చేయటానికి లాస్‌ఏంజెల్స్‌కు 3 మైళ్ళ అవతలున్న ప్రాంతమును ఎన్నుకుని అక్కడున్నవారిని పరిశీలించిన పిమ్మట '80,000 మందిలో 29% మంది మృత్యువాతపడ్డారు. 50% మంది తీవ్రమైన ప్రమాదకర పరిస్థితులలో ఉన్నారు. 6 మైళ్ళ పరిధిలో నివాసముండేవారిలో ఎక్కువమంది కాలేయవ్యాధి బారినపడ్డారు. ఈ ప్రాంతములో జన్మించిన పిల్లలు పుట్టుకతోనే అసమతౌల్యతను వెంట తెచ్చుకున్నారు' అని తేలింది. **డిస్కోడాన్స్‌లకు, పబ్‌లకు వెళ్ళే యువత క్రమక్రమముగా భావికాలములో తమ వినికిడిశక్తిని కోల్పోతారు. ఒక శబ్దవైజ్ఞానికుడు ఇలా చెప్పాడు 'పాప్ సంగీతములో ఆలపించబడే 'డ...డడ....డడడ' అనే ధ్వని శరీరములోని మూడొంతుల కండరములను నిర్వీర్యము చేస్తుంది.** ఎలక్ట్రానిక్ స్టెన్ గెజ్ పరీక్షలు నిర్వహించిన తరువాతనే అతను ఈ విషయమును నొక్కి చెప్పాడు.

ధ్వనికాలుష్యము రోగములకు సంబంధించిన పెనుముప్పును వ్యాపింపజేస్తూపోతుంది అని తెలుసుకున్న శాస్త్రవేత్తలు ఆందోళనకు లోనయ్యారు. తాళము-లయ క్రమబద్ధంగా, వినసొంపుగా సాగినప్పుడు అది అంతరాత్మకు ఆరోగ్యమును ప్రసాదిస్తూ, శక్తివంతము గావిస్తుంది. అలా లేనప్పుడు గందర గోళధ్వనులు నరములలో, నాడులలో అలజడిని కలిగిస్తాయి. శరీరమును వికృతంగా మార్చివేస్తాయి.

ధ్వని వలన కంపనములు చెలరేగుతాయి. సంగీత విద్వాంసులు సంగీతవాయిద్యములను పలికించినప్పుడు మున్ముందుగా గాలిలో నలుదిశల నుండి ఆ స్వరలహరులు సంకోచించి అటుపిమ్మట వ్యాపిస్తాయి. ధ్వనికి ప్రతిక్రియగానే సంపూర్ణ శరీరము సృజించబడినది. మానవుడు ఒక సజీవ వాద్యపరికరము! ఒక్కముక్కలో చెప్పాలంటే మనిషి ఒక రేడియోవంటివాడు. మనము స్వరబద్ధమైన స్థితిలో అనగా సమతాస్థితిలో ఉంటే కనుక ఆదర్శవంతమైన కార్యములను చేపడతాము అని వైజ్ఞానికుల అభిప్రాయము. ధ్వనిని 'డెసిబల్స్' లో లెక్కిస్తారు. 180 డెసిబల్స్ ధ్వని ప్రాణఘాతకమైనది. జెట్‌విమానము పైకి ఎగురుతున్నప్పుడు వెలువడే 140-150 డెసిబల్స్ ధ్వని మనశరీరములకు ముప్పువాటిల్లజేసే శక్తిని కలిగి ఉంటుంది. 130 డెసిబల్స్ ధ్వని నరాలకు బాధను కలిగిస్తుంది. దీర్ఘకాలముపాటు సాగే 110-120 డెసిబల్స్ శబ్దము చరమస్థాయిది. నష్టమును కలిగించటానికి ఈ స్థాయి శబ్దము చాలు! 110 కన్నా తక్కువ డెసిబల్స్‌లో ఉన్న చప్పుళ్ళు మధ్యమస్థాయివే అయినా అవి కూడా కష్టము, బాధ కలిగిస్తాయి అని భావించబడుతున్నది. మనిషి శ్వాసప్రశ్వాసల వలెనే 10 డెసిబల్స్ అనగా అత్యంత స్వల్ప కంపనస్థాయి కలిగియుండే చిన్నపాటి చప్పుళ్ళు నిమ్నస్థాయికి చెందినవని భావిస్తారు. నాదయోగము ఈ కోవకే చెందుతుంది.

**ధ్వని మరియు సంగీతములలో మనిషిని ఆరోగ్యవంతునిగా ఉంచే శక్తి ఇమిడియున్నది.** ఒత్తిడిని శమింపజేసి, నరాలను శిథిలస్థితికి చేర్చి, శరీరమును సురక్షితముగాను, యథాతథంగా ఉంచుటలోను ధ్వనులు మరియు సంగీతము ప్రయోజన కారులుగా ఉంటాయి. **శాస్త్రీయసంగీతము మరియు ప్రాకృతిక ధ్వనులలో అధికశాతము మనిషిని అమిత శక్తివంతుడుగాను, సమర్థుడుగాను మారుస్తాయి. అవి మనిషికి ఎంతో లాభకరమైనవి.**

డైరెక్టర్ ఆఫ్ స్పెక్ట్రమ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కాలిఫోర్నియాకు చెందిన స్టెవెన్‌హైపర్న్ అభిప్రాయం ప్రకారము మనమందరము

**"నేను మారతాను" అనే నిర్ణయం తీసుకోకపోతే ఏ గురువు ఏమి చేయలేడు**

ధ్వని యొక్క మహాసాగరములో నివసిస్తున్నాము. కొన్ని నిర్దిష్టమైన ధ్వనుల కంపనములు సైతము ఎంతో ఉపయోగ కరమైనవి. ఈ నేపథ్యమును ఆధారముగా చేసుకొని బల్గేరియాకు చెందిన గార్గీఖోజానోవ్ కొన్ని పరిశోధనలు చేశాడు. ఒక ప్రత్యేకమైన రాగమును ఉపయోగించినప్పుడు సామాన్యస్థితినుండి నెమ్మదినెమ్మదిగా గాఢమైన శిథిలీకరణస్థితి (గాఢసమాధిస్థితి) వంటి దశకు మార్పు చెందటమును గమనించాడు. జ్యూరిచ్‌కి చెందిన హైన్స్‌జైనీ 'తరంగములు పదార్థ నిర్మాణమును చేస్తాయి మరియు వాటిలో మార్పు చేర్పులను కూడా కలిగిస్తాయి' అని సిమెటిక్స్ అనే తన పుస్తకములో వ్రాశాడు. ఒకసారి అతను ఒక ప్రయోగమును చేపట్టాడు. ముందుగా కొన్ని ఇనుపచువ్వల(కమ్మీలు)ను ఒక ప్రత్యేకమైన ద్రవపదార్థములో వేశాడు. ప్లాస్టిక్ పదార్థములను, ధాతువుల పొడిని మరియు పౌడర్‌ను ఆ ద్రవములో కలిపాడు. తర్వాత అతను ఒక యంత్రము ద్వారా నియంత్రించబడే నిర్దిష్ట ధ్వనితరంగాలను ఆ మిశ్రమము పైన ప్రసరింపజేశాడు. అప్పుడు ఆ ఇనుపకమ్మీల పైనున్న ఆకృతి మారిపోవటమును గమనించాడు. అయితే పదార్థములనన్నింటినీ తగినవిధంగా తీసుకున్నప్పుడే ప్రయోగము సరైన పద్ధతిలో జరుగుతుంది. అతనొక టెనోస్కోప్‌ను తయారుచేశాడు. నోటి ద్వారా మైక్రోఫోన్ వద్ద చిన్నగా శబ్దోచ్చారణ చేసినప్పుడు ఆ ధ్వనులు తెరమీద దృశ్య రూపములో ఆవిష్కరించబడతాయి.

**ఓంకారము ఒక అద్భుత మంత్రరాజము!** అది రేఖా గణితమును ఆవిష్కరిస్తుంది అన్న సత్యమును తన అన్వేషణల ద్వారా తెలుసుకున్నాడు. 'సాధారణముగా ప్రతిదినము సాగించే సంభాషణలలో దొర్లే పదములు అవ్యవస్థితముగా ఉండే కారణం చేత అవి ఎట్టి ప్రభావమును చూపించవు. పురాతన సంస్కృతి వికసించిన తూర్పుదేశములలో ముఖ్యముగా భరత ఖండములో సంగీతపరముగా అత్యంత గొప్ప పరిశోధనలు జరిగాయి. ఉచ్చస్థాయికి చెందిన అద్భుతమైన మంత్ర రాజములను రాగయుక్తముగా ఆలపించి-వినడమన్నది దానికదే ఒక 'చికిత్స', దీనిమీద వారు ఎన్నో పరిశోధనలు చేసి అనన్యసామాన్యమైన అద్భుతవిషయములను ఆవిష్కరించారు' అని చెప్తూ ఎంతో ఆశ్చర్యమునకు లోనయ్యాడు.

ప్రాచీనకాలమునకు చెందిన పశ్చిమదేశాలలోని శాస్త్రవేత్తల పరిశోధనలు 'కంపనములు నాడీమండల వ్యవస్థ మీద, గ్రంథులమీద మహత్తరమైన ప్రభావమును చూపిస్తాయి' అన్న విశ్వాసమును మరింత బలపరుస్తున్నాయి. వియన్నాలోని లేసర్ శానిటోరియమ్‌లో చేయబడే 'శబ్దచికిత్సావిజ్ఞానము' ద్వారా చికిత్స చేయించుకున్న ఎంతోమంది రోగులు తిరిగి ఆరోగ్యవంతులై తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళారు. యోగపరమైన పద్ధతిలో ప్రాణాయామము చేస్తున్నప్పుడు శ్వాసప్రక్రియ జరుగుతున్న సమయములో చేసే ఓంకారనాదము నిస్తబ్ధతను, మనస్సుకు శాంతిని ప్రసాదిస్తుంది. ఈ విషయమును ఆధారముగా చేసుకుని అతను ఓంకారమును జపింపజేశాడు.

ధ్వని వలన కలిగే కంపనముల కారణముగా గోడలు పగిలిపోతాయి. ధ్వని ఎంతో శక్తివంతమైనది. దీనిని ఆరోగ్య-సంవర్ధనకు లేదా ఆరోగ్య-క్షీణతకు కూడా ఉపయోగించు కొనవచ్చును. పండిట్ రవిశంకర్‌గారు శాస్త్రీయ సితార్ వాదన పూపొదల మీద చూపించిన ప్రభావము 'ధ్వని యొక్క ఉనికిని' మరోసారి బలపరచినది. సితార్ మీటినప్పుడు ఆ సంగీత ప్రభావము చేత మొక్కలు వాద్యపరికరము వైపు తిరగటము, పుష్పించటము దృగ్గోచరమైనది.

చాలాచాలా ధ్వనులు మన అధీనములో ఉండవు. అటువంటి శబ్దములు మానవుడి ఆరోగ్యమునకు హానిని కలిగిస్తాయి కనుక వాటిమీద నియంత్రణ సాధించవలసిన ఆవశ్యకత ఉన్నది. అంతేకాక మానవ జీవితమును సమృద్ధి వంతం గావించేటటువంటి ధ్వనుల మీద దృష్టిని సారించాలి. **ప్రాక్-పశ్చిమాలకు చెందిన శాస్త్రీయసంగీతము, అలాగే పక్షుల కిలకిలారావములు, కోకిలల కుహూకుహూ ఆలాపనములు, సముద్రపు అలలు చేసే ఘోష, గాలి తెమ్మెరల చిరుచిరుధ్వనులు, సడిగాలికి సర్‌సర్‌మంటూ చెట్లు చేసే విచిత్ర శబ్దముల వంటి ప్రాకృతిక ధ్వనులు మనిషి జీవితమునకు ఎంతో లాభమును చేకూరుస్తాయి.** ప్రాచీనకాలమునకు చెందిన మన పూర్వజులు 'శబ్దబ్రహ్మ' అన్నది అన్ని పదార్థములను అనుసంధానించే ఒక వంతెన వంటిదని విశ్వసించారు. ప్రకృతి అంతర్గతముగా ఉండే ప్రతి వస్తువు అనగా ఈ సృష్టిలోని సమస్తము కూడా ఒక కంపనములో స్పందించే తరంగమే అని అధునాతన విజ్ఞానము కూడా ఇప్పుడిప్పుడు అంగీకరిస్తున్నది. ఈనాడు శాస్త్రవేత్తలు కూడా అతి ప్రాచీన కాలమునకు చెందిన ఋషుల మార్గములోకే రావటం అత్యంత ముదావహము!!

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 19 (1.9) నుండి*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

మిమ్మల్ని ఎవరూ గొప్పవాళ్ళుగా చేయలేరు, మీరే గొప్పవాళ్ళుగా మారాలి

## భావసంవేదనల గంగోత్రి-7

# అంతరంగం జ్వలిస్తే...

సంవత్సరముల తరబడి దట్టముగా ఏర్పడిన చీకటిని తొలగించటానికి ఒక్క క్షణం చాలు. అగ్గిపుల్ల ఒక్కటి వెలిగిస్తే చాలు చీకటి మటుమాయమవుతుంది. సంవేదనల అగ్ని జ్వలించిన క్షణంలో, శరీరములో మనస్సులో ఉన్న శక్తులన్నీ దానిని పెంచుటలోను వ్యాప్తి చెందించుటలోను నిమగ్నం అయిన క్షణంలో– జీవితపు చీకటి పటాపంచలు అవుతుంది. సమస్యలు, అవరోధములు అప్పుడు దానిని ఆర్పలేవు. అది వ్యాపిస్తూ ఉంటుంది. అలాంటివారిని గురించి రవీంద్రనాథ్ టాగూర్ "ఏక్‌లా చలోరే" అనే గీతంలో ఇలా వ్రాశారు. "గాలివాన, కుంభవృష్టి మూసుకువచ్చిన కాళరాత్రిలో నీ ఇంటి తలుపులను నీవారు మూసివేస్తే – గుండెను కాల్చి ఆ వెలుగులో ఒంటరిగానే ముందుకు సాగిపో."

కర్మవీరుడు గాంధీజీ జీవితంలో ఒక రోజున ఇదే అగ్ని జ్వాల ప్రజ్వరిల్లింది. ఆ అగ్నిలో గౌరవ ప్రతిష్ఠలు, కీర్తికాంక్ష, పదవి అన్నీ కాలిపోయాయి. అప్పుడు ఆయన దక్షిణ ఆఫ్రికాలో యాత్ర చేస్తున్నారు. ఆఫ్రికా నుండి తిరిగి వచ్చిన తరువాత ఆయన కర్మవీరుడుగా ఖ్యాతి గడించారు. కానీ అప్పటికి ఆయన మహాత్ముడు కాలేదు. ఒకసారి ఆయన ఒక యువతి చాలీచాలని చీరతో తన శరీరమును కప్పుకొని ఉండుట చూచాడు. దానిని చీర అనుట కంటే చింకి గుడ్డపీలిక అంటే బాగుంటుంది. బుట్ట ఎత్తుకొని వెళ్తున్న ఆ యువతిని అందరు చూసారు. ఆ చూపులలో విరక్తి, ఉపేక్ష, చెడు కోరిక – అన్నీ ఉన్నాయి. లేనిది సంవేదన ఒక్కటే. గాంధీగారు కూడా చూసారు. ఆయన దృష్టిలో కేవలము సంవేదన మాత్రమే ఉన్నది.

ఆమెను దగ్గరకు పిలిచి గాంధీజీ, "ఏం సోదరీ! నీవు ఈ చీరను ఎందుకు శుభ్రంచేసుకోవు, చిరుగులు ఎందుకు కుట్టుకోవు?" అని అడిగారు. ఆ ప్రశ్న ఆమె భూతవర్తమానాలను, ఆర్థిక లోపములను ఒకేసారి స్పృశించినది. లోతైన గాయాలను తాకితే ఎలా బాధ కలుగుతుందో అదేవిధమైన బాధ ఆమె కన్నులలో నిండింది. ఆమె జవాబు – "రెండవ చీర ఉంటేకదా ఉతుక్కోవటము. కుట్టుకొనుటకు వీలైతే కదా కుట్టుకోవటం."

ఆ జవాబు విని గాంధిగారి ముఖం సిగ్గుతో ఎర్రబారింది. ప్రజలు ఈ స్థితిలో ఉండగా – ప్రజా సేవకుడు అని పించుకొనే నేను చొక్కా ధోవతి అన్నీ వేసుకున్నాను. అంతేకాదు. మరో జత నా సంచీలో ఉన్నది. ఇంతకంటే సిగ్గు పడవసిన విషయం ఏముంది? అని తలచి, ఆయన మౌనముగా సంచిలో నుండి ధోవతి తీసి ఆమె వైపు చాపి "తీసికోమ్మా! సోదరీ, మీ అన్నయ్య నుండి దీనిని స్వీకరించు" అన్నారు.

ఆ యువతి చేయి చాపి ఆ ధోవతి తీసుకున్నది. కృతజ్ఞతతో, ఆనందముతో ఆమె ముఖము మెరిసింది.

ఆ యువతి వెళ్ళి పోయింది. గాంధీగారు తాను కట్టుకున్న పంచెను రెండు ముక్కలుగా చేశారు. సగం కట్టుకొనుటకు సగం పైన కప్పుకొనుటకు. ఇవే ఆయన శాశ్వత దుస్తులు అయ్యాయి. ఒక్క క్షణంలో కర్మవీరుడు గాంధీజీ మహాత్మా గాంధీ అయ్యారు. కేవలం బట్టలు మార్చుడంవల్ల అయ్యారా? కాదు. అంతరంగ వ్యవస్థ తారుమారు కావడంవల్ల.

దగ్గర నిలబడ్డ స్నేహితులు ఈ విచిత్రమైన మార్పు చూస్తున్నారు. కొందరు "అరె! ఇదేమిటి? మీరు పెద్ద పెద్ద వారిని కలువవలసివస్తుంది. ఈ దుస్తులతో ఎలా కలుస్తారు?" అని ప్రశ్నించారు.

**"సూటు బూటు ధరించి, కుక్కలను కార్లలో త్రిప్పే వారిని, నౌకర్లను తిట్టే వారిని మీరు పెద్దలని అంటారు. మీ తెలివి చూస్తే నాకు జాలి వేస్తోంది"** అంటూ గాంధీ గారు తీవ్ర స్వరంతో ఇంకా ఇలా అన్నారు – "మీరు కాక మీలోని హీనత్వం మాట్లాడుతున్నది. ప్రజాసేవకునికి ఏది గౌరవప్రదమో తెలియని భాష మాట్లాడుచున్నది. పెద్దలు వీరు కారు. **ఎవరి మనస్సు సామాన్యుల సమస్యలకు కుమిలిపోతుందో, ఎవరి బుద్ధి ఈ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను ప్రతినిత్యము వెదుకుతుందో – వారే పెద్దలు.** ఎవరి శరీరం "అహర్నిశం సేవామహే" (రాత్రింబగళ్ళు సేవచేస్తాను) అనే వ్రతం

**గురువు యొక్క అనుగ్రహం ఉంటే ఎటువంటి కర్మను అయినా అధిగమించవచ్చు**

స్వీకరించిందో వారే పెద్దలు. నకిలీ పెద్దరికం, నిజమైన గొప్పతనం వీనిలో ఏదో ఒక దానినే ఎంపిక చేయగలుగుతాము. రెండింటినీ కలపలేము. **గొప్పతనం పొందడానికి ఒకే ఉపాయము – సామాన్య ప్రజల బాధ తెలుసుకోవటం, దాని నివారణకొరకు నిమగ్నమగుట".** ఆయన స్నేహితులు పెత్తం దారికి, గొప్పతనానికి మధ్యగల తేడా గ్రహించారు. "ఒకవేళ నేను బ్రిటిషు చక్రవర్తిని కలువవలసి వచ్చినా ఈ దుస్తులతోనే కలుస్తాను" అని తమ మాట ముగించారు గాంధీగారు.

ఈ సంఘటన జరిగిన కొన్ని సంవత్సరముల తరువాత నిజంగానే బ్రిటిషు చక్రవర్తి నుండి పిలుపు వచ్చింది. పిలుపుతోపాటు గాంధీగారు బ్రిటిషు వేషధారణతోనే రావాలని ఆదేశం కూడా వచ్చింది. 'ఇప్పుడు ఆయన ఎలా ఇంగ్లీషు దుస్తులు ధరించరో చూద్దాం. "మహాత్మ" బిరుదు కాస్తా బూడిద పాలు అవుతుంది' – అని ఆయన విరోధులు అనుకున్నారు.

కాని గాంధీగారి మనస్సు ధృఢంగా నిలచింది. 'కలుసుకో వలసిన అవసరం చక్రవర్తిది, నాది కాదు. వారికి అంగీకారమైతే నేను ఈ దుస్తులతోనే కలుస్తాను' – అని గాంధీ గారు కబురు పంపారు. గాంధీగారి ఆదర్శాల ముందు చక్రవర్తి తలవంచ వలసి వచ్చింది. ఐదవ జార్జి ఈయన విచిత్ర వేషాన్ని చూసి, "మీరు ఈ విధమైన వేషధారణ చేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది" అని అడిగారు. గాంధీగారి జవాబు ఇది–

"నిర్దయుడే వైభవాన్ని, విలాసాన్ని ప్రదర్శిస్తాడు. ఒక భావనాశీలునికి అది సాధ్యము కాదు." ఐదవ జార్జి వద్ద దానికి సమాధానము లేకపోయింది.

సంవేదన తరువాతి అడుగు క్రియాశీలత. అశాంతి రోగికి కూడా ఉంటుంది. కానీ అతను మంచముపై పడిఉండి కాళ్ళు కొట్టుకుంటూ, మూలుగుతూ ఉంటాడు. అతని వల్ల ఏ పనీ జరుగదు. ఇతరులే అతనికి సేవ చేయవలసి వస్తుంది. భావచేతన జాగరణతో జనించిన అశాంతి దీనికి భిన్నము. అది వ్యక్తిని క్రియాశీలునిగా చేసి తీరుతుంది.

గాంధీ మహాత్ముని జీవితంలో ఈ క్రియాశీలతే పెరిగి వికసించింది. ఆయన తన జీవిత చక్రాన్ని ఎంత వేగముగా త్రిప్పారంటే – ఒకేసారి అనేక పనులు చేశారు. స్వరాజ్యము, స్వావలంబన, గ్రామోద్ధరణతోపాటు ఆయన ఎంత గొప్ప పని చేశారంటే–చరిత్ర ఆయనను ఎన్నిటికి మరచిపోదు. సమాజానికి ప్రజాసేవకులను ఇవ్వడమే ఆ పని. వినోబా, నెహ్రూ, పటేల్, కృపలానిలాంటి వందలాదిమందిని ఆయన తయారు చేశారు. ఆయన కల ఒక్కటే రామరాజ్యమును తెచ్చుట. అది అసంపూర్ణముగా ఉండిపోయింది. రామరాజ్యం అంటే మరేదీ కాదు – ఏ సమాజములో మానవుని గుర్తింపు అతని భావ చేతన ఆధారముగా ఉంటుందో ఆ సమాజ స్థాపన. అటువంటి సమాజస్థాపన రానున్న రోజులలో జరుగనున్నది. సమాజపు ఈనాటి దశకు, భవిష్యత్తు దశకు కాయకల్పంవంటి తేడా ఉంటుంది. ప్రతి ఒక్కరిలోను ఉదారమైన ఆత్మీయత పొంగి పొరలుతుంది. అటువంటి దశలో **పరమార్థమే నిజమైన స్వార్థమని ఋజువవుతుంది.** ఈ పరివర్తన మహోత్సవములో మనము స్వయంగా మారాలి. నిర్దయ అనే నకిలీ ముసుగును తొలగించి పారవేయాలి. **సామరస్య భావన ఉప్పొంగగానే స్వర్గీయ రాజ్యము అవతరిస్తుంది.** ఆ పరిస్థితులు ఎంతో దూరంలో లేవు.

– *అనువాదం: డి.వి.ఆర్. మూర్తి*

## తన దాకా వస్తే గాని...

*ఒక వ్యక్తి తన ముదుసలి కదలలేని తండ్రికి మట్టి పాత్రలో అయిష్టంగా, తిరస్కారపూర్వకంగా భోజనం పెడ్తుండేవాడు. ఆ వ్యక్తికి ఒక చిన్న వయసులో ఉన్న కుమారుడు కూడా ఉన్నాడు. ఆ పిల్లవాడు తాను ఆడుకొనే స్థలంలో విరిగి–ముక్కలైన మట్టిపాత్రలను సేకరించి పెట్టుకొనేవాడు. తండ్రి ఇలా ఎందుకు చేస్తున్నావని అడిగి నప్పుడు ఆ పిల్లవాడు ఇలా అన్నాడు. "నీవు అమ్మ ముసలి వారైనప్పుడు, నేను కూడా అప్పుడిలాగే మీ కొరకు విరిగిన మట్టిపాత్రలను సేకరించి పెట్టుకుంటున్నాను". అప్పుడు ఆ వ్యక్తి కళ్ళు తెరచుకున్నాయి. ఆరోజు నుండి గౌరవ ప్రదంగా తన తల్లిదండ్రులకు భోజనమివ్వటం ప్రారంభిం చాడు. తాము కూడా ఒకనాటికి ముసలి వారమవుతామని, అప్పుడు తాను చేసిన విధంగా తన కొడుకు చేస్తే తాము ఎంతో బాధపడగలమని తెలుసుకొన్నాడు.*

– *అనువాదం: జి. చెన్నకేశవరావు*

**గురువుల చిత్రపటాలు, సజీవ చేతనత్వాలు**

జీవన దేవత సాధన, ఆరాధన - 4

# ప్రజ్ఞాయోగం-2

జ్ఞాన, కర్మల సంయోగం ద్వారానే ప్రగతిమార్గంలో వెళ్లగలుగుతాము, విజయలక్ష్మిని వరించగలుగుతాము. అధ్యాత్మిక విజ్ఞానంలో కూడా తత్వదర్శనం యొక్క సరైన రూపాన్ని తెలుసుకున్న తరువాత రెండవ చరణమేమంటే – దానిని ఆచరణలో పెట్టడానికి పూజ, అర్చనల సరైన విధానాన్ని అనుసరించడం. ఆధ్యాత్మికత ఆత్మశుద్ధి, ఆత్మవికాసములకు సన్నిహితమైనది. ఉపాసనలోని చిహ్నపూజ తాత్పర్యం ఏమంటే – క్రియ, సాధనాలు ఆధారంగా ఆత్మశిక్షణ ఆవశ్యకతను పూరించడం. **ఏ కర్మకాండ అయినా దాని భావనలను హృదయాంగమం చేసుకోకుండా పూర్తి కాదు.** కర్మకాండను గారడీగా భావిస్తే, గొప్ప విజయాన్ని ఆశించలేము. క్రియలు దేనిని ఎంతవరకు ప్రభావితం చేస్తాయో అంతవరకు మాత్రమే సత్పరిణామాలను సాధించగలము.

సార్వజనీనమైన సులభ సాధన స్వరూపమును వివరిస్తూ తరువాతి పుటలలో "ప్రజ్ఞాయోగం" పేరుతో వివరించబడే విధానాలు అభీష్టసిద్ధి కొరకు ఇతర మార్గాల కంటే తేలికైనవి, తక్కువ సమయంలో అధిక సఫలతను అందించగలిగేవి.

**ప్రజ్ఞాయోగానికి రెండు సంధ్యలు అత్యధిక సరళం, మహత్తరం అయినవి. ఒకటి ఉదయం మంచంపైనే ఉండి కళ్ళు తెరుస్తూనే పది పదిహేను నిముషాలపాటు "ప్రతిరోజు కొత్తజన్మ" అనే భావన కలిగి ఉండడం. రెండవది రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించే సమయంలో శయనించడం ఒక విధమైన మరణమనే భావనను అనుభవించడం.** జనన మరణాలు జీవితానికి మొదలు, తుది. వీటిని క్రమంగా ఉంచగలిగితే మధ్యఉన్న భాగం సఫలం అవుతుంది. విత్తనాలు నాటటం, పంట కోయటం అనేవి రైతుల సామాన్య ప్రక్రియలు. మేలుకోవడాన్ని ప్రాతఃకాల సంధ్యగా, శయనాన్ని రాత్రి సంధ్యగా చెప్పవచ్చు. సూర్యోదయ సూర్యాస్తమయాలను ఉభయ సంధ్యలుగా పరిగణిస్తారు. వాటితో ముడిబడిన ఆధ్యాత్మిక సాధనను ప్రాతఃకాలం కళ్ళు తెరిచే సమయంలో చేయవచ్చు.

**ప్రజ్ఞాయోగంలోని ప్రథమ సాధన ఆత్మబోధ. కళ్ళు తెరవగానే 'నేడు నాకొక కొత్త జన్మ. ఒకరోజు మాత్రమే జీవిస్తాను, రాత్రి మరణం ఒడిలోనికి చేరాలి. మధ్యఉన్న కాలాన్ని సర్వోత్తమంగా ఉపయోగించడమే జీవన సాధన లక్ష్యం. ఇదే నా పరీక్ష క్రమం. దీనిలోనే భవిష్యత్తు మొత్తం నిండి ఉన్నది' – అని భావన చేయాలి.**

జన్మలన్నింటిలో మానవ జన్మ అదృష్టకరమైనది. దీని సదుపయోగమే ఉన్నత స్థాయి జ్ఞానానికి రుజువు. నిద్రలేస్తూనే, ఈ రోజు ఒక పూర్తి జీవితం – అని ఆలోచన చేయాలి. ఈ జన్మను ఏ ప్రయోజనం కోసం విధాత మనకు అప్పగించాడో ఆ ఉపయోగకరమైన పనులను మాత్రమే చేయాలి. ఈ విధంగా రోజంతా జరిపే దినచర్యను ఈ సమయంలోనే నిర్ధారణ చేసుకోవాలి. ఆలోచన, శీలం, వ్యవహారాల రూపురేఖలను తయారుచేసుకుని జాగ్రత్తగా పూర్తి చేయడం వలన ఈ రోజు, ఈ విలువైన జన్మ పూర్తిగా సార్థకం కావాలి – ఈ ఆలోచనలోని అన్ని కోణాలను గురించి ఆలోచించడానికి ఎంత ఎక్కువ సమయం పట్టినా అది తక్కువే. దీనిని నిత్యం నియమిత రూపంలో ఆచరిస్తే, పదిహేను నిముషాలు సరిపోతాయి. ఆ రోజులో మిగిలిన పనేమైనా ఉంటే అది మరునాడు పూర్తి చేయవచ్చు.

**రాత్రి నిదురపోయే ముందు రెండవ సంధ్య పూర్తి చేయవచ్చు. అందులో మృత్యువు ఒడిలోనికి వెళ్తున్నట్లు భావించాలి. ఈ సమయంలో – ఒకరోజు జీవితాన్ని ఏ విధంగా సదుపయోగం చేశావో భగవంతుని సభలో జవాబు ఇవ్వాలి. దీనికోసం ఆ రోజులో జరిగిన కార్యకలాపాల, ఆలోచనల ఉన్నతి, అధోగతులను సమీక్ష చేయాలి. వాటి ఉద్దేశ్యాన్ని, స్థాయిని నిష్పాక్షికంగా పరీక్షించాలి. వాటిలో ఏవి సవ్యంగా జరిగాయి. ఏ తప్పులు, వైరుధ్యాలు జరిగాయి – అని తెలుసుకోవాలి. సవ్యంగా జరిగినవాటికి తనను తాను ప్రశంసించుకోవాలి. జరిగిన తప్పును మరునాడు సవరించే ఆలోచన చేయాలి. శాస్త్రం ప్రకారం – పాపానికి ప్రాయశ్చిత్తం జరిగిన నష్టాన్ని భర్తీ చేయడమే.** గడచిన ఈ రోజును తిరిగి

**గురుదేవులు ఏమి చెప్పారు అన్నది తెలియటానికి స్వాధ్యాయం చేయాలి**

తీసుకురాలేము. కానీ దానికి ప్రాయశ్చిత్తం మరునాడు చేసుకోవచ్చు. మరునాటి కార్యకలాపాలలో ఈ రోజు చేయలేని దానిని కలపాలి. ఈ విధంగా కొంత భారం పెరుగుతుంది. కాని లోపాన్ని సరిదిద్దుకునేందుకు మరోదారి లేదు. మృత్యువు అనివార్యం. మనుషులు ఈ విషయాన్ని మర్చిపోతారు. పసిపిల్లల వలె పనికిరాని పనులు చేస్తారు. ఎనభై నాలుగు లక్షల జీవరాశులలో పరిభ్రమించిన తరువాత లభించిన మానవ జన్మలో భవిష్యత్తును ఉజ్వలంగా చేసే పనులు చేయాలి; దేవమానవ స్థాయిని చేరే ఆకాంక్షను కలిగిఉండాలి; మనలను అనుకరించే ప్రేరణ ఇతరులకు కలిగే విధంగా జీవించాలి; మనం మన బాధ్యతను నిర్వహించిన రుజువు లభించి, విధాత సంతోషించాలి. దాని ఆధారంగా మనకు ఉన్నత స్థితి లభించాలి.

రాత్రి ఏ విధంగా నిశ్చింతగా నిద్రపోతామో, అదే విధంగా మరణం తరువాతి సమయం నుంచి పునర్జన్మ వరకు గల కాలంలో అదే విధంగా శాంతితో ఉండడానికై ఈ రోజులలోనే సన్నాహాలు చేయాలి. పగలు సుఖ సంతోషాలతో గడిస్తే, రాత్రి గాఢమైన నిద్ర పడుతుంది. రోజు శాంతంగా, శ్రేష్ఠంగా గడిపితే, మరణం తరువాతి కాలంలో నరకాన్ని అనుభవించవలసి రాదు. స్వర్గతుల్యమైన శాంతిని ఆస్వాదించవచ్చు. ఈ ప్రక్రియయే తత్వబోధ.

ప్రజ్ఞాయోగంలో పగలు పూర్తి చేయవలసిన పనులు ఇంకా రెండు ఉన్నాయి. మొదటిది భజన, రెండవది మననం. భజన కోసం కాలకృత్యాలు నిర్వర్తించిన తరువాత పూజా స్థలంలో పద్మాసనంలో కూర్చోవాలి. శరీరం, మనస్సు, వాణి శుద్ధి కావడం కోసం జలం ద్వారా పవిత్రీకరణం చేసుకుని, ఆచమనం చేయాలి. దైవ విగ్రహం, గాయత్రి పటం, ధూప దీపాలు – వీటిలో ఏదో ఒక చిహ్నాన్ని స్థాపించి దానినే ఆరాధ్యదైవంగా భావించాలి. ధూపం, దీపం, నైవేద్యం, జలం, అక్షతలు, పుష్పాలలో ఏవి లభిస్తే వాటితో పూజ చేయాలి. పూజకు ఉపయోగించే ఈ సాధనాలలోని విశేషతలు జీవితంలో ఉత్పన్నం కావాలని భావన చేయాలి. చందనం పరిసరాలను సుగంధంతో నింపుతుంది. దీపం తన ప్రభావ పరిధిలో జ్ఞానమనే ప్రకాశాన్ని వ్యాపింపచేస్తుంది. పుష్పాలు నవ్వుతూ వికసిస్తూ ఉంటాయి. జలం శీతలతకు గుర్తు. అక్షతలు, నైవేద్యం వెనుక పరమార్థ ప్రయోజనం కోసం కేటాయించే సమయదానం, అంశదానాల భావన ఉన్నది. ఇష్ట దైవాన్ని సత్ప్రవృత్తుల సమూహంగా పరిగణించాలి. ఈ విశ్వాసాలు ఆధారంగా దైవపూజ సమగ్రమవుతుంది.

ఇప్పుడు జప,ధ్యానాల వంతు వస్తుంది. రెండూ ఒకేసారి జరుపవచ్చు. గాయత్రీ జపం మానసికంగానైనా చేయవచ్చు. ఎంతసేపు చేయాలని నిశ్చయించుకొన్నారో దాని లెక్క గడియారం ద్వారా కాని, మాల ద్వారా కాని చేయవచ్చు. ఎవరికైనా వేరే మంత్రం ఇష్టమైతే, దానినే జపించవచ్చు. ఓంకారం సర్వత్రా జపంగా పరిగణించబడుతోంది.

జపంతో పాటు ప్రాతఃకాలంలో ఉదయిస్తున్న సూర్యుడిని ధ్యానం చేయాలి. సూర్యునికి ఎదురుగా కూర్చొని ఉన్నట్లు భావన చేయాలి. సూర్యుని సూక్ష్మకిరణాలు తన స్థూల, సూక్ష్మ కారణ శరీరాలలోనికి ప్రవేశిస్తున్నట్లు భావన చేయాలి. కిరణాలు బలానికి, కాంతికి ప్రతీకలు. బలం అనగా శక్తి. కాంతి అనగా ప్రకాశవంతమైన ప్రజ్ఞ. రెండింటి సమన్వయం మూడు శరీరాలలో ప్రవేశించి వాటిని ప్రభావితం చేస్తూన్నదని భావన చేయాలి. స్థూల శరీరంలో ఆరోగ్యం, సంయమనం; సూక్ష్మ శరీరం అనగా మస్తిష్కంలో వివేకం, సాహసం; కారణ శరీరం అనగా అంతఃకరణలో శ్రద్ధ, సద్భావన సూర్య కిరణాల రూపంలో ప్రవేశించి, అస్తిత్వంలోని మొత్తం శక్తిని ప్రేరేపిస్తున్నాయని భావన చేయాలి. ఈ ధ్యాన ధారణ, మంత్ర జపం కలిపి నియమితంగా, నిర్ణీత సమయం వరకు జరపాలి. చివరకు పూర్ణాహుతిలో సూర్యునికి ఎదురుగా జలం అర్ఘ్యం ఇవ్వాలి. దీని తాత్పర్యం – పరమాత్ముని శక్తి సముఖంలో జల రూపంలో ఆత్మశక్తిని సమర్పణ చేయడం. భజనలోని భావన ఇదే. నియమిత స్థానంలో కూర్చొనడానికి వీలుకాని పక్షంలో, ప్రయాణంలో – కృత్యాలన్నీ ఏ వస్తువులను ఉపయోగించకుండా మానసికంగా చేయవచ్చు.

ప్రజ్ఞాయోగంలోని నాలుగవ అడుగు మననం. ఇది మధ్యాహ్నం తరువాత ఎక్కడైనా ఎప్పుడైనా చేయవచ్చు. సమయం 15 నిముషాలైనా సరిపోతుంది. ఇందులో మన వర్తమాన స్థితిని సమీక్షించాలి. ఆదర్శాల కొలబద్దతో పరీక్షించి నప్పుడు ఏదైనా లోపం కనపడితే, దానిని సవరించే ప్రణాళికను తయారుచేయాలి. ఇదే మననం. దీని కోసం ఏకాంత స్థలాన్ని ఎన్నుకోవాలి. కళ్ళు మూసుకుని అంతర్ముఖుడవు

**గురువులు ఏమి చెప్పారో దానిని ఒడిసి పట్టుకోవాలి**

కావాలి. ఆత్మసత్తా యొక్క ప్రక్షాళనకు, సంస్కరణకు పథకాన్ని రూపొందించాలి. ఇందులో ఆరోజు జరిపిన కార్యక్రమాలను ప్రధానంగా పరిగణించాలి. ప్రాతఃకాలం నుంచి మధ్యాహ్నం వరకు చేసిన ఆలోచనలను, పనులను, ఆదర్శాల గీటురాయిపై పరీక్షించాలి ఆ సమయము నుండి నిద్రపోయేంతవరకు ఏమేమి చేయాలో భావనాత్మక ప్రణాళికలు తయారుచేయాలి. అలా చేస్తే– ఆరోజు లోని తొలి సగం కంటే మలి సగం మరింత మెరుగవుతుంది.

ఆత్మ సమీక్షకు నాలుగు కొలబద్దలు ఉన్నాయి – **1. ఇంద్రియ సంయమనం, 2. సమయ సంయమనం, 3. అర్థ సంయమనం, 4. ఆలోచనా సంయమనం.** ఈ నాలుగింటిలో ఎక్కడైనా, ఏదైనా క్రమభంగం జరిగిందేమో చూడాలి.

**నాలుక రుచి కోసం తినకూడనివాటిని తినడంలేదు కదా?** వాణి ద్వారా చౌకబారు సంభాషణ చేయటం లేదు కదా? కాముక ప్రవృత్తి, చెడుదృష్టి పెరగడం లేదు కదా? అసంయమనం వలన శరీరం, మెదడు బోలు కావడం లేదు కదా? శారీరిక, మానసిక ఆరోగ్యసంరక్షణకు ఇంద్రియ సంయమనం అమోఘమైన సాధనం.

**సమయ సంయమనం అనగా ప్రతిక్షణాన్ని సదుపయోగం చేయడం.** సోమరితనం, పొరపాట్లు, దుర్వ్యసనాలు, దుర్గుణాల విషవలయంలో చిక్కుకుపోయి ఏ కొద్ది సమయభాగమైనా వ్యర్థం కారాదు. సమయాన్ని సదుపయోగం చేయడంలో పూర్తి జాగ్రత్త వహించాలి. సమయమే జీవితం. సమయాన్ని సదుపయోగం చేసినవాడే జీవితం నుంచి పరిపూర్ణ లాభం పొందుతాడు.

మూడవ సంయమనం – **అర్థ సంయమనం. ధనాన్ని నిజాయితీగా, శ్రమ చేసి సంపాదించాలి.** ఉచితంగా దేనినీ పొందకూడదు. ఎవరినీ మోసగించకూడదు. సగటు భారతీయుని స్థాయిలో జీవించాలి. “సాదా జీవితం, ఉదాత్త ఆలోచనలు” – అనే నీతి సూత్రాన్ని అనుసరించాలి. విలాసాల ప్రదర్శన అనే మూర్ఖత్వంకోసం కొద్దిగా అయినా ఖర్చు చేయకూడదు. దురాచారాలపై ధనాన్ని వృథా చేయరాదు. పొదుపు చేసిన దానిలో ఎక్కువ భాగం పరమార్థ కార్యాల కోసం ఉపయోగించడం, పుణ్యం సంపాదించడం వంటి ప్రయోజనాలు వివేకంతో సముచితంగా ఖర్చు చేసే వారికే లభిస్తాయి.

నాలుగవ సంయమనం – **ఆలోచనా సంయమనం. మనస్సులో ఎల్లప్పుడు ఆలోచనలు వస్తూ ఉంటాయి;** కల్పనలు ఉదయిస్తూ ఉంటాయి. ఇవి అంతు లేకుండా, అస్తవ్యస్తంగా అనైతికంగా లేకుండా ఉండాలంటే – వివేకాన్ని కావలివాని వలె ఉపయోగించాలి. దాని పనేమిటంటే – **చెడు ఆలోచనలను మంచి ఆలోచనలతో పారద్రోలడం;** అనాగరికమైన ఆలోచనల స్థానంలో నిర్మాణాత్మక ఆలోచనలను స్థాపించడం. ఆలోచనలు మనిషిలోని మహత్తర శక్తులు. అవి కర్మలుగా పరిణతి చెంది, పరిస్థితులుగా వెలికి వస్తాయి. జీవితం కల్పవృక్షం అవుతుంది. నిర్మాణాత్మక, ఉన్నతస్థాయి ఆలోచనలు మాత్రమే చేయాలి.

**సాధన, స్వాధ్యాయం, సంయమనం, సేవ అనే నాలుగు పురుషార్థాలతోనే జీవితంలో ప్రగతి, సఫలత సిద్ధిస్తాయి.** అందువలన దినచర్యలో ఈ నాలుగింటి కోసం సముచిత స్థానం ఇవ్వాలి. ఆత్మ సమీక్ష సమయంలో వాటిని నిరంతరం పరీక్ష చేయాలి. ఆత్మ సమీక్ష, ఆత్మ సంస్కారం, ఆత్మ నిర్మాణం, ఆత్మ వికాసం అనే నాలుగు ప్రక్రియలకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వడానికై మధ్యాహ్న కాలంలో మనన సాధన చేయాలి. ఇదే ఆత్మదర్శనం. ఇది ఇంకా వికసించి, ఈశ్వర దర్శనంగా ఫలిస్తుంది.

– *అనువాదం: ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

## ప్రజా విశ్వాసం

*ఒకసారి కన్ఫ్యూజియస్‌ను “సక్రమమైన, సమర్థవంతమైన రాజ్యపాలనకు అవసరమైనవి ఏమిటని” ఎవరో ప్రశ్నించారు. సేన, కోశాగారం, ప్రజల విశ్వాసం. ఈ మూడు అవసరమని అతడు బదులు పలుకుతాడు. ఒకవేళ ఈ మూడింటిలో ఏది లోపిస్తే పరవాలేదని అడుగగా సైన్యం, కోశాగారం ఈ రెండూ లేకున్నా ఆ రాజ్యపాలన సక్రమంగానే జరుగుతుంది. కానీ మూడవది అయిన ప్రజల విశ్వాసం మాత్రం లోపించటానికి వీలులేదని, మహాత్ముడైనా, రాజైనా, ఎంత ఉత్కృష్టుడైనా సరే ప్రజావిశ్వాసాన్నే వాస్తవిక సంపదగా భావించి ముందుకు పయనించాలని తెలియజేస్తాడు.*

– *ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**గురువు యొక్క శరీరం కాదు, ఆయన అందించిన జ్ఞానం ముఖ్యం**

వసంత పంచమి ప్రత్యేకం

# జ్ఞానము, తపస్సు, ప్రేమల కలయికే వసంత పర్వము

వసంతము అనే మాట వినపడగానే గుర్తుకువచ్చేది యుగఋషి పరమపూజ్య గురుదేవులు. ఆయన వ్యక్తిత్వములో జ్ఞానము, తపస్సు, ప్రేమలతో నిండిన నిర్మలమైన త్రివేణీ ధార ప్రవహిస్తూ ఉంటుంది. వారు దీనిని గురించి చెప్తూ – **"వసంతము అంటే మనకున్న సమయమునకు విలువనివ్వడం, జవసత్వములతో నిండిన నూతనత్వమును గౌరవించడం, సకారాత్మకమైన మార్పుదిశగా అడుగులు వేయడం".** వసంతము అంటే పూలు వెల్లివిరుస్తాయి, వనస్పతులన్నీ ప్రసన్నతను పొందుతాయి, ధరిత్రి చక్కగా సింగారించుకొని ముస్తాబు అవుతుంది. వసంతము అంటే మన మనస్సులో ఉండే ఆకుపచ్చని క్షేత్రము. ఉల్లాసభరితమైన విశిష్టతలు ఏవైతే మన లోపల, బైట ఉన్నాయో అవి అన్నీ వసంతం యొక్క రూపాలే. వసంతం అనేది చెరిగిపోని ఒక రంగు. అది ఒక భావ అనుభూతి. అది మనల్ని అనుభూతులతో నింపుతుంది. జ్ఞానము, ప్రేమ, తపస్సు అనేవి వసంతములో సహజంగానే కలిసి ఉంటాయి. జ్ఞానము మన జీవితం యొక్క దిశను గురించి తెలియచేస్తుంది. కఠినంగా ఉండే సంఘర్షణలను ఎలా ఎదుర్కోవాలో తపస్సు తెలియచేస్తుంది. ప్రేమ అనేది మనల్ని అందరిపట్ల సకారాత్మకమైన సంవేదనాభరితమైన సృజనాత్మకతతో కలిసి ఉండేందుకు దోహదపడుతుంది. ఈ మూడే మానవత్వమునకు అర్థవంతమైనవి.

వసంతము వసంతపంచమితో ప్రారంభమౌతుంది. వసంతములో ఒక క్రొత్త స్ఫురణ ఉన్నది, ఒక క్రొత్త వికాసము ఉన్నది. భారతీయుల సంవత్సరము యొక్క అంతము, ఆరంభము రెండూ వసంతముతోనే మొదలౌతాయి. దీనివలన భారతీయ ఆలోచనల రంగురంగుల సంరచన, కాలము యొక్క నిర్ధారణ ఏమిటో మనకు బోధపడుతుంది. వసంతము అనేది ప్రేమపూరితమైన కుంభమేళ వంటిది. అందులో మనం సంజీవనీ స్నానం చేస్తాము. మాఘశుక్లపంచమి నుండి సంగీతము, సాహిత్యము, కళలతో నిండిన రసమయధారలు కురుస్తూ ఉంటాయి. సరస్వతీమాత ప్రభావము వలన పంచమి నాడు అద్భుతమైన దృశ్య మాలికలు కనపడుతూ ఉంటాయి. అందువలననే ఈ రోజులను శుభాలకు, మంగళకరమైన కార్యములకు ముహూర్త సమయాలుగా పరిగణిస్తారు.

వసంతము కవిత్వమునకు, కళలకు పుట్టినిల్లు. మనం వినగలిగితే కనుక ప్రతి పుష్పము, ప్రతి ఆకు కవిత్వమును పలికిస్తుంది. మన చుట్టూ ఉన్న కాంతివలయానికి సర్వోత్తమమైన ప్రాణకేంద్రము వసంతఋతువు. దుఃఖమనేది ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ వసంతము ఆ దుఃఖమును పోగొట్టి ఒక ప్రగాఢమైన ప్రకృతిరాగమును పలికిస్తుంది. ఇది జీవితమును, కాలమును కలుపుతుంది. ఆంతరిక మనోభావాలలో ఆత్మీయతతో నిండిన ఉల్లాసమును నింపుతుంది. మనం జీవించడం నేర్చుకోవాలి, వ్యక్తిగతంగా పెద్ద మనస్సుతో అందరినీ మనవారిగా చేసుకోవాలి. అందరి దుఃఖములను, బాధలను, సంతోషములను, విషాదములను మనవిగా చేసుకోవాలి. అప్పుడే వ్రాసే కవిత్వానికి, సాహిత్యానికి, ప్రదర్శించే కళలకు సార్థకత చేకూరుతుంది.

కేవలము కవి యొక్క కల్పనలో మాత్రమే వసంతము రమణీయంగా ఉంటుందని అనుకోకూడదు. వసంతఋతువు ఆగమనం నిజంగానే ప్రకృతిరమణీయంగా, కన్నులవిందుగా ఉంటుంది. ఆ సమయంలో పర్యావరణము, పరిస్థితులు అన్నీ సమస్థితిలో ఉంటాయి. శీతఋతువుకి–గ్రీష్మఋతువుకి మధ్యస్థంగా ఉండేదే వసంతఋతువు. భూమిమీద, నీటిమీద పద్మాలు కనిపిస్తుంటాయి. మలయసమీరము మందగతితో వీస్తూ ఉంటుంది. పువ్వుల మీద నుండి వీచే గాలిలోని సౌరభములతో వనాలు, తోటలు అన్నీ తలలూపుతూ ఆనందాన్ని కలిగిస్తాయి. మనం గ్రామీణజీవితంలో ఉన్నా, మహానగరాలలో ఉన్నా, ఏ సభ్యతను అనుకరించినా పిండారబోసినట్లు ఉండే మృదువైన తెల్లని వెన్నెల కిరణాలు, పక్షుల కిలకిలారావాలు, కోయిల కూతలు, కుసుమసౌరభాలు, శోకమును నశింపచేసే అశోకవృక్షముల విశిష్ట సౌందర్యములు ఈ సమయంలో చాలా ఆహ్లాదకరంగా ఉంటాయి. వసంతకాల గుణము, కాషాయము వలె పవిత్రంగాను, మధురంగాను ఉంటుంది. హేమంత ఋతువులో శ్లేష్మము వృద్ధి అవుతుంది. వసంతకాలము రాగానే

**తల్లిదండ్రులు ఒకే జన్మకు పరిమితం, గురువు ఏ జన్మకు మారడు**

అది ప్రకోపిస్తుంది. ఈ సమయంలో వాయుగుణము కొంత శమిస్తుంది.

హరిత సంహితలో ఇలా వ్రాయబడింది– "వసంతఋతు సమయంలో ఆనందంతో మత్తెక్కిన కోయిలల కుహూకుహూ రావాలతో అరణ్యాలు, ఉద్యానవనాలు, ప్రతిధ్వనిస్తుంటాయి. తోటలు, ఉద్యానవనాలు, పర్వతశ్రేణులు పూల యొక్క సువాసనలతో పరిమళిస్తుంటాయి. సంగీత దామోదరుని ప్రకాశములో, ఆరురాగాలు, అరవై రాగిణులు ఉన్నాయి. ఈ రాగాల మధ్య వసంతము కూడా ఒక రాగమౌతుంది. శ్రీరాగము, వసంతము, భైరవి, పంచమి, మేఘ, వృహన్నాట అనేవే (वृहन्नाट) ఈ ఆరురాగాలు. వసంతపంచమి రోజు వసంతరాగమును ఆలపించడమంటే కోరినవి పొందడమని చెప్తారు. వసంతపంచమిలో సరస్వతీ మాత చేతనత్వము కలిసి ఉంటుంది. సరస్వతి యొక్క అంగములు – లక్ష్మి, మేధ, ధరా, పుష్టి, ప్రభ, ధృతి. నిరాలా అనే మహాకవి "వరదే వీణావాదిని వరదే" అనే కీర్తనను వ్రాసే ముందు ఆయన సంస్కారములో **"వదవద వాగ్వాదిని వాహినీ వల్లభా"** అనే సరస్వతీ దశాక్షర మంత్రము కలిసి పోయుంటుంది. మేధ, ప్రజ్ఞ, విద్య, ధీ, ధృతి, స్మృతి, బుద్ధి, విద్యైశ్వర్య అనేవి పీఠ దేవతలు. భారతదేశము యొక్క సాంస్కృతిక పరంపరలో ఐదు శక్తులు అంగీకరించబడ్డాయి–రాధ, పద్మ, సావిత్రి, దుర్గ, సరస్వతి. వాక్కుకు అధిష్ఠాత్రి, శాస్త్రజ్ఞాన ప్రదాయిని అయిన ఆమె పేరు సరస్వతి.

పురాతన కాలం నుండి ఇప్పటి వరకు వసంతఋతువు మనిషిని సమ్మోహితుని చేస్తూనే ఉంటుంది. వసంతము యొక్క ప్రాకృతిక సౌందర్యము అంటే మన చుట్టూ ఉన్న వాస్తవికత, మన అంతరంగముల అద్భుతమైన కలయికగా అర్థము చేసుకోవాలి. ఈ తేజస్సును మనం కాపాడుకుంటూ ఉండాలి. వసంతము అనేది మన లోపల ఉండే రాగమునకు ప్రత్యక్ష రూపము. అందుచేత దానిని భూమి మీద సురక్షితంగా ఉంచుకోవడం అనేది మన ప్రస్తుత కర్తవ్యం. అడవులు తరిగిపోతున్నాయి, ప్రతి సంవత్సరము లక్షలాది టన్నుల కాలుష్యము తయారైపోవడం చేత భూమిమీద ఉండవలసిన సమశీతోష్ణ స్థితులు ప్రభావితమౌతున్నాయి. దాని వల్ల ఏర్పడే ఉష్ణోగ్రతలకు జలము, వాయువు, అడవులు నశించిపోతున్నాయి. పారిశ్రామిక కాలుష్యం, యాసిడ్‌ల వల్ల మానవునికి, వసంతమునకు ప్రమాదం ఏర్పడుతున్నది. పక్షుల కిలకిలరావాలు మూగబోతున్నాయి. పంట పొలాలలో చల్లే పురుగుల మందులు భయంకరస్థితిని ఉత్పన్నం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో మనిషి యొక్క ప్రేమ, తపస్సు, జ్ఞానములు మాత్రమే అంతరంగములోని వసంతమును, వాతావరణము నందలి వసంతమును రక్షించగలిగే సామర్థ్యమును కలిగి ఉంటుంది.

వసంతము యొక్క అర్థము ఏమంటే 'మన సంపూర్ణ అస్థిత్వముకున్న సృజనాత్మక రాగానుభూతి'. ఈ అనుభూతిని ప్రగాఢం చేసుకుంటూ ఉంటే మన యొక్క ఉదాసీనత కడిగివేయబడి ఆనందము ఆవిష్కరింపబడుతుంది. అది మాత్రమే కల్పనాసామర్థ్యము, పునః నవీకరణ, ప్రేమ అనే సమ్మోహన అస్త్రమును సంధించగలదు. అందులోను ఒక లాలిత్యము ఉంది. వసంతఋతువులో పద్మములు, పుష్పములు, ఆహార–విహారములు, గీత–సంగీతములు, శస్త్ర– విన్యాసములన్నింటిలోను ఒక నూతనత్వము, శోభ గోచరిస్తుంది. హోలీ యొక్క రాగాలు ప్రారంభమౌతాయి. హోలీ గీతాలలో ఆనందము, సంతోషము, ఉల్లాసము, ఉత్సాహములతో పాటు రైతుల జీవితములోకి ఒక క్రొత్తదనం కూడా వస్తుంది. జీవితంలో ఉండవలసిన ఇలాంటి అనుభూతులన్నీ ఈనాడు ఉద్యోగాలలోను, ధనములోను చేరిపోయాయి. ఈ పరిస్థితి వల్ల వసంత ఆగమనము తనతో పాటు తీసుకువచ్చే రంగులు, మౌన భాషలు, రసానుభూతులు ఎంత వెతికినా ఎవరికీ కనిపించవు. ప్రసన్నంగా ఉన్న ధరిత్రి, దాని యొక్క అనేక భవ్యతల కొరకు మనం చూసే ఎదురుచూపులు, మన తీవ్రమైన ఆకాంక్షల పేరే వసంతము.

యుగఋషి పరమపూజ్య గురుదేవులు ఇలా చెప్పేవారు –"వసంతపంచమి అనేది పృథ్విపై మన జీవితమునకు ఒక నవోదయమును, అభ్యుదయమును కలుగచేసే ఒక అవకాశము. అందుకొరకై మనమంతా ఒక క్రొత్త విశ్వాసాన్ని, ఒక క్రొత్త సంకల్పాన్ని తీసుకోవాలి." వసంతపంచమినే 'శ్రీపంచమి' అని కూడా అంటారు. 'శ్రీ' అంటే సౌందర్యము, ఐశ్వర్యము కూడా. ఈ సౌందర్యాన్ని లక్షలాది గ్రామీణ ప్రజలలోను, ఆదివాసీయులలోను, నగరాలలో ఉండే మురికివాడలలోను విద్య ద్వారా తీసుకురావాలి. వసంతము రోజు ధరించే పసుపుపచ్చని వస్త్రములు ఇందుకు తగిన వాతావరణాన్ని చక్కగా తయారు చేసినప్పటికీ అది మాత్రమే సరిపోదు. ప్రకృతి ప్రకోపాలకి

**గురువు కంటే గురునామానికి ఎక్కువ శక్తి ఉంటుంది**

తల్లడిల్లిన వారి ముఖాలలోనే అసలైన ఉల్లాసము, ఉత్సాహము తీసుకురావాలి. కాశ్మీరులో కుంకుమపువ్వు యొక్క సుగంధాలు మరల విరజిమ్మేలా చేయాలి. విద్యాలయాలకు పంపవలసిన పసిపిల్లలే అసలైన కుసుమాలు. మన వ్యక్తిగత ప్రార్థనను సంకల్పంగా మార్చుకొని దానిని సామూహికంగా మార్చి అందరితో చెప్పించాలి. వ్యక్తుల మధ్య ఉండే విభేదాలను తగ్గించుకుంటూ వసంతము యొక్క ప్రభావాన్ని పెంచుకుంటూ పోవాలి. ఇలాంటి సమరసత, సామరస్యము ఎంత పెరిగితే పుష్పముల పరాగములు అంత పెరుగుతాయి.

ఈ విషయాన్ని మనం ప్రతిరోజు నిత్యజీవితంలో నేర్చుకుంటూనే ఉండాలి. ఈనాడు జీవితంలో ఆనందమనేది లేకపోవడం వలన ప్రేమవిహీనంగా మారింది. వ్యక్తి, సమాజము రెండింటి లోను జడత్వము నిండి ఉన్నది. దీనిని వసంతము యొక్క రంగులతో విరగ్గొట్టేయాలి. జీవితము నుండి ఆనందమనేది లాగివేయబడింది. సమాజానికి కానీ, తనకు తాను కానీ ఏదైనా ఇచ్చుకోగలిగేంత ప్రగాఢత మనిషికి మిగిలిలేదు. ఆత్మీయతా పూర్వకమైన దగ్గరతనం లేకపోతే మనిషికి అర్థమేమిటి? ఎక్కడ దగ్గరతనం లేదో అక్కడ నిరుత్సాహము ఆవరించి ఉంటుంది. ఇందుకు భిన్నంగా సోషల్ సైట్లలో ఈ సంపర్కములను సాధించాలని ప్రయత్నిస్తున్నాము. అక్కడ ఆత్మీయత ఉండదు, వర్చువాలిటీ ఉంటుంది. ఆత్మీయతను సాధించాలంటే మనం తిరిగి మనలను, మనవారిని వసంతం యొక్క అర్థమును తెలుసుకునేలా ప్రోత్సహించుకోవాలి.

ఆధునికత, వృత్తి–వ్యాపారాలు, కృత్రిమతలతో నిండిన ఈ యుగములో వసంతఋతువు మనల్నందరినీ ప్రశ్నిస్తున్నది. వసంతము తెలుసుకోవాలనుకున్నది ఏమిటంటే ఈనాడు మనిషికి, మనిషికి మధ్య, మనిషికి–సమాజానికి మధ్య, మనషికి, సమాజానికి – ప్రకృతికి మధ్య కలుగుతున్న వేర్పాటు ధోరణులు మనల్ని ఎక్కడికి తీసుకువెళ్తున్నాయి? ఆకాశము, నక్షత్రాలు, వృక్షాలు, వాటిపై హాయిగా, శ్రావ్యంగా గీతాలు ఆలపించుకునే పక్షులకు, నదులలో చేసే సహస్రశీర్ష స్నానాలకు మనం పరాయివారమైపోయాము ఎందుకు? మనం ఏర్పరుచు కుంటున్న క్రొత్త ఆలోచనలతో తయారైన జీవన విధానము, జీవితమును జీవించే కళను మర్చిపోయేలా చేస్తున్నదా? అదే నిజమైతే మనలోని దోషాలను మనమే గుర్తించి వాటిని తొలగించుకునే ప్రయత్నం చేయాలి. జీవితములో జ్ఞానము, తపస్సు, ప్రేమల గొప్పతనమును గుర్తించాలి. వీటిని గురించి చెప్పేందుకై విచ్చేసిన యుగఋషి, వేదమూర్తి, తపోనిష్ఠ, ప్రేమావతారులు అయిన పరమపూజ్య గురుదేవుల ఆలోచనలలో ఉన్న సౌందర్యమును తెలుసుకోవాలంటే శాస్త్రములను గురించిన లోతైన అవగాహన ఉండాలి. ఈ వసంతపంచమి, ఈ వసంత ఋతువు భరతభూమిపై పురాతన ఋషుల ద్వారా అందించ బడిన జీవనవిధానమును తిరిగి చూడాలని కోరుకుంటున్నది.

*– అఖండజ్యోతి, జనవరి 2015*
*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## అఖండ దీపమే "అఖండ జ్యోతి"

*1940 దశకం తొలి సంవత్సరాలలో జరిగిన సంఘటన. పూజ్య గురుదేవులు కలకత్తాలోని నేషనల్ లైబ్రరీలోని గ్రంథాలను పరిశీలించి తిరిగివస్తున్నారు. త్రోవలో గోరఖ్‌పూర్ ఆరోగ్యమందిర్ సంచాలకులు శ్రీ మోదీని కలుసుకోవాలని అనిపించింది. ఆయనతో సమావేశం జరిగింది. తాము తమ "అఖండజ్యోతి" పత్రికను వాణిజ్య ప్రకటనలు తీసుకోకుండా నడపాలని ఆలోచిస్తున్నామని గురుదేవులు తెలిపారు. అందుకు మోదీజీ ఇలా అన్నారు. "నేను మీ పరిస్థితిని స్పష్టంగా చూస్తున్నాను. మీ ఆర్థిక పరిస్థితి అంత బాగాలేదని మీ బెడ్డింగ్‌పై వేసి ఉన్న అతుకు, మీ దుస్తులు చెప్తున్నాయి. ఈ పరిస్థితిని బలీయం చేసుకున్న తర్వాతనే ఏదైనా వ్రతాన్ని స్వీకరించాలి. వాణిజ్య ప్రకటనలను తీసుకోకపోతే పత్రిక నడిచేది ఎలా? పత్రికను మూసివేయండి లేదా వాణిజ్య ప్రకటనల ఆధారంగా దానిని నడపండి."*

*మోదీజీ చేసిన సూచన ఆచరణాత్మకమైనది. అది కఠోర సత్యం. కానీ, గురుదేవుల సంకల్పశక్తి అచంచలమైనది. ఆయన ఆ సవాలును స్వీకరించారు. వాణిజ్య ప్రకటనలను తీసుకోలేదు. కానీ పత్రిక చాలా బాగా నడిచింది.*

*ఆ తర్వాత 1950లో మోదీ ఘియామండి వచ్చి గురుదేవులను కలుసుకున్నారు. వారిని అఖండదీపం వద్దకు తీసుకువెళ్ళి గురుదేవులు ఇలా అన్నారు – 'ఇదే నా అఖండజ్యోతి', పత్రిక ప్రచురణకు ప్రాణాధారం అయిన మనోబలాన్ని ఈ దివ్య ప్రకాశమే ప్రదానం చేసింది.'*

**బాధ్యతలను మరచిపోకూడదు**

బోధ కథ

# ఒక బాద్‌షాగారి విలక్షణ న్యాయం

బాద్‌షా "శేర్‌షా సూరి" గారి దర్బారు కిక్కిరిసిపోయి ఉన్నది. దర్బారులో ముఖ్యులు, సామాన్యులు అంతా వారి వారి స్థానాలలో చేరి ఉన్నారు. ముఖ్యులైనవారు తమ ఠీవి. దర్పంనకు సరితూగే ఆసనాల మీద కూర్చొని ఉంటే, సామాన్య ప్రజలు, కూర్చోటానికి స్థానం దొరికినవారు కూర్చోగా, మిగిలినవారు నిలబడి ఉన్నారు. రాజ్యంలోని ముసలి, ముతక, యువత, పిల్లలు మొత్తం ప్రజలందరు చేరారు. దర్బారులో శాంతి నెలకొని ఉన్నది. ఇంతమంది ఇక్కడ చేరినప్పటికి ఏవిధమైన కోలాహలం లేదు. మంత్రి, సేనాపతి మొదలైన సదస్యులంతా కొంత విచారంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. అందరి ముఖరేఖలు, అక్కడేదో ఒక జరగరాని సంఘటన జరగ బోతున్నట్లుగా కనిపిస్తున్నది. ఈ బహిరంగ సమావేశంలో చేరినవారు, తమ న్యాయ ప్రియుడు, సాహసవంతుడు, ప్రజా రంజకుడైన బాద్‌షాగారి న్యాయనిర్ణయాన్ని వినగోరుచున్నారు.

తమకు జరిగినదానికి, న్యాయం కొరకు ఆశిస్తున్న మిఠాయి వ్యక్తి, అతనితోపాటు అతని భార్య ఉన్నది. బాద్‌షావారు చేయు న్యాయనిర్ణయం కొరకు ఎదురు చూస్తున్నారు. ఈ మిఠాయి దంపతుల వివాహం జరిగి కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే. అతని శరీరరంగు శ్యామల వర్ణం, ఉంగరాల జుట్టు, తెల్లటి పంచె కట్టుకొని, నీలిరంగు చొక్కా ధరించి, భుజాల మీద కాషాయ రంగు ఉన్ని ఉత్తరీయాన్ని వేసుకొన్నాడు. అతని భార్య అందమైన గులాబీరంగు అంచు గల తెల్లటి పట్టుచీరను ధరించి దాని మధ్యలో వంకాయ రంగుతోకూడిన పసుపు రంగున్న అల్లిక పని కలిగి ఉన్నది. శుభ్రమైన, తెల్లటి ముఖం కోపంతో జేవురించి ఉన్నది. ఆమె రూపం ప్రతీకారపు జ్వాలతో మండి పోతున్నట్లు ఉన్నది. ఆమె తన మీద జరిగిన అవమానానికి న్యాయం కోరి వచ్చింది. బాద్‌షా తనకు సరైన న్యాయం చేయగలరనే ఆశతో ఉంది.

ఒక వ్యక్తి న్యాయ కటకటాల బోనులో నిలబడి ఉన్నాడు. అతడెవరో కాదు, స్వయానా బాద్‌షాగారి కుమారుడు జలాల్ ఖాన్. న్యాయాధీశుడైన 'షేర్‌షా సూరీ' నేడు స్వయంగా జలాల్ ఖాన్ మీద ఆరోపించబడిన అపరాధం మీద తీర్పు ఇవ్వవలసి ఉంది. బాద్‌షాగారి తీర్పు న్యాయంగా, నిష్పక్షపాతంగా, తటస్థంగా, సాహసంతో కూడి ఉంటుందని అందరికి తెలుసు. ఆయన అపరాధిని దండించడంలో ఉపేక్షించడు. అప్పుడప్పుడు తన వారిని కూడా తప్పు చేస్తే దండించకుండా వదలలేదు. న్యాయ సంబంధంలో ఎటువంటి ఒడంబడికకు అవకాశ మివ్వడు. ఈ కారణంగానే అక్కడున్న వారిలో రహమాన్ అనే వ్యక్తి తన భార్యతో ఇలా అంటున్నాడు. "నూర్ బేగమ్‌నకు తెలుసా. మన బాద్‌షాగారు అరాజకత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ఒప్పుకోడు. రాజ్యంలో తలెత్తే అరాజకవాదుల బలాన్ని నిర్మూలించుట కొరకు, వారు సైన్యాన్ని వినియోగించారు. ఈ సైనిక వ్యవస్థ అనేది వారి బలమైన మస్తిష్కానికి కానుక వంటిది. సేన ద్వారా మన రాజ్యాన్ని బయట నుండి వచ్చు ఆక్రమణ దారుల నుండి రక్షణ చేయబడుతుంది. అలా కానిచో రాబోయే కాలంలో మన సీమల మీద దొంగలు, ఇతర రాజ్యాల సేనలు ఆక్రమణ జరిపి ఉండేవారు. దానితో మన రక్షణా విధానంలో తొట్రుపాటు జరిగేదే. దానితో ప్రజలు భయభ్రాంతులు అవుతారు. రెండవది రాజ్యంలో వ్యాపారం చేసే వ్యాపారులకు భారీ నష్టం వచ్చేది. ఎందుకంటే దొంగలు, లూటీకోరులు వ్యాపారులను లూటీ చేసేవారు. అయితే ఈ రక్షణ వ్యవస్థంతా సైన్యం నియంత్రణలో ఉన్నందున వ్యాపార-వాణిజ్యాలు బాగా అభివృద్ధి చెందాయి.

నూర్ బేగమ్ చదువుకొన్న తెలివిగల మహిళ. ఆమెకు మిఠాయి వాని భార్య తెలుసు. ఆమె తన భర్త బాద్‌షాగారి మంచితనం గురించి చెప్పిన మాటలను విని ఇలా అన్నది- "సైన్యమైతే మనదేశ సరిహద్దులో నిఘావేసి ఉంటుంది. మరి రాజ్యం లోపల ఉండే దొంగలు, మోసగాళ్ళు, జేబు దొంగలు, అరాజకాన్ని లేపేవారి కొరకు బాద్‌షాగారు ఎటువంటి వ్యవస్థను ఏర్పరిచారు? సైన్యం అక్కడ నుంచి వచ్చి, ఇక్కడ దాడి చేయలేదు కదా!" రహమాన్‌కి తన బేగం వేసిన ప్రశ్నతో ఎంతో ఆనందం కలిగింది. అతనికి తన భార్య తెలివికి,

**చేసే పనులు తన్మయత్వంతో చేయాలి**

చాతుర్యానికి మీద ఎంతో గర్వంగా ఉన్నది. అతను అన్నాడు ఇలా – "మన బాద్‌షాగారు రాజ్యం యొక్క ఆంతరిక సురక్షా భారాన్ని విశేష బలమున్న వారిచేతుల్లో అప్పగించుట జరిగింది. ఈ బలగాలు మన రాజ్యం, లోపల సురక్షా కార్యాన్ని చూస్తుంది. వీరు సామాన్య పౌరులను బాధించకుండా ఉండేందుకు బాద్‌షాగారే దీని ముఖ్య నియంత్రణను తన చేతిలో తీసుకోవటం జరిగింది. ఈ ప్రకారంగా బాద్‌షాగారు మన రాజ్యపు ఆంతరిక – బాహ్యాపరంగా, ఇరువైపులా రక్షణను దృఢంగా ఉంచగలిగారు. అందుచేతనే మనవంటి సామాన్య ప్రజలంతా సుఖంగా జీవించగలుగుచున్నాము.

ఇంకా బాద్‌షాగారు దర్బారులోకి వేంచేయలేదు. అందుచేత అందరు శాంతంగా, మెల్లగా ఒకరు మరొకరితో మాట్లాడుకొంటున్నారు. నూర్‌బేగం, రహమాన్ మాటలు తమ ప్రక్కనే కూర్చొని వింటున్న 'అన్సారీ' అనే వ్యక్తి ఇలా అన్నాడు. "రహమాన్! మన బాద్‌షాగారు రూపాయి చలామణిని మొదటిసారి ప్రచారంలోకి తెచ్చాడు. రూపాయి చలామణితో మన ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటున్నది. ఎందుకంటే నాణాల చలామణితో మన వాణిజ్య వ్యవహారాలు బలం పుంజుకొనేందుకు ఆధారాలు. రాజ్యం మొత్తంలో ఇప్పుడు ఒకేరకమైన కొలతలు–తూనికల విధానం అమలు చేయబడు తుంది. అంతేగాక మన తపాలా వ్యవస్థను పునర్జీవితం చేయబడినందున, ఒక స్థానం నుండి వేరేచోటకు క్షేమ సమాచారాలు పంపుటలో ఏ కష్టము ఉండటం లేదు.

ఇంకా అన్సారీ ఇలా చెప్పుకొస్తున్నాడు. "మన బాద్‌షాగారు మన రాజ్యంలో పొడవైన రాజమార్గాలను రవాణా కొరకు ఏర్పరిచాడు. ఇవి "సహర్ రాహ్–ఏ–ఆజమ్" అనే పేరుతో పిలవబడుతున్నాయి. (అనగా బాద్‌షా రోడ్లు) ఇంకా ఏదో చెప్పబోయినంతలో, బాద్‌షా రాక గురించి సూచన చేయబడింది. సభాసదులు, దర్బారులో ఉన్న ప్రజలంతా నిలబడి, దర్బారులో కొచ్చిన బాద్‌షాకి సలామ్‌లు చేసారు. బాద్‌షా కూడా అందరి సలామ్‌లు స్వీకరించి, అందరిని వారివారి స్థానాల్లో కూర్చోమని సూచించారు.

'షేర్‌షా సూరి' దర్బారులో ఒక అద్భుత న్యాయం ఈనాడు జరగబోతున్నది. బాద్‌షాగారి సూచన మీదట ఆనాటి వ్యవహారాలన్నీ ఎదుటకు తీసుకొని రాబడ్డాయి. బాద్‌షాను చూసిన మిఠాయివాలాకు భయం కలిగింది. అయితే అతని భార్య నిర్భయంగా నిలబడింది. బాద్‌షాగారు ఇలా అన్నారు – "భయపడకు! మీ యెడల ఎటువంటి అత్యాచారం జరిగింది. జలాల్‌ఖాన్ నీ భార్యయెడల ఎటువంటి అసభ్యకరమైన పని చేశాడు? బాద్‌షాకి ఈ విషయమంతా ముందుగానే తెలియ చేయబడి ఉన్నప్పటికి, ఈ నిండు దర్బారులో అందరి ఎదుట జరిగిన దానిని తెలియపరచుట కొరకు – మిఠాయివాలాని ప్రశ్నించుట జరిగింది. అందుచేత మిఠాయివాలాకి తన వాంగ్మూలాన్ని వినిపించేందుకు అవకాశమీయబడింది. మిఠాయివాలా భయపడుతూ, భయపడుతూ తన భార్యకి జరిగిన అవమానకరమైన కథనాన్ని చెప్పసాగాడు. అయితే అతడు భయం చేత చెప్పలేక తడబడుతున్నందున, అతడి భార్య ముందుకొచ్చి బాద్‌షాగారితో ఇలా విన్నవించింది. "హుజుర్! నా అహంకారాన్ని మన్నించండి! మీ ఆజ్ఞ అయితే మా యెడల జరిగిన అసభ్యకరమైన చెడు ప్రవర్తనను విన్నవిస్తాను". బాద్‌షా అనుజ్ఞనిచ్చాడు – "అనుమతిస్తున్నాను.. నీవే చెప్పు! నీ యెడల ఏం జరిగిందో?"

మిఠాయివాలా భార్య తనువు–మనసు అవమానంతో దహించుకుపోసాగింది. ఆమె మాట్లాడటానికి ప్రయత్నించే సరికి, ఆమె మాటల్లో ఆక్రోశం బయటకు రాసాగింది. అయితే గొప్ప సంయమనంతో తనను తాను సంబాళించుకొంటూ ఇలా చెప్పింది. "జహాపనా! స్నానాలు చేయుగదిలో మా స్త్రీలందరు స్నానాలు చేస్తూ ఉంటాము. దాని గోడల్లో పెద్ద పెద్ద కిటికీలు ఉన్నాయి. వెనుకటి రోజులలో తుఫానుతో చాలా కిటికీలు విరిగిపోయి చాలా పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. ఎవరైనా ఏనుగును ఎక్కి వచ్చి వాటి గుండా చాలా తేలికగా తొంగి చూడవచ్చు. జహాపనా! ఆ స్నానాల గదిలో నేను స్నానం చేస్తున్నాను. నా శరీరం మీద చిన్న వస్త్రముంది! ఆ సమయంలో నా వీపుకు తగిలేటట్లు గులాబీ పువ్వును ఎవరో విసిరారు. నేను త్రుళ్ళిపడి వెనుదిరిగి చూస్తే విరిగిన కిటికీ ఆవల మీ కుమారుడు జలాల్‌ఖాన్ ఏనుగునెక్కి వస్తూ నేను స్నానం చేయటం చూసి సిగ్గులేకుండా నవ్వసాగాడు. నేను తడిసిన వస్త్రాలతో నన్ను నేను చుట్టబెట్టుకొంటూ ఉంటే ఇంకొకసారి గులాబీపూలను నా మీద విసిరాడు. నాకు సిగ్గుతో చచ్చినంత పనైంది.

**మనిషికి వచ్చే బాధలకు కారణం - కాల ప్రవాహానికి వ్యతిరేకంగా వెళ్ళడమే**

మిఠాయివాలా పత్ని మాటల్లో ఆమెలోనున్న అవమానకర బాధ అంతా బయటకు రాసాగింది. ఆమె చెప్తూచెప్తూ వెక్కి వెక్కి ఏడవసాగింది. మిఠాయివాలా ఆమెను ఊరడించి, ఆమె కన్నీటిని తుడిచాడు. తిరిగి ఆమె చెప్పసాగింది. "హుజూర్" మీరు ఎటువంటి అన్యాయాన్ని సహించరని నేను విన్నాను. తమరే చెప్పండి. ఇది స్త్రీ జాతికి అవమానించుట కాదా? ఏ అధికారముందని తమరి పుత్రుడు జలాల్‌ఖాన్ ఇటువంటి దుస్సాహసానికి ఒడిగట్టాడు. ఇటువంటి అధికారాన్ని ఏ స్త్రీ కూడా తన భర్తకు కూడా ఇవ్వదు. మరి... మరి... "ఈ మాటలు అంటూ ఆమె అచేతనంగా పడే సమయంలో, ఆమె భర్త ఆమెను చేతిలోకి తీసుకొని ఆపాడు. దర్బారు మొత్తం స్థబ్దమైంది. ఆమె బాధను గమనించిన వారంతా నిర్ఘాంత పోయారు. స్త్రీలంతా కంటతడి పెట్టారు. మనసులోనే అందరు అనుకోసాగారు. "జహాపనా! ఇది అన్యాయం. దీనికి తగిన శిక్షను అమలుచేయవలసిందేనని" కోరుకోసాగారు.

బాద్‌షా అంతా విని జలాల్‌ఖాన్‌తో "ఇదంతా సత్యమేనా?" అని అనగానే జలాల్‌ఖాన్ కళ్ళు క్రిందకు వచ్చి, తల త్రిప్పి అవుననే సంకేతమిచ్చాడు. షేర్‌షాగారు సింహనాద స్వరంతో తీర్పు వినిపించారు. షేర్‌షా న్యాయప్రియులు. ఈ న్యాయ తీర్పులో, వారు జలాల్‌ఖాన్‌కి విధించిన శిక్షను విన్న వారంతా వణికిపోయారు. ఎవ్వరు ఇంతవరకు ఇటువంటి శిక్ష గురించి వినటంగాని, లేక ఊహించుటగాని ఎరుగరు. బేగమ్, మంత్రి, సేనాపతి అంతా అవాక్కయ్యారు. సభాసదులంతా ఏంచేయాలో తెలియక, ఈ శిక్షను ఎలా అమలుపర్చాలనే ఆలోచనలతో కంగారు పడిపోయారు. ఇంతటి శిక్ష బాద్‌షా తమ పుత్రునకు విధిస్తారని ఎవరూ తలంచక, కింకర్తవ్యతావి మూఢులయ్యారు. బాద్‌షాగారి స్వరం తిరిగి ఇలా ప్రతిధ్వనించింది. "మా ఆదేశం నేడే, ఇప్పుడే, వెంటనే పాటించాలి" అని చెప్పి వారు తమ షాహీ నివాసానికి వెళ్ళిపోయారు. సభలోని వారంతా ప్రతిమల వలె నిశ్చేష్టులయ్యారు.

బాద్‌షాగారు, జలాల్‌ఖాన్‌కి విధించిన శిక్ష ఏమనగా "ఎక్కడైతే ఆ స్నానాలగది ఉన్నదో, అందులో జలాల్‌ఖాన్ బేగం స్నానం చేస్తూ ఉండగా మిఠాయివాలా ఏనుగునెక్కి సరిగ్గా అదేవిధంగా ఆమెమీద పూలు విసరాలని, జలాల్‌ఖాన్ అంతకు క్రితం ఏవిధంగా వ్యవహరించాడో, అదేవిధంగా ఇప్పుడు జరగాలని" – దాని తరువాత బాద్‌షాగారిచ్చిన ఆదేశం ఎంతో భయంకరంగాను, ఎంతో వజ్రఘాతంతో సమానంగా ఉన్నది. వారి రెండవ ఆదేశం ఆ ఏనుగుచేత, అదేస్థానంలో జలాల్‌ఖాన్‌ని తొక్కి చంపివేయాలని తిరిగి ఎవ్వరు ఇటువంటి పని ఎన్నడూ చేయకూడదని, ఒకవేళ చేస్తే ఇదే గతివారికి కూడా జరుగుతుందనే సంకేతం ఇందులో ఉన్నది. ఈ శిక్ష విన్నవారంతా భయంతో వణికిపోసాగారు. ఎవరికి ఏమీ పాలుపోకుండా ఉన్నది. మిఠాయివాలా, అతని భార్య కూడా ఈ శిక్ష విని నిర్ఘాంతపోయారు, ఇటువంటి సాహసంతోకూడిన న్యాయం జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు.

మిఠాయివాలాను, అతని భార్యను గౌరవ–మర్యాదలతో వారి ఇంటికి పంపుట జరిగింది. వీరింటి ముందు, దర్బారులో ఉన్నవారంతా వచ్చి గుంపుగా చుట్టూ మూగారు. మంత్రులు, మహామంత్రి, సేనాపతి మొదలైన వారంతా జలాల్‌ఖాన్‌కి ఇంత పెద్ద శిక్ష విధించకూడదని వేడుకొంటూ ప్రార్థించ సాగారు. ఈ శిక్ష అమలు అయితే రాజ్యం కష్టాలలో పడగలదు. మిఠాయివాలా పత్ని తెలివిగలది. ధైర్యం గల స్త్రీ. ఆమె వీరి ప్రార్థన విని ఇలా అన్నది. "జలాల్‌ఖాన్ గనుక బాద్‌షాగారి శాసనాన్ని అధికారాన్ని యదావిధిగా ఉంచుటకు, తన భావి రాజ్య అధికారంలో స్త్రీ జాతికి గౌరవ మర్యాదలు ఇస్తాననే హామీనిస్తే, రాజ్యహితం కొరకు మేము బాద్‌షా గారిని ప్రార్థించి ఇతడి తప్పును క్షమించవలసిందిగా వేడుకొంటాము". అప్పుడు జలాల్‌ఖాన్ స్వయంగా తనను క్షమించమని కోరాడు. తరువాత పైన కోరినట్లుగా తమ పరిపాలనలో 'స్త్రీ జాతి' ని గౌరవించి, వారి సంరక్షణ కొరకు ఉచితమైన ఏర్పాట్లు చేస్తామని ప్రతిజ్ఞ చేశాడు.

ఈ విధంగా మిఠాయివాలా, అతని పత్ని జలాల్‌ఖాన్‌ని క్షమించిన తరువాత వీరువురి అభ్యర్థన మేరకు బాద్‌షా కూడా జలాల్‌ఖాని క్షమించాడు. న్యాయప్రియుడు, శాసనకర్త అయిన షేర్‌షా సూరీకి ఉత్తరాధికారిగా జలాల్‌ఖాన్‌ని చక్రవర్తిగా నియమించుట జరిగింది. రాజ్యభారాన్ని వహించిన తరువాత జలాల్‌ఖాన్ ఈ ఘటనను ఎప్పటికి మరవలేదు. స్త్రీలను గౌరవంగా చూస్తాననే వాగ్దానాన్ని చివరి క్షణం వరకు పాటించాడు.

*– అఖండజ్యోతి, మార్చి 2011*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**గురువు అది చెయ్యి, ఇది చెయ్యి అని చెప్పడు - లక్ష్యం ఇస్తాడు అంతే**

నేతాజి జయంతి ప్రత్యేకం

# సుభాష్ చంద్రబోస్ జీవితములోని రహస్య పక్షము

కిశోర వయస్సులో ఉన్న సుభాష్‌చంద్రబోస్ మనస్సు ఒకచోట నిలకడగా ఉండటం లేదు. అంతకుముందెన్నడు కనీసము ఊహించనటువంటి చిత్రవిచిత్రమైన కల్పనలు ఆ రోజులలో అతని మనస్సులో పురుడు పోసుకుంటున్నాయి. ఆ కల్పనాలోకములో తేలియాడుతుండటమే అతనికి బాగున్నది. అప్పుడప్పుడు అతను తనను తాను దివ్యాత్మ హిమాలయపర్వతసానువులలో ఎవరో కొంతమంది సాధువులు, మహాత్ములతోపాటు తపస్సు చేస్తున్నట్లు కల్పన చేసేవాడు. వారితోపాటు కలిసి తిరుగుతున్నట్లు, వారి సత్సంగములో పాలుపంచుకుంటున్నట్లు ఊహించేవాడు. ఆ సత్సంగములో పాల్గొన్న సమయములో జీవన రహస్యములను గురించి తనలో రేకెత్తే జిజ్ఞాసను ప్రశ్నల రూపంలో వెల్లడించే వాడు. అసలు మనము ఎందుకు జన్మిస్తున్నాము? జన్మిస్తే మన ఇచ్ఛానుసారము ఏ పనినైనా ఎందుకు చెయ్యలేక పోతున్నాము? మనము అభిలషించిన కార్యములనెందుకు ఆచరించలేక పోతున్నాము? అవి చెయ్యలేనటువంటి వివశత్వము మనకు ఎందుకుంటున్నది? ఇత్యాది ప్రశ్నలెన్నో కల్పనలలో తలెత్తి, జవాబులు లభించ కుండానే కరిగిపోతున్నాయి. గాఢమైన ఈ కల్పనలన్నీ ఇక ఇప్పుడు స్వప్నాలలో దోబూచులాడు తున్నాయి. కళ్ళు తెరచినప్పుడు అవే కనిపిస్తున్నాయి, కళ్ళు మూసుకున్నప్పుడు అవే కనిపిస్తున్నాయి, అంతేకాదు ఇప్పుడు కలలో సైతం సాధువులు, మహాపురుషులు అతనివద్దకు రాకపోకలు సాగిస్తున్నారు.



సుభాష్ ఈ కల్పనలు మరియు ఆలోచనలలో రమిస్తూ గంటల గంటల సమయమును గడుపుతున్నాడు. చదువు-సంధ్యలలో అభిరుచి ఎంతగానే ఉండేది. ఒక సమూహాన్ని ఏర్పరచి ఆడుకోవడమన్నా, సేవ చెయ్యటమన్నా ఎంతో ఆసక్తి ఉండేది. చదువుకుంటున్నప్పుడు కూడా అతను దానిలో ఎంతగా మునిగిపోయేవాడంటే అతనికి కాలం యొక్క స్పృహే ఉండేదికాదు. చదువుకుంటున్నప్పుడు అన్ని విషయములను లోతుగా ఆచరణలో పెట్టాలని అనిపిస్తూ ఉండేది. ఇలా ఆలోచిస్తూనే మళ్ళీ చదవటంలోను, వ్రాయటంలోను మునిగి పోయేవాడు. అతని సునిశితబుద్ధి, గ్రహణశక్తి, ఆలోచనాశైలిని గమనించి అందరు ఆశ్చర్యమునకు లోనయ్యేవారు. ఇంత పిన్న వయస్సులో జ్ఞానంపట్ల అంతటి జిజ్ఞాసని చూసి అందరు నిర్ఘాంతపోయేవారు. అతను ఏది చదివితే అది స్మృతి పథములో అక్షరం అక్షరము గాఢంగా ముద్రితమైపోయేది. అతని వివేచనా విధానము చిత్రముగా కనపడేది. కానీ అతను ఒక ప్రణాళికను రూపొందించి ఆటలాడినప్పుడు, ఒక బృందమును ఏర్పరచి సమాజసేవలో పాల్గొన్నప్పుడు అతనికి వాటిలో కూడా అమితానందము కలిగేది. ప్రణాళికలు రచించడము లోను, సత్వర నిర్ణయములు తీసుకోవటంలోను అతను చిన్నతనం నుండే సిద్ధహస్తుడు. అందు వలననే అతను అనునిత్యం రకరకముల ఆటలు ఆడటంలోను, కొంగ్రొత్త పద్ధతులలో సేవలు చెయ్యటంలోను మునిగిపోయేవాడు.

అయితే అవన్నీ ముగించుకుని అతను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు అతనికి ఆ పనులన్నీ నిస్సారమైనవిగా అనిపించేవి. అప్పటివరకు ఇంటి వెలుపల చేసే పనులన్నింటిలోను అతనికి అపారమైన ఆనందము లభించేది. కానీ ఇంటికి వచ్చాక అవన్నీ నిస్సారముగా అనిపించడముచేత కల్పనలలో కూరుకుపోయే వాడు. ఉన్నతస్థాయి కల్పనాలోకములలో తేలియాడుతుండే వాడు. కానీ సరైన దిశ లభించకపోవుటచేత అతనిలో ద్వంద్వ ప్రవృత్తి తలెత్తినది. సుభాష్ యొక్క కల్పనాధారలు రెండు వ్యతిరేకదిశలలో సాగుతుండేవి. ఒకవైపు పరాధీనమైన దేశమాత బానిసత్వ సంకెళ్ళను త్రెంచివేయాలని, అత్యాచారులు, దుష్టులు మరియు దౌర్జన్యపరులైన ఆంగ్లేయులను భరతభూమి నుండి తరిమితరిమి కొట్టడానికి ఆయుధాలను చేపట్టి తిరుగుబాటు చెయ్యాలని ఆలోచించేవాడు.

**మన జీవితంలో జరుగుతున్న సంఘటనలు మనకి నచ్చినా నచ్చకపోయినా అవి అన్నీ సబబే**

మరోవైపు అన్నింటినీ విడిచిపెట్టి హిమాలయపర్వతముల వద్ద తపస్సు చెయ్యాలనే కల్పన చేసేవాడు. ఈ ద్వంద్వ ఆలోచనాశైలి వలన అతని మనస్సు అశాంతికి లోనయ్యేది. తత్ఫలితముగా ఏపని చెయ్యటానికి మనస్సు సుముఖముగా ఉండేదికాదు.

పిల్లల మనస్సులో తెలిసీ-తెలియకుండా దోబూచులాడే ఎన్నో సంగతులను సంతానము తనతో చెప్పినా చెప్పకపోయినా కూడా అమ్మ అర్థము చేసుకొనగలదు. పిల్లలకు సంబంధించిన విషయములన్నీ తల్లికి చిరపరిచితమే! అందుచేతనే ఆమెను 'అమ్మ!' అంటారు. తన పుత్రుడైన సుభాష్ అంతరంగములో ఎగసిపడే ద్వంద్వప్రవృత్తి ఆమెకు సుపరిచితమైన విషయమే. ప్రభావతి అప్పుడు సుభాష్‌ని తిట్టకుండా, విసుక్కోకుండా 'నాయనా! నువ్వు స్వామివివేకానందుడిని ఆశ్రయించు! ఆయనను ధ్యానించు! ఆయన ఉపన్యాసములను విను! వాటిని మననం చెయ్యి! ఆయన తప్పకుండా నీకు మార్గదర్శనం చేస్తాడు. తనను స్మరించినవారిని ఆయన తప్పక దృష్టిలో పెట్టుకుంటారు!' అని అన్నది.

'అమ్మా! నేను నా మనస్సులో మాటను స్వామికి చెపితే ఆయన విని, జవాబిస్తారా? అని అడిగాడు సుభాష్. 'అవశ్యం ఇస్తారు, నువ్వు హృదయపూర్వకముగా పిలిస్తే తప్పకుండా పలుకుతారు. నీ మనస్సులోని మాట చెపితే అవశ్యం వింటారు. నీకు తప్పకుండా సరైన మార్గదర్శనము చేస్తారు' అని జవాబిచ్చినది ప్రభావతి. అమాయకుడైన సుభాష్ కళ్ళల్లో కాంతులు విరిశాయి. అతని హృదయము పులకించినది. 'అమ్మా! మన ఇంట్లోని గోడమీద తలపాగా పెట్టుకుని ఉన్న సన్యాసి చిత్రపటమున్నదికదా? ఆయనేగా స్వామివివేకానంద!' అని ప్రశ్నించాడు. 'అవును నాయనా! ఆయనే స్వామి వివేకానంద!' అని జవాబిస్తూ, తల్లి తన మాటలను పూర్తి చెయ్యకుండా ఇంట్లోకి వెళ్ళి గోడమీద ఉన్న అందమైన, భవ్యమైన వివేకానందుని చిత్రపటమును చేతపట్టుకుని బయటకు వచ్చి తన కుమారునికి ఇచ్చి ఇలా అన్నది. 'ఇదిగో! దీనిని తీసుకుని నీ దగ్గర అట్టిపెట్టుకో! ఆయనను అభ్యర్థించు! నేటినుండి ఈయనను నీ ఆధ్యాత్మిక గురువుగా భావించు!'

'సుభాష్! నువ్వు స్వామీజీని ఏ భావముతో పూజిస్తావో, ఆయన నీకు ఆవిధంగా లభ్యమౌతారు. అందువలన నీవు ఆయనకు నీ మనస్సులోని మాటను నివేదించు! నీ ద్వంద్వ మానసిక స్థితినుండి బయటపడు! సరిగ్గా ఇదే విషయమును భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా చెప్పాడు' అని అన్నది ప్రభావతి. సుభాస్‌కు తాను కోరుకున్న తనదైన లోకము లభించింది. సుభాష్ స్వామీజీ చిత్రపటమును తీసుకుని తన గదిలోకి పరుగుతీశాడు. 'అన్నం తిను నాయనా!' అని అన్నది ప్రభావతి. 'ఇప్పుడు ఆకలిగా లేదు' అని బదులిచ్చాడు పిల్లవాడు. తన పుత్రునిలో వచ్చిన ఈ మార్పుకు ఆమె సంతోషించినది. సుభాష్ విలక్షణమైన బాలకుడు అని ఆమెకు తెలుసు. అతని కల్పనలు, ఆలోచనలు, భావనలు మరియు బుద్ధి అసాధారణమైనవి. అతను ఎంత బహిర్ముఖంగా ఉంటాడో, అంత అంతర్ముఖంగా ఉంటాడు.

సుభాష్‌కి ఒక నవనవోన్మేషమైన, ఉల్లాసభరితమైన పని లభించినది. ఇప్పుడిక అతను స్వామీజీని తన ఆధ్యాత్మిక గురువుగా స్వీకరించి తన మనస్సులోని మాటలన్నింటినీ నివేదిస్తున్నాడు. సుభాష్ స్వామీజీ రూపమును తన హృదయంలో ముద్రించుకున్నాడు. అతనికిప్పుడు ధ్యానం చెయ్యటములో ఆనందం లభించసాగింది. ఈ ఆనందమును పొందే ప్రయత్నములో అతని మిగిలిన పనులన్నీ అస్తవ్యస్థ మవ్వసాగాయి. సమయము దొరికినప్పుడల్లా ధ్యానం చెయ్య సాగాడు లేదా తన స్వీయకల్పనాలోకంలో స్వామీజీతోపాటుగా విహరించసాగాడు. అకస్మాత్తుగా పొడసూపిన ఈ మార్పునకు అతని స్నేహబృందం విస్మితమైనది. కానీ తల్లి యైన ప్రభావతికి విషయము తెలుసుకనుక మామూలుగానే ఉండిపోయింది.

అతను స్వామీజీతో ఎంతగా మమేకమైపోయినాడంటే నిద్రిస్తున్నా, మెలకువగా ఉన్నా, చదువుతున్నా, వ్రాస్తున్నా, ఆడుతున్నా, పాడుతున్నా అన్నింటా స్వామీజీనే కనిపిస్తున్నాడు. అలా ఉండగానే అతని మనస్సులో మరొక ఆలోచన చెలరేగినది. 'తను ఇంటినుండి పారిపోయి ధవళవర్ణములో విరాజిల్లే నిర్మలమైన హిమాలయపర్వతములలో ఒకానొక ఏకాంతప్రదేశములో కూర్చుని స్వామీజీని గాఢంగా ధ్యానించాలి' అన్నదే ఆ భావన. ఈ ఆలోచన అలవలె ఎగసిపడి, లయమై పోతున్నది. ఇలాంటి సమయములో అతనికి ఒక ఆశ్చర్యకరమైన విషయము అనుభవములోకి రాసాగినది. స్వామీజీని ధ్యానించే సమయములో అతని మనస్సులో తలెత్తే ప్రశ్నలకు అతని

**ఎవరిలో ఆలోచన-భావం-కర్మల సమన్వయం ఉంటుందో వారే గురువులకు పాత్రులవుతారు**

మనస్సులోనే సమాధానం స్ఫురించసాగినది. ఒకనాటి రాత్రి సుభాష్ స్వామీజీని ధ్యానిస్తూ మెల్లిగా నిద్రలోకి జారుకున్నాడు. అతను కలలో స్వామీజీని దర్శించాడు. మెలకువ వచ్చినప్పుడు ఆ విషయమును అమ్మతో ఇలా చెప్పాడు. 'అమ్మా! నేను స్వామీజీని స్వప్నములో దర్శించాను. ఆయన నాతో ఏమి చెప్తున్నారో అది నాకు స్పష్టముగా అర్థమవ్వటం లేదు'. 'సుభాష్! నీవు ఆయనను ధ్యానిస్తుండు. ఒకవేళ ఆయన నీతో ఏదైనా చెప్పదలచుకుంటే ఆయన తప్పకుండా నీకు మార్గదర్శనం చేస్తారు. స్వామీజీ ఆధ్యాత్మిక శక్తిపుంజము! ఎవరు ఆయనను పిలుస్తారో ఆయన వారికి తప్పక ప్రత్యుత్తరమిస్తారు. ఈ విషయమును దృష్టిలో పెట్టుకో!' అని అన్నది తల్లి ప్రభావతి.

సుభాష్ తన ఆధ్యాత్మికగురువుతోపాటు కల్పనా ప్రపంచములో తేలిపోసాగాడు. ఆరోజు సోమవారం! సోమవార వ్రత పరిసమాప్తి పిమ్మట సుభాష్ తల్లియైన ప్రభావతి అతనికి పరమశివుని ప్రసాదమును ఇచ్చి, 'దీనిని స్వీకరించు! స్వామీజీ శివునియొక్క అవతారస్వరూపులు! వివేకానందులు కూడా శివుని వలె బోళామనిషి! కానీ తీక్షణతలో మాత్రం జగదంబకంటే తక్కువేమీ కాదు!' అని అన్నది. ఈ మాటలు చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయింది ఆమె. ఆరోజు సుభాష్ మరల స్వామీజీని తన స్వప్నములో దర్శించాడు. ఆయన ముఖమండలము నుండి దివ్యకాంతులు విరజిమ్మబడుతున్నాయి. ఆయన కళ్ళు ఎంత తీక్షణముగా ఉన్నాయంటే ఆ కళ్ళలో కళ్ళుపెట్టి చూడలేక పోతున్నాడు. 'స్వామీజీ'కి తనను తాను సమర్పణ చేసుకున్నాడు సుభాష్. స్వామి వివేకానంద ఆయనను ఎంతో ప్రేమగా పైకి లేవనెత్తి తన హృదయమునకు హత్తుకుని, తన ప్రక్కన కూర్చో బెట్టుకున్నాడు.

స్వామీజీ 'సుభాష్!' అని సంబోధిస్తూ 'నీవు ఈ పృథ్వీమీద భగవంతునికి దూతగా జన్మించావు. భగవంతుడు ఒక ప్రత్యేకమైన పని కోసం నిన్ను భూమిమీదకు పంపించాడు. ఎవరైతే నిన్ను ఇక్కడకు పంపించారో ఆయనే నిన్ను పర్యవేక్షిస్తున్నాడు. ఆ భగవంతుడు తన కార్యమును నీ ద్వారా పూర్తిచేయిస్తాడు. నీకు ఇష్టమున్నా లేకున్నా ఆయన తన పనిని నీచేత చేయించి తీరుతాడు. నీవు భగవంతుని ప్రణాళికలో ఒక అంగానివి. అందుచేత నీవు కేవలం ఆయన పనిచెయ్యి చాలు! పని ఏవిధంగా పూర్తవుతుంది? ఎప్పుడు పూర్తవుతుంది? ఈ విషయములనన్నింటినీ భగవంతునికే వదిలిపెట్టు! సమయము ఆసన్నమైనప్పుడు, తగిన పరిస్థితులు ఏర్పడినప్పుడు నీకు విషయమంతా బోధపడుతుంది' అని సెలవిచ్చారు స్వామీజీ.

సుభాష్ ప్రేమతో ఇలా అన్నాడు. 'స్వామీజీ! నేనేమి చెయ్యాలి? హిమాలయ పర్వతసానువులలో తపస్సు చెయ్యాలా? లేక పరాధీనపు ఇనుపసంకెళ్ళతో బంధించబడిన దేశమాతకు స్వేచ్ఛను ప్రసాదించగలిగే స్వాతంత్ర్యోద్యమములో దూకాలా? ఈ రెండింటిలో ఏది చెయ్యాలో నాకు పాలుపోవటం లేదు. అంతరంగములో చెలరేగే ద్వంద్వస్థితికి ప్రముఖ కారణమిదే' అని అన్నాడు. స్వామీజీ నవ్వుతూ 'సుభాష్! నీకు ఈ జన్మలో ధ్యానం-భజన మొదలైనవి చేసే తగిన సమయము, పరిస్థితులు అంత బాగా ఒనగూడవు. దేశ స్వాతంత్ర్యమనే యజ్ఞములో నీవు నీ సర్వస్వమును ఆహుతిగా ఇవ్వవలసి ఉన్నది. భరత మాత స్వేచ్ఛకోసం భగవంతుడు కొందరిని ఎన్నుకున్నాడు. ఆ ఎంపిక చేసుకున్నవారిలో నువ్వు ఒకడివి! ఇందువలన నువ్వు నీ అంతర్ద్వంద్వ మానసికస్థితినుండి బయటపడి కేవలం దేశం గురించి మాత్రమే ఆలోచించాలి. ఆ పనినే నిర్వర్తించాలి. దానికే సమర్పితమవ్వాలి. ఇదే నీ నియతి! ఇదే భగవంతుని విధివిధానములో ఉన్నది. ఇదే స్వధర్మం! ఒక్క విషయమును దృష్టిలోపెట్టుకో! వర్తమాన సమయములో దేశధర్మమే సర్వోత్తమ మైనది! నీవు ఈ పనినే చెయ్యి. నువ్వు ఇదే చేస్తావు. నా ఆశీర్వాదము నీకు ఎల్లవేళలా ఉంటుంది' అని హితబోధ చేశారు స్వామి వివేకాంద.

ఉదయం నిద్ర లేవగానే సుభాష్ తన తల్లికి తన కలను గురించి పూర్తిగా చెప్పాడు. ప్రభావతి తన బిడ్డను చూసుకుని గర్వముతో పొంగిపోయినది. దేశహితం కొరకు తన సర్వస్వమును సమర్పించమంటూ సుభాష్‌ని మనఃస్ఫూర్తిగా ఆశీర్వదించినది. స్వామీజీ హితోపదేశ స్ఫూర్తితో సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య బలిపీఠం మీద శిరస్సును బలి ఇచ్చి చరిత్రపుటలలో ఒక గొప్ప అమరవీరుడిగా శాశ్వతంగా నిలిచిపోయాడు.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2011*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**వేదధర్మం పునరుద్ధరింపబడాలి**

జీవించే కళ

# స్వార్థం - పరమార్థం

మాయ మరియు బ్రహ్మము యొక్క కలయికతో ఏర్పడిన ఈ సృష్టిలో ఆ రెండింటి అస్తిత్వం జడము మరియు చైతన్యాల రూపంలో వేరువేరుగానే కనిపిస్తూ ఉంటుంది. జడపదార్థాలు ప్రకృతి కోవకు చెందితే, ప్రాణుల చైతన్యంలో బ్రహ్మం యొక్క సత్తా కనిపిస్తుంది. బండి యొక్క రెండు చక్రాలవలె ప్రపంచం లోని కార్యక్రమాలన్నీ ఈ రెండిటి ఆధారంగానే ముందుకు సాగుతాయి. మానవులలో కూడా ఈ రెండింటి గాఢమైన సంయోగం కనిపిస్తుంది. శరీరం మాయ యొక్క, ప్రకృతి యొక్క జడ సృష్టి. ఆత్మను పరమాత్మ యొక్క అంశగా, ప్రతినిధిగా భావిస్తారు. ఈ రెండు వాటివాటి స్థానాల్లో ముఖ్యమైనవి, సమర్థవంతమైనవి. రెండింటికి కొన్ని పరిమితులు ఉన్నాయి, అవసరాలు ఉన్నాయి. ఈ రెండింటిని కలిపి ఉంచగలం. రెండు కాళ్ళు ఒక పద్ధతిగా ముందుకు సాగితే ఎంత దూరమైనా ప్రయాణించగలం. బండికుండే రెండు చక్రాలు కలిసి ముందుకుపోతాయి. స్త్రీ, పురుషులు కలిసి స్నేహ సహకారాలతో గృహస్థజీవనం కొనసాగిస్తారు. శరీరానికి, ఆత్మకి అవసరమయ్యే అన్ని అవసరాలను దూరదృష్టితో సమకూర్చి ఆనందం, ప్రగతి అనే ఉభయపక్ష లాభాన్ని పొందుతు జీవితాన్ని సుఖమయం చేసుకోలేకపోయే ప్రశ్నే లేదు.

శరీర వ్యవస్థ కోసం ఆహారం, వస్త్రాలు, నీడలను ఏర్పాటు చేయాలి. సుఖానికి, ప్రగతికి ఇంద్రియాల సామర్థ్యం, ఉత్తేజాల సహకారం తీసుకోవలసి వస్తుంది. ఈ మాత్రం సమకూర్చు కుంటే సామాన్యమైన జీవనం ఏ కష్టాలు లేకుండా సాఫీగానే కొనసాగుతుంది. అతివాదం వల్ల అసలు గొడవలు మొదలవు తాయి. కడుపు ఖాళీగా ఉంటే ఇబ్బందిగానే ఉంటుంది; కానీ అనవసరంగా అతిగా కుక్కితే వేరేరకమైన ఇబ్బంది మొదలవు తుంది. కాబట్టి మధ్యేమార్గంగా సాగడమే ఎప్పటికైనా శ్రేయస్కరం. మరీ తక్కువ తినేవారు, అతిగా తినేవారు ఏదో ఒక ఆపదను కొనితెచ్చుకుంటారు. **ఉపవాసం చేస్తూ కూర్చున్నా చావు తప్పదు, అతిగా తిన్నా అమృతం కూడా విషమవ్వక తప్పదు. అతిగా వ్యవహరించడమే ఆపదలన్నిటికీ మూల కారణం.** సమతుల్యాన్ని పాటించేవారే తెలివైనవారు, వాళ్ళే సాఫల్యాన్ని పొందుతారు. స్వార్థమే ముఖ్యం అనుకున్న వాళ్ళు శరీరానికి, ఆత్మకి మధ్య సమతుల్యాన్ని పాటిస్తూ నడుచుకోవాలి. ఈ రెండు విషయాలలోను అతిగా వ్యవహరించడం సబబు కాదు. ఈ రెండు స్వార్థాలు ఢీ కొట్టు కోకుండా చూసుకోవాలి, పైగా రెండింటికీ హితం చేకూర్చే పద్ధతిని అలవరచుకోవాలి. దేనిని పట్టించుకోకుండా ఉండకూడదు, అలా అని ఒక దాని భాగం రెండవ దానిని మింగేసే అవకాశం ఇవ్వకూడదు. దీనినే సహజీవనం, సహఅస్తిత్వ సమన్వయం అంటారు. ఈ విధానం వల్ల దక్కే సంపూర్ణ లాభాన్ని కొందరు స్వార్థసిద్ధి అంటే, కొందరు ఆత్మకళ్యాణం అంటారు. నిజానికి రెండూ ఒకటే. అతివాదం అలవడితేనే ఆందోళన, ఆపదలు తలెత్తుతాయి.

శరీర నిర్వహణకి గుప్పెడు వస్తువులు చాలు. వాటన్నింటినీ మనుషులందరు కొంతకాలంలోనే, ఆడుతూ పాడుతూ సంపాదించేసుకోగలిగినప్పుడు, రెండు చేతులున్న, అత్యంత ప్రతిభా సంపన్నులైన వ్యక్తులు కొన్ని గంటలు కష్టపడితే జీవితానికి సరిపడా సంపాదించుకోలేరా! ఎప్పుడు పనిలో మునిగిపోయి ఉండేవాళ్ళు కూడా ఏదో ఒక లోటు ఉన్నట్టు ఫిర్యాదు చేస్తే, దానికి రెండు కారణాలు ఉండవచ్చు – ఒకటి వెనుకబాటుతనం వల్ల గందరగోళం, లేదా అది కావాలి ఇది కావాలి అనే తహ తహ. వాసన, తృష్ణ, అహంకారం అనే మూడు మనిషి నెత్తికెక్కితే అతని విచ్చలవిడి కోరికలు, అవసరాలను పూరించడానికి తన ప్రతిభను, సామర్థ్యాన్ని అంతటినీ ఒడ్డినా సరిపోదు. **అవసరాలు పరిమితంగా ఉంటాయి కాబట్టి సులువుగా వాటిని తీర్చవచ్చు. కానీ కోరికలకు అంతులేదు. ఒక్కటి తీరిస్తే మరో పది పెద్ద కోరికలు పుట్టుకొస్తాయి.** వాటిని పూర్తి చేసే అవకాశం వచ్చే లోపల ఇంకా వంద కొత్త కోరికలు లేచి కూర్చుంటాయి. అగ్నికి ఆజ్యంపోస్తే అది ఇంకా మండుతుంది. సముద్రాన్ని పూడ్చవచ్చు

**పూజలు ఏమంత ఫలితం ఇవ్వకపోవడానికి కారణం సంకల్పం లేకపోవడమే**

కాని తృష్ణను సమాధానపరచలేము. రావణుడు, హిరణ్య కశ్యపుడు వల్లనే అది కాలేదు; లేమి లేమి అనుకుంటూ చివరికి మృత్యువును చేరారు. అలెగ్జాండర్‌కు, నెపోలియన్‌కు కూడా వారి విజయాలు తక్కువగానే అనిపించేవి. ఇక సామాన్యులకు ఈ లక్షణం ఉంటే తృప్తిని, సంతుష్టిని ఆశించలేము.

కావాలసిన అవసరాలన్నీ సమకూర్చుకున్నా సాధారణ వ్యక్తులు అసంతృప్తి అనే మనోరోగంతో బాధపడుతూ కనిపిస్తారు. పెద్ద మనిషిని కావాలి అనే వెర్రి ఆకలితో బాధపడుతుంటాడు. ఇంకా ఇంకా ఇంకా కావాలంటాడు, దానితో తన ఎదుట చాలా ఉన్నా ఉన్నవాటి కంటే నాలుగు రెట్లు, వంద రెట్లు ఎక్కువ కావాలనే ఉన్మాదంతో నిండి ఉంటాడు. ఈ యాతననే వ్యావహారికంగా భౌతిక వాంఛలని, ఆధ్యాత్మికంలో తృష్ణ లేక ఈషణ అంటారు. నిర్వహణకు అవసరమయ్యేవి సంపాదించి సుఖంగా జీవించడానికి వెయ్యి మార్గాలున్నాయి. బుద్ధి మాంద్యులకు, వికలాంగులకు మాత్రమే కష్టం కావచ్చు. జీవితం సాఫీగా గడపడానికి, సామాన్య నిర్వహణకు అవసరమయ్యేవన్నీ సునాయాసంగానే సమకూర్చుకోవచ్చు. ఇంతకు మించి మరి కాస్త కష్టపడితే కలిసికట్టుగా, అందరితో పంచుకుని తింటూ, నవ్వుతూ నవ్విస్తూ జీవితాన్ని గడపగలడు కూడా. కానీ త్రాగుబోతుకు మత్తెక్కినట్టు, అహంకారంతో ధనాశతో మత్తెక్కిన వాళ్ళ గురించి ఏమని చెప్పగలం. వాళ్ళ గోల వాళ్ళదే కాని, పక్కవారి మాట వినే రకాలు కాదు.

ఐశ్వర్యం, పెద్ద మనిషి అనిపించుకోవాలనే కోరిక నీతి నియమాలను పాటిస్తూ సాధించడం అంత సులువు కాదు. సరైన పద్ధతిలో, సరైన వ్యాపారం చేసి, పద్ధతిగా శ్రమించి, నిజాయితీగా లాభాలను తీసుకునేవారెవ్వరు కుబేరులు కాలేరు. చుట్టుపక్కల వారి వెనకబాటుతనాన్ని దూరం చేయడానికి స్తోమత ఉన్నవారు వీలైనంత ఔదార్యాన్ని ప్రదర్శించాలి. ఈ ఉదార సహృదయత ఉన్న చోట అవసరానికి మించి ఉన్న సంపదను బాధని, పతనాన్ని నివారించడానికి ఉపయోగ పడుతుంది. అంతరాత్మ పిలుపును వినిపించుకోని వాళ్ళే అవసరానికి మించి పోగుచేసుకుని, ఆడంబరాలు ప్రదర్శిస్తూ, దుబారాగా ఖర్చుపెడుతూ, దుర్వ్యసనాలకు వెచ్చించే ఆలోచనలు చేస్తారు. పిసినారితనంతో వీలైనంత ఎక్కువగా రాబోయే తరాలకోసం దాచాలని నిర్ణయించుకుంటారు.

ఔదార్యం గలవారు అందరినీ తమ వారిగా భావిస్తారు, కుటుంబాన్ని స్వతంత్రంగా (స్వావలంబన) ఉండే విధంగా సంస్కారవంతులుగా చేయడానికి ఆలోచిస్తారు. కూడబెట్టి వారి మీద గుమ్మరించి విపత్తును కొనితేరు. కాళ్ళు చేతులు సవ్యంగా ఉండి సంపాదించుకోగలిగిన వాళ్ళకి తాతల ఆస్తి కూడా నిషిద్ధ ధనమే. నిషిద్ధ సంపాదనతో జీవించే వారికి పుట్టగతులుండవు. భోజనం చేయడానికి, జీర్ణించుకోవడానికి ఎలాగైతే శ్రమ చేయాలో, అదే విధంగా **నైతికంగా బ్రతకడానికి కష్టపడి సంపాదించి జీవించాలి.** అప్పనంగా వచ్చినదానిని స్వీకరించడం, మరొకరి కోసం దాచి ఉంచడం, ఇవి రెండూ కూడా లంచం ఇచ్చిపుచ్చుకోవడంతో సమానమైన అపరాధాలే. స్వావలంబులు కాలేని ఆశ్రితులకు, నిర్వహణకు తగువిధంగా సమకూర్చి పెట్టడం సరైనదే. కానీ స్వంతంగా సంపాదించుకోగల వారికి కూడా పుత్ర వ్యామోహంతో తాము దాచుకున్న సంపదను ఇవ్వడం వల్ల మూడు నష్టాలుంటాయి. అప్పనంగా వచ్చిపడింది ఎవ్వరికీ అరగదు, దుర్వ్యసనాలు అబ్బుతాయి. మరి తమ పిల్లలను అలాంటి ఆపదలోకి ఎవరైనా ఎలా నెట్టగలరు? రెండవది, అవసరమున్నవారికి ఆ డబ్బు అందదు, వారి హక్కును లాక్కున్నారు. మూడవదేంటంటే, ఆ చెత్తాచెదారాన్ని సంపాదించ డానికి అమూల్యమైన జీవితం వ్యర్థమైపోయింది. ఈ మూడు నష్టాలను బేరీజు వేస్తే ఐశ్వర్యం సంపాదించాలనే కలలు కనకపోవడం తెలివైన లక్షణం. దేశంలో సగటు పౌరుల స్థాయిలో జీవించడం అలవరుచుకోవాలి, సాదా జీవనం, ఉన్నత ఆలోచనల మార్గంలో పయనిస్తూ అన్నివిధాల కృతకృత్యులు కావాలి.

ఐశ్వర్యానికి స్నేహితుడు అహంకారం. దానిని సముదా యించడానికి ఆడంబరాలకు పోవలసివస్తుంది. దర్పం, ఉన్మాదం ప్రదర్శించాలి. దానిని తృప్తిపరచడానికి దుబారాగా ఖర్చుపెట్టడం తప్పనిసరి అవుతుంది. దుబారా గొప్పతనానికి నిదర్శనం అయింది. ఇతరుల దగ్గర లేని నగలు, హంగులు, ఫ్యాషన్లు సమకూర్చుకోవడం అవసరమవుతుంది. వాటిని చూసి చుట్టుపక్కలవారు చిన్నబుచ్చుకుని, మనలను గొప్ప అని పొగడాలనే కలలుకంటారు. కాస్త తెలివిన ఉపయోగిస్తే ఈ ఊహలు ఎంతవరకు సమంజసమో స్ఫురిస్తుంది. కానీ ఉన్మాదంలో ఉన్నప్పుడు సంపదలు కూడబెట్టుకోవడం, అహంకారాన్ని

**సమాజాన్ని కాదు - మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవడానికి ప్రయత్నించండి**

పోషించడమే సార్థక జీవనంగా అనిపిస్తుంది. ఇలాంటి కోరికలు ఉంటేనే గొప్పస్థాయి కావాలని అనిపిస్తుంది; లేకపోతే సాధారణంగా ఉంటేనే సేవా కార్యాలలో పాల్గొనడం సౌకర్యంగా ఉంటుంది. పవిత్రతను, ప్రఖరతను అలవరుచుకుని, స్తోమతకు తగిన సేవ చేసుకుంటూ ఉండగలిగితే అహంకారాన్ని నేరుగా తృప్తిపరచవచ్చు. కానీ ఉన్మాదం ఉన్నంతసేపు ఈ తెలివి ఎక్కడుంటుంది! తోటివారిని తనకన్నా హీనులు అని నిరూపించడంలోనే దానికి తృప్తి. అందుకే పెళ్ళిళ్ళు ఆర్భాటంగా చేస్తారు. పక్కవారిని హేళన చేసి, తిరస్కరించి వ్యక్తులు తమ అహంకారాన్ని తృప్తి పరుచుకుంటారు. ఈ అహంకారులంతా ఒక రకమైన మానసికరోగంతో బాధపడుతున్నారనే చెప్పాలి. యదార్థం అనే గీటురాయి మీద పరీక్షిస్తే వారి నమ్మకాలన్నీ నూరుశాతం అసత్యాలనే తేలుతాయి. సంపదలు కూడగట్టు కోవడంతో స్వార్థం చల్లారదు, గొప్పలు పోవడానికి అన్యాయంగా డబ్బు సంపాదించి దానిని నీళ్ళలా ఖర్చుపెట్టి ప్రసంశలు పొందడంలో గౌరవం లేదు. ముఖస్తుతి చేసేవారి సంగతి వేరే, ఎవర్నైనా మోసం చేయడానికి దోమను కూడా ఎద్దుకన్నా పెద్దగా వర్ణిస్తారు.

శారీరిక విలాసాలకి, తృష్ణ, అహంకారాల తృప్తి కోసం సాధారణ వ్యక్తులు తమ తెలివిని, సామర్థ్యాన్ని మొత్తం వినియోగిస్తారు. అమూల్యమైన జీవితం ఈ కుచక్రంలో కూరుకుపోతుంది. చివరికి దక్కేదేమిటి? ఉన్మాదంలో ఉన్నప్పుడు ఏదీ కనిపించదు కానీ, పిచ్చి కుదిరాక చేసిందంతా తప్పు అని తెలుస్తుంది. సామాన్య ఉపాయాలతో తృష్ణను తృప్తిపరచలేం. ఇక అవినీతి, కుకర్మలు, అపరాధాలు మొదలైన దుష్ప్రవృత్తులు తప్ప వేరే దారిలేదు. ఇందుకేనా మనిషికి జీవితం లభించింది? దేవతలకు కూడా దుర్లభమైన మానవ జీవిత సార్థకత ఇందులోనే ఉన్నదా? ఇలా ఆలోచిస్తే మాత్రం కంటి ముందు చీకట్లు కమ్ముకుంటాయి. అందరి నుండి ఏ గౌరవాన్ని, ప్రతిష్ఠని కోరుకున్నారో, అది మాత్రం ఎక్కడ దొరుకుతుంది? సంకీర్ణమైన స్వార్థాన్ని ప్రదర్శించే వ్యక్తి యొక్క అనైతిక, కఠోర ప్రవర్తన అందరి మీద చెడుప్రభావాన్నే కలిగిస్తుంది. నోటితో చెప్పినా చెప్పకపోయినా, ఇటువంటి అహంకార అతివాదుల మీద లోలోపల అందరు ద్వేషాన్నే పెంచుకుంటారు. చాలాసార్లు కుళ్ళుకునేవాళ్ళు అనవసరంగా వీరి మీద ఆక్రమణలు కూడా చేస్తారు, ఏ సంపద, పెద్దరికం కోసం కలలు కన్నారో, లాభానికి బదులు నష్టాన్నే చవిచూస్తారు; సమయం మించిపోతే ఆ నష్టాన్ని పూరించే మార్గమే లేకుండా పోతుంది.

సమయం ఉన్నప్పుడే తెలివి తెచ్చుకుని శరీరానికి నిర్వహణకు అవసరమయ్యేవి సమకూర్చాలి కానీ వాసన, తృష్ణ, అహంకారాలను పోషించే తప్పు చేయకూడదు. ఈ మాత్రం చేసుకోగలిగిన వాళ్ళు మాత్రమే జీవితంలో ఆత్మకు ముఖ్యమైన భాగస్వామ్యం ఉందని, దానికి కొన్ని అవసరాలున్నాయనే విషయాన్ని తెలుసుకోగలరు. ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. అంటే అతివాదాన్ని వరించి, అంతర్ మనస్సుకు తగిన పోషణను ఇవ్వకపోవడమే. దానివలన భయాన్ని, బాధని సహించవలసి వస్తుంది.

ఆత్మ యొక్క అస్తిత్వం జీవితంతో ఇమిడి ఉన్నదని అర్థం చేసుకుని, దానికీ కొన్ని అవసరాలుంటాయని దృష్టిలో పెట్టుకుంటే, శరీరానికి పంచభక్ష్యాలు వడ్డించడం కాకుండా అంతరాత్మ ఆకలిని అర్థం చేసుకుని, దానికి తగిన సమయాన్ని, ధ్యాసని, కృషిని, అవసరాలను సమకూర్చాలి. ఇదే సంతులనకు కేంద్రం. దూరదృష్టితో ఇక్కడ వ్యవహరిస్తే సరైన దిశ తప్పక లభిస్తుంది. ఆత్మకు కూడా ఆకాంక్షలుంటాయి. దానికి ముందుకు సాగాలి, గొప్పగా మారాలి అనే కోరిక ఉంటుంది. మహామానవుల పంక్తిలో కూర్చోవాలని, ఋషుల స్థాయికి ప్రగతి సాధించాలని, పూర్ణత్వం వైపుకు పరుగుపెట్టాలని కోరుకుంటుంది. కానీ ఇది మాలలు తిప్పేసి, అగరవత్తులు వెలిగించడం లాంటి ఆటపాటలతో సాధ్యం కాదు. దీనికి లోకసాధన, పరమార్థ పరాయణత అనే కార్యప్రణాళికను అవలంభించుకోవాలి. ఎవరైతే సమయాన్ని సద్వినియోగం చేసి, శారీరిక తృష్ణలకు అంకుశం పెట్టి సరైన దిక్కుకి మలుచుకోవాలి అనే ప్రాథమిక అవసరాన్ని అర్థం చేసుకుని, దానికి తగిన ధైర్యాన్ని కూడగట్టుకోగలడో అతని వల్లనే ఇది సాధ్యం అవుతుంది.

**పరమార్థమే నిజమైన స్వార్థం.** సంకీర్ణ స్వార్థ పరాయణులు శరీర తృష్ణల జంజాటంలో ఇరుక్కుని పుట్టగతులు కోల్పోతారు. కానీ పరమార్థ పరాయణులు ఆత్మ గొప్పతనాన్ని, అవసరాన్ని అర్థం చేసుకుని, మహామానవులు నడిచి కృతకృత్యులైన మార్గంలోనే పయనిస్తారు.

*– అఖండజ్యోతి, జనవరి 1984*


*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**శ్రమ, సమయాన్ని ఉపయోగించి ఏదైనా పొందవచ్చు**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# లోకశిక్షకుల జీవనోద్దేశ్యం, లక్ష్యం - 1

*పరమపూజ్యగురుదేవుల అమృతవాణిలో ఎంత వైవిధ్యముంటుందంటే వారు చెప్పే మాటలలో గద్దింపుతోపాటు ఆత్మీయత కూడా ఉంటుంది. అలాగే హెచ్చరికతోపాటు సంరక్షణ, సవాలుతోపాటే మార్గదర్శనం కూడా ఉంటాయి. తమదైన ఈ విలక్షణ శైలిలో పూజ్యగురుదేవులు సృజనశిల్పి, లోకశిక్షకులుగా తయారయ్యేందుకు శిక్షణ తీసుకొనుటకై శాంతికుంజ్‌కు వచ్చిన పరిజనులందరినీ సంబోధిస్తూ తమ యొక్క ఈ ప్రబోధములో 'లోకశిక్షకులుగా తయారయ్యే ఈ ప్రక్రియ భగవంతునికి అన్నింటికన్నా ముఖ్యమైన పూజ! మానవుని అజ్ఞానం, భ్రాంతుల కారణముగానే అతడు భగవంతునికి దూరం అయ్యాడు అని తెలియజేస్తున్నారు. ఇదే అంశమును కొనసాగిస్తూ గురుదేవులు 'మానవ హృదయము మీద ఆవరించియున్న కషాయకల్మషములను దూరం చెయ్యటం ద్వారా మాత్రమే ఈ అజ్ఞానం తొలగిపోతుంది, కానీ కేవలం ప్రవచనములు వినటం ద్వారా పైన చెప్పిన పని సాధ్యం కాదు. ప్రజలకు శిక్షణ ఇవ్వదలచుకున్నవారు ముందుగా తమ వ్యక్తిత్వాలను నిర్మాణం చేసుకోవాలి. తమ ఆచరణతో ప్రజలకు శిక్షణ ఇవ్వాలి' అని ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*



ప్రజలకు శిక్షణ నిచ్చే నిమిత్తమై మేము మిమ్మల్ని ఇక్కడకు పిలిపించాము. శిక్షణ ముగించుకొని ఇక మీరు బయటకు వెళ్ళవలసిన సమయమాసన్నమైనది. ప్రజలకు బోధించడమనేది భగవంతునికి మనం చేసే పూజలన్నింటిలోకి శ్రేష్ఠమైనది. మానవుడు తనకున్న 'అజ్ఞానం-భ్రాంతులు' అనే కారణముగానే భగవంతునికి దూరం అవుతున్నాడు. అంతేకాదు కషాయ కల్మషములు కూడా మానవుడిని భగవంతునికి దూరం చేస్తున్నాయి. అజ్ఞానం వల్లనే ప్రపంచములో అనేకరకములైన కష్టములు, దుఃఖములు వస్తున్నాయి. అజ్ఞానం అంటే విషయ పరిజ్ఞానం లేకపోవటం అని భావించరాదు. విషయపరిజ్ఞానం ఎంతవరకు అవసరమో అంతవరకు మానవులు జన్మతః తీసుకునే, జ్ఞానమును గురించిన, ధర్మమును గురించిన శిక్షణ మనకు ముందునుండే లభించాయి.

దొంగతనం చేసేవారు కూడా నిజాయితీని ప్రశంసిస్తాడు అంటే అందులో తప్పేమీ లేదు. దొంగతనం చెయ్యటం తప్పు-నిజాయితీగా ఉండటం ఒప్పు అని అందరికీ తెలుసు. అయితే ఆ దొంగతనం కూడా నిజాయితి నీడలోనే చేస్తుంటారు. పాలల్లో నీళ్ళు కలిపి అమ్ముతారు. కానీ 'మా పాలల్లో కల్తీ ఉందని ఋజువు చేస్తే 100 రూపాయిలు బహుమతి ఇవ్వబడును' అని దుకాణం బయట బోర్డు కూడా పెడతారు. అదే దుకాణం యజమాని, తన దుకాణం ముందు 'మా పాలల్లో సగం నీళ్ళు-సగంపాలు ఉన్నాయి ఇందులో పాలపొడి కలుపుతాము కాబట్టి పైన మీగడ కట్టి ఉంటుంది. తప్పుని నిరూపిస్తే 100 రూపాయిలు బహుమతి ఇస్తాము' అని బోర్డు పెట్టాడనుకోండి. ఇక అతని దుకాణంలోని పాలు అమ్ముడు పోతాయా?' ఒక్క మనిషి కూడా ఆ దుకాణమునకు వచ్చి పదిపైసల పాలుకూడా కొనడు, కాబట్టి నిజాయితి యొక్క సహాయం లేకుండా, దానిని అడ్డం పెట్టుకోకుండా ఏ పనీ చెయ్యలేము అన్న విషయం అందరికీ తెలుసు.

అవసరమైన విషయపరిజ్ఞానం మనకు జన్మతః లభించే ఉంటుంది. గీతలోను ఇదే చెప్పారు, రామాయణంలోను ఇదే వ్రాశారు. రామాయణం చదవకముందుకూడా మనకు చాలా విషయములు తెలుసు. అవే అంశాలను రెండవసారి, మూడవసారి, నాలుగవసారి చెప్పటానికి ప్రజల ముందుకు వెడితే, వాళ్ళు మీ మాటలను వింటారన్న నమ్మకం మీకు

**ఇవ్వటం, ఇవ్వటం, ఇవ్వటమే జీవితం**

ఉన్నదా? పొరపాటున కూడా వినరు. ప్రజలకు జ్ఞానమును అందించడమనేది ఒక మహత్తరమైన కార్యం. రామాయణంలో వెయ్యిసార్లు చదివినవి, విన్నవి, సత్సంగములో వేలసార్లు విన్నవి, వ్యాఖ్యానాలలో చదివినవి....మొదలైనవాటన్నింటిని, మీరు ఇక్కడినుండి వెళ్ళిన తరువాత, సభలు సమావేశాలలో చెప్పడం మొదలుపెడితే, ప్రజలకు కాలక్షేపం అవుతుందేమో గానీ, దానివలన మన లక్ష్యం నెరవేరదు.

### ప్రవచనం చెప్పటం కాదు-సంస్కరించడం చెయ్యాలి

మరి మన లక్ష్యం నెరవేరే మార్గమేది? మానవులను భగవంతుని చెంతనుండి కొన్ని వేల, లక్షల మైళ్ళు దూరమునకు విసిరివేయగలిగినటువంటి కషాయకల్మషములు మనుష్యులను ఆవరించి ఉంటాయి. వారిపైన పెత్తనం చెలాయిస్తుంటాయి. కషాయ కల్మషములతో నిర్మితమయ్యే ఆ గోడను బద్దలు కొట్టగలిగితేగానీ మానవుడు భగవంతునికి చేరువకాలేడు. ప్రజలను ఆ దిశగా సమాయత్తం చెయ్యాలి. ఏవిధంగా చెయ్యగలము? ఆ పని ఎక్కడినుండి ప్రారంభించాలి? ప్రజలకు మీరు ఏ విషయములనైతే చెప్పదలచుకున్నారో ముందర మీరు వాటిని నేర్చుకోండి, పాటించండి. ముందర మీరు నేర్చుకొని నిష్ణాతులైతే, అప్పుడు ఇతరులకు బోధించగలుగుతారు.

### ఇతరులకు పాఠాలు చెప్పవద్దు

జనాలకు ఒక లక్షణం ఉంటుంది. మీరు మంచి చెప్పదలచుకుంటే చెప్పండి. మీరు చెప్పే 'బోధల' మీద జనం దృష్టిపెట్టరు. దానిని వాళ్ళు తేలిగ్గా తీసుకుంటారు. అయితే మనుష్యులు 'ఇతరులను' చూసి ప్రభావితులౌతారు. కాపీ చేసి ప్రభావమును స్వీకరిస్తారు. మానవుడు అభివృద్ధిని సాధించటానికి అసలైన ఆధారం ఇతరులను అనుకరించడం నేర్చుకొనడమే!

మనం ప్రజల వద్దకు వెళ్ళి ఏమైనా చెప్పాలనుకుంటాము. వ్యాఖ్యానం ఇవ్వాలనుకుంటాము. 'రామాయణమో, భగవద్గీతయో' ఏదో ఒక అంశమును ఉపన్యసించాలనుకుంటాము. దానిమీద ఎవ్వరు దృష్టిపెట్టరు. ఒకరిద్దరు కొంచెం ఆసక్తిగా విన్నప్పటికీ అది మిమ్మల్ని పరీక్షించటానికే. మీరు మధురంగాను, ధాటిగాను మాట్లాడగలిగితే జనం చప్పట్లు కొట్టి మిమ్మల్ని ఉత్తీర్ణులను గావిస్తారు. మీరు చెప్పే విధానం నచ్చకపోయినా, మీ శైలి బాగుండలేదనిపించినా, మీ గొంతు జీరవోయినా జనం 'ఇతను వాచాలుడు' అని మిమ్మల్ని ఎగతాళి చేసి, ఈలలు వేసి, అపహాస్యం పాలు చేస్తారు.

ఎవరైనా మీ మాటలు వింటారనీ, మీ సూచనలను పాటిస్తారనీ ఆశ, నమ్మకం పెట్టుకోవద్దు. మీకు ఏదైనాసరే చెప్పగలిగే మర్యాద, పద్ధతి, విధివిధానం, జ్ఞానము 'ఉన్నాయా? లేవా?' అనేది పరీక్షించడానికే వాళ్ళు వస్తారు. చెప్పడంలో మీకు అభ్యాసం ఉందా? లేదా? అని చూస్తారు. సర్కస్ చేసే వాళ్ళు ముందుగా అన్నీ నేర్చుకునే వస్తారు. తీగమీద నడవటం, ఉయ్యాలలు ఊగటం వంటి విన్యాసాలు చేస్తారు. జనం గమనిస్తారు. బాగా చేసినవాటికి చప్పట్లు కొడతారు, విఫలమైన వారిని చూసి ఈలలు వేసి గేలి చేస్తారు.

### వ్యాఖ్యానాలు చెప్పడం జ్ఞానమునకు ఆధారం కాదు

'ఉపన్యాసములు చెప్పటానికీ, కథాగానం చెయ్యటానికీ ప్రజల మధ్యకు వెడతాము' అని మీరు పెద్దపెద్ద ఆశలు పెట్టుకోవద్దు. ఏకధాటిగా ఉపన్యాసం చెప్తాము, గీతను గురించి, రామాయణం గురించి ప్రవచనం చేస్తాము అని హడావుడి పడవద్దు. మీరు చెప్పే మాటలు విని జనం మిమ్మల్ని అనుసరిస్తారని, మీరు కోరినవిధంగా ఆదర్శవంతంగా మారి పోతారనే ఆశ మీలో ఏదైనా ఉంటే, దానిని ఈ క్షణమే మీ మనస్సులోనుండి తొలగించివెయ్యండి. ఎందుకంటే ఏవో ఎక్కువ పనులను చెయ్యటంలో ప్రవచనములు పెద్దగా ఉపయోగపడవు.

ప్రవచనములు నిజంగా పనిచెయ్యటంలో సమర్థవంత మైనవైతే, ఎక్కడ చూసినా ఇంతమంది ఉపన్యాసకారులు, ఎదుటివాళ్ళు ఆశ్చర్యములో మునిగిపోయేటట్లు, తన్మయత్వం చెందేటట్లు వ్యాఖ్యానాలు చెప్తున్నప్పటికీ మన సమాజంలో కించిత్తైనా మార్పురాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న ట్లుందేగానీ ముందుకు సాగటానికి ఏమాత్రము సిద్ధంగా లేదు.

### వ్యక్తిత్వాలు ఉపన్యాసముల వల్లకాదు, ఆచరణతోనే సాధ్యమౌతాయి

రామాయణ కథాగానం వినటానికి వెళ్తే, 'వీళ్ళకు తెలిసినంతమాత్రం తులసీదాసుకు తెలియదేమో' అన్న అనుమానం మనకు కలిగే రీతిలో రామాయణ శ్లోకములకు క్రొత్త క్రొత్త అర్థములను వివరిస్తూ, భాష్యములను వర్ణిస్తూ సాగుతుంటాయి నేటి ప్రవచనములు. కథాగానమునకు చప్పట్లు మార్మోగుతుంటాయి. 'రామచరితమానస్' వ్రాసిన తులసిదాసు తానే స్వయముగా వచ్చి సభలో కూర్చుని ఆ

**ఇచ్చేవారిని దేవతలని అంటారు**

కథాగానమును ఆలకిస్తే కనుక 'నేను వ్రాసిన రామకథకు, వీళ్ళు చెప్తున్న వ్యాఖ్యానానికీ ఎక్కడా పొంతన లేదే!' అని చెవులు మూసుకుని అక్కడినుండి పారిపోతారు.

ఇటువంటి ఘనమైన కథకులు ఉన్న ఈ దేశములో రామ భక్తుడైన హనుమంతుడు తప్పకుండా జన్మించి తీరాలి. భగవద్గీత మీద ఇంత గొప్పగా ఉపన్యాసములిచ్చే మహాను భావులు ఉన్న ఈ దేశములో అర్జునుడు పుట్టి తీరవలసిందే. భాగవత కథలను ప్రతిదినం వల్లెవేస్తున్న చోట పరీక్షిత్తు ఎందుకు ఎక్కడా జన్మించలేదు. ఏమిటి కారణం? మన ప్రవచనములలో, ఉపన్యాసములలో, కథాగానములలో ఎక్కడో ఒకచోట పొరపాట్లు, తప్పులు ఉండటమే అందుకు ముఖ్య కారణము. ఆ తప్పులను, పొరపాట్లను తొలగించు కొనటానికి మీరు ఇప్పటినుండే సిద్ధం కావాలి. అలాకాకుండా అవే తప్పులు, పొరపాట్లతో కనుక మీరు జనం ముందుకు వెళ్తే, గీతాప్రవచనములు, రామాయణ కథాగానములు, సత్సంగములు చెప్పే శిక్షణనిచ్చే ఆయా వ్యక్తుల వరుసలలో మీ పేరుకూడా జోడించబడుతుంది. వాళ్ళలాగే మీరుకూడా ఒక నటుడు అవుతారు.

## లక్ష్మీ వ్యాయామశాల-ఒక సాటిలేని ఉదాహరణ

నటులు రకరకములైన గారడీలు చేస్తుంటారు. కాళ్ళు చేతులతోను, నాలుకతోను కూడా పలువిధములైన గారడీలు చేసి చూపిస్తుంటారు. నిజానికి మనం నటులమే! నటుడైన వాడు ప్రజలకేమి మార్గదర్శనం చెయ్యగలడు. నటుడు ఎవరినైనా వస్తాదుగా చెయ్యగలడా? చెయ్యలేడు. పహిల్వాను కావాలని కోరుకుంటే కనుక మనం వేరొకరిని వెతుక్కోవలసి ఉంటుంది. వ్యాయామమునకే అంకితమైపోయి, లక్ష్మీ వ్యాయామశాలను స్థాపించిన అన్నాసాహెబ్‌గారిని వెతుక్కుంటూ వెళ్ళవలసి ఉంటుంది. గ్వాలియర్ జిల్లాలోని ఒక చిన్న క్యాంటీన్‌లో ఒక సాధారణమైన గుమాస్తాగా పనిచేసే అన్నా సాహెబ్‌కు వ్యాయామమంటే ఎంతో ప్రీతి. తాను స్వయముగా నేర్చుకొనటమే కాక, తన భార్యాబిడ్డలకు కూడా బాగా నేర్పించాడు. హిందూ దేశంలోని ప్రతి ఒక్కబిడ్డకు వ్యాయామం నేర్పించాలనే తపన అతని అణువణువునా నిండిపోయింది. ప్రతి ఒక్కరికీ వ్యాయామం నేర్పిస్తే, మన దేశం ప్రజలు శక్తివంతులౌతారని అతని ఆకాంక్ష.

అన్నాసాహెబ్ ఉద్యోగం చేసినన్నాళ్ళు తన ఉద్యోగానికి సంబంధించిన విధులు పూర్తయ్యాక, ఇంటికి వచ్చినప్పటి నుండి నిద్రపోయేవరకు, వీధివీధికీ, ఇంటింటికీ వెళ్ళి, అక్కడి ఇళ్ళలోని ప్రజలకు ఒక్కొక్కరికే వ్యాయామం నేర్పేవాడు. ఇద్దరు, ముగ్గురు, నలుగురు పిల్లలను పోగుచేసి, ఆడపిల్లలకు సైతం వ్యాయామం నేర్పించేవాడు. కార్యాలయమునకు వెళ్ళే ముందు, వచ్చిన తర్వాత, ఎప్పుడు వీలైతే అప్పుడు ప్రతి ఒక్కరినీ పిలిచి పిలిచి నేర్పించేవాడు. ఝాన్సీలోని ప్రతి ఒక్కరికీ వ్యాయామము సంపూర్ణముగా నేర్పించాడు.

'వేలాదిమంది మనుష్యుల శారీరక మానసిక ఆరోగ్యాలను చక్కబరచగలిగే వ్యాయమమును నేర్పించగలిగే శక్తి, అవకాశం నాకుండగా, కేవలం నా ఉదరపోషణ కోసం 8 గంటలపాటు కార్యాలయములో ఎందుకు కూర్చోవాలి? ఆ సమయమును కూడా వ్యాయామమును నేర్పించటానికి ఉపయోగించవచ్చు కదా? అని ఆలోచించిన అన్నాసాహెబ్ ఉద్యోగమునకు రాజీనామా చేశాడు. మరి ఇంటిలోని పోషణ ఏవిధంగా చేస్తావు?' అని మేమడిగిన ప్రశ్నకు, 'భగవంతుడే ఉన్నాడు, జరగవలసినదానిని ఆయనే చూసుకుంటాడు' అని సమాధాన మిచ్చాడు. వ్యాయామము కోసమే అంకితమైపోయిన అన్నా సాహెబ్ ఝాన్సీ పట్టణములోని ఇంటింటికీగాక, పొరుగున ఉన్న గ్రామాలకు కూడా సైకిల్ మీద వెళ్ళి అక్కడివారికీ వ్యాయామము నేర్పించసాగాడు. ఇక అక్కడివారికి ఎంత ఉత్సాహము కలిగిందంటే ఆ విభాగములోని పిల్లాపెద్దా, ముసలీ-ముతకా, స్త్రీలు-ఆడపిల్లలు... ఒకరా, ఇద్దరా ఎక్కడ చూసినా అంతా వ్యాయామము చేసేవారే! ప్రభుత్వంవారి ఖాళీ ప్రదేశం ఒకటి ఊరికే పడి ఉన్నది. దానిలో లక్ష్మీ వ్యాయామ శాలను ప్రారంభించారు. అన్నాసాహెబ్ ఎనిమిది రోజుల కొకసారి వ్యాయామములో శిక్షణ నివ్వడం కోసం పొరుగు ఊళ్ళకు కూడా వెళుతుంటాడు. ప్రజలు అన్నాసాహెబ్ యొక్క నిర్ణయాన్ని గమనించి ఆయన ఇంటిలోకి భోజన సామగ్రిని అంతటినీ చేర్చేవారు. ఆయన పిల్లలకు బడిలో కట్టవలసిన రుసుం కట్టి వారికి కావలసిన ఏర్పాట్లు చేసేవారు. అతనికి ఎంతమాత్రము తెలియనీయకుండా ఎక్కడెక్కడినుంచో వచ్చిన జనం చందాలు పోగుచేసి అన్నాసాహెబ్‌కు అందజేస్తుండేవారు.

(సశేషం)

*- అఖండజ్యోతి, మే 2014*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**బాధ్యతలను స్వీకరించి, సమయాన్ని వృథా చేయకుండా పనిచేస్తే ధనవంతులవుతారు**

నా వారితో నా మాట

# అఖండజ్యోతి (యుగశక్తిగాయత్రి) పాఠకులకు హృదయపూర్వక విన్నపం

### పాఠకులు ఆత్మమూల్యాంకన చేసుకోవాలి



ఈ సంవత్సరం చివరి నెలకు చేరుకున్నాం. అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులు, గాయత్రీ పరివారంలోని ప్రతీ సభ్యుడు ఇప్పుడు ఈ ప్రత్యేక సమయంలో తప్పకుండా వారున్న స్థాయిని పరిశీలించుకోవాలి. అందరు వారి చైతన్యం యొక్క గొప్పతనాన్ని తెలుసుకోగలిగితే ఒక ప్రత్యేకమైన ఉద్దేశం కోసం ఈ భూమి మీదకు వచ్చారన్న సత్యం తెలుస్తుంది. తుఫానులో నిష్ప్రయో జనంగా ఎగిరే ఆకులలాగా మనం కూడా అటూ ఇటూ ఎగిరిపోకుండా, సముద్రంలో నిశ్చలంగా నిల్చుని ఉండే ప్రకాశ స్తంభంలా మారాలి. ఈ స్తంభాలు చిమ్మ చీకటిలో కూడా స్వయంగా వెలుగుతూ, అటుగా వచ్చే ఓడలను మునిగి పోకుండా కాపాడతాయి. మన జీవితక్రమంలో, దృష్టికోణంలో ఈ లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి.

ఈ పనికోసం మనలో ప్రతి ఒక్కరికీ ప్రేరణను, మార్గ దర్శనాన్ని అఖండజ్యోతి పత్రిక (యుగశక్తి గాయత్రి) అందిస్తుంది. మనం పుట్టిన ఈ కాలవ్యవధి మనిషి చరిత్రలోనే చాలా గొప్పది, అమూల్యమైనది అని తెలిపే గురుదేవుల ఆలోచనలు, మార్గదర్శనం ఇందులో పొందుపరిచి ఉంటాయి. మానవీయ సభ్యత, సంస్కృతి నేడు జీవన్మరణాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. సామాన్యుల సంగతి పక్కనపెడితే, తెలివైన వారి బుద్ధి కూడా భ్రమలో చిక్కుకున్నది. స్వార్థం, అహంకారాలను అలవరచుకుని ప్రతి మనిషి నికృష్టమైన మానసిక స్థితి అనే బురదలో గొంతువరకు కూరుకుపోయాడు. అజాగ్రత్త, అనాచారాలు తాండవం చేస్తున్నాయి. ఈ లోక ప్రవాహం సామాజిక వాతావరణాన్ని విషపూరితం చేసాయి. స్నేహసహకారాలు అతి కష్టం మీద కనిపిస్తాయి. సజ్జనత్వం, సహృదయత లాంటివి మాటలవరకే పరిమితమైనట్టు తోస్తోంది.

అపనమ్మకం, భయం రాజ్యమేలుతున్నాయి. నేటి మిత్రుడు రేపు శత్రువు అవడు అనే నమ్మకం లేదు. మనిషిలో పెరుగుతున్న నిస్సారతను చూస్తే భూమి మీద సభ్యత, సంస్కారాలు మాయమవుతున్నట్టు అనిపిస్తుంది. విద్య, వైద్య, వ్యాపార విజ్ఞానాలలో చాలా ఉన్నతి సాధించినట్టు కనిపిస్తుంది. సౌకర్యాలు పెరిగాయి. కానీ దుర్భావనలు, దుష్ప్రవృత్తులు అంతకు మించి పెరిగాయి. ఈ దావానలంలో అందరి సుఖశాంతులు భస్మమై పోతున్నాయి. పెద్దలు పిన్నలను మింగాలని చూస్తున్నారు. భయాందోళనలు, ఒంటరితనం వలన ప్రపంచమంతా చిన్నచిన్న యద్ధాలలో కూరుకుపోయింది. ఏదో ఒక పరమాణు అస్త్రం అందమైన భూమిని భస్మీపటలం చేసి మానవసభ్యత అంతరించిపోయే పరిస్థితి వస్తుందనే భయం ఇప్పటికీ ఉన్నది.

### ఇవి విషమ పరిస్థితులు

మనిషి, సమాజం కూరుకుపోతున్న ఈ విషమ పరిస్థితులను చూసి భయం కలుగుతుంది, జీవన్మరణాల మధ్య నిలబడి ఉన్నాం. ఒక వైపు వినాశనం అట్టహాసం చేస్తుంటే, మరోవైపు మానవత్వం నరం లాగుతోంది. మృత్యువు తన సామాను, సరంజామ పట్టుకుని ఠీవిగా నిలుచుంది. అసలు మన పరిస్థితి ఏమిటి అనే అయోమయం మిగిలింది. రేపటికి మనిషి ఉనికి ఉంటుందో, లేదో! మనిషి, సమాజం ఎన్నుకున్న మార్గం చాలా భయంకరమైనది. ప్రకృతిలో ఉపద్రవాలు, సమాజంలో అసమ్మతి, ఈరకంగా అన్ని క్షేత్రాల్లో అలజడి ఉన్నది. అనిశ్చితత్వం దారికి అడ్డంగా ఉన్నది. వివేకం కింకర్తవ్య విమూఢ స్థితిలో ఉంది. ముమ్ముందు ఏమవుతుంది? ఏం చేయాలి అనేది తోచటం లేదు.

ఇటువంటి విషమకాలంలో పరమపూజ్య గురుదేవుల ఆలోచనలు, మార్గదర్శనం సంజీవనీ ఓషధిగా పని చేస్తాయి. అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) ఈ ప్రకాశాన్నే ఇస్తుంది. జాగృతఆత్మలు ఈ ప్రకాశాన్ని వీలైనంత ఎక్కువమందికి అందివ్వడమే వారి కర్తవ్యం. అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులలో ప్రతి ఒక్కరు, గాయత్రీ పరివారంలో ప్రతి ఒక్కరు ఈ ఆపత్కాలంలో ముఖ్య భూమికను నిర్వహించాలి. సాధారణ నరపామరుల్లాగా కూటికీ, కనటానికి మాత్రమే

**భారతదేశం జగద్గురు పీఠాన్ని అధిరోహించి తీరుతుంది**

జీవించకూడదు. గొర్రెలమంద గుడ్డిగా పేడకుప్పల్లోంచి నడుచుకుంటూ నూతిలో పడినట్టు మన వర్చస్సును కూడా నాశనం చేసుకోకూడదు. మనమందరము మహాకాలుని సహకారులం, వారి లీలా సహచరులం. ఈ ప్రత్యేక స్థాయిని మనం నిరంతరం గుర్తుంచుకొని ఉత్తమ ఉద్దేశాల నిర్వహణ చేయాలి. ఈ యుగపు సమస్యలకు సమాధానంగా గురువుగారి ఆలోచనలను, మార్గదర్శనాన్ని ఇంటింటికీ తీసుకెళ్ళాలి. అఖండ జ్యోతి (యుగశక్తి గాయత్రి) ప్రకాశాన్ని విస్తరింపజేసి, సభ్యత్వ సంఖ్యను బాగా పెంచి, మన జాగృకతను కనపరచకపోతే ఇక కుదరదు. కాపలావాడు నిద్రిస్తే దుండగులు చిమ్మచీకటిలో ఏమైనా చేయగలరు.

### లాభం సంపాదించడం పత్రిక ఉద్దేశం కాదు

అఖండజ్యోతిలోని (యుగశక్తి గాయత్రి) ప్రేరణాత్మక ఆలోచనలు, జీవన సాధన యొక్క తత్త్వదర్శనం గురించి మనవారందరికీ తెలిసిందే. దీనినే అందరికీ తెలిసేటట్టు చేయడం గురుదేవులు ఇచ్చిన అగ్నిదీక్షతో సమానం. అందరి మనస్సులలోని కషాయకల్మషాలను భస్మం చేస్తుంది. ఈ పవిత్ర దీక్ష యొక్క సంవత్సరపు చందా ఇప్పటి వరకు రూ. 120 ఉంది. కొన్ని అనివార్య కారణాల వల్ల దీనిని రూ. 150 చేయడం జరిగింది. కాగితం, పాకింగ్, పోస్టింగ్ అన్నీ యధావిధిగా ఉంటాయి. గురువుగారు ఉన్నప్పటి నుండి ఏ ముద్రణ అయినా, 'నో ప్రాఫిట్ – నో లాస్' పద్ధతినే అవలంబించుకుంది. ఇప్పటికీ ఈ విధానాన్నే పాటించడం జరుగుతోంది. గత కొన్నేళ్ళుగా ఖర్చు పెరుగుతున్నప్పటికీ వీలైనంత భరించడం జరిగింది. రుసుము పెంచకుండా చాలా కాలం నిలిపినప్పటికీ, ఇక సాధ్యం కాకపోవడం వలన పాఠకులతో ఈ భారాన్ని పంచుకోవడం జరుగుతున్నది. ఈ పెంపుని పత్రిక యొక్క కోరిక కాదు, నిస్సహాయతగా పాఠకులు గుర్తించాలి. సంవత్సరానికి 150 రూపాయలు ఖర్చైనా, 365 రోజులకు సరిపడా స్వాధ్యాయ సామాగ్రికి రోజుకయ్యే ఖర్చు 41 పైసలు. గురుదేవులతో సత్సంగ భాగ్యానికి 41పైసల అంశదానం తప్పక ఇవ్వగలరు. 84 లక్షల యోనులను దాటినప్పుడల్లా వ్యక్తిగత లాభాన్ని చూసుకుంటూనే ఉన్నాం. ఈ ఒక్కజన్మలో, యుగ సంకట సమయంలో, మనం సౌకర్యాలను కాస్త పక్కన పెట్టి, స్వార్థాన్ని కొంత తగ్గించుకుంటే పెద్ద నష్టమేమీ లేదు. పీడింప బడుతున్న మానవత్వాన్ని ఉద్ధరించడానికి గురుదేవులు అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి)ని విస్తారంగా ప్రచారం చేయమని మనకి పిలుపు నిచ్చారు. మన కళ్ళలో శ్రద్ధ ఉంటే, వారు కన్నీటితో మనల్ని చూస్తున్నట్టు కనిపిస్తుంది. వారి మాట వినడానికి మన సొంత ప్రయోజనాలను కాస్త పక్కన పెట్టాలి.

### మనుష్యుల మనస్సులలో భావనాత్మక వికాసం అవసరం

అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) అవతరించింది, వెలిసింది భావనలను శుభ్రపరచడానికే. వికృతమైన ఆలోచనల వల్ల నికృష్టమైన కర్మలు ఏర్పడతాయి. నికృష్ట క్రియాకలాపాలే లెక్కలేనన్ని కష్టాలను కొనితెస్తాయి. ఇది అందరికీ అర్థమయ్యేలా చెప్పడానికే అఖండజ్యోతిని (యుగశక్తి గాయత్రి) ఇంటింటికీ తీసుకువెళ్ళాలి. మనిషి, సమాజం చిక్కుకున్న సమస్యలన్నిటికీ ఇదే సమాధానం. ఈ ఒక్క అస్త్రాన్ని చేతిలో ఉంచుకుని అసురుల అక్షౌహిణీ సైన్యాన్ని నేలకూల్చవచ్చు. మన క్రియాకలాపాలను, ప్రతిభను, సాధనాలను వీలైనంతగా ఈ మహాయజ్ఞానికే వినియోగించాలి.

పాఠకులకు, పరిజనులకు ఈ విషమకాలంలో ప్రత్యేక పిలుపు ఇవ్వబడింది. అందరు సంపూర్ణ సమయాన్ని, ప్రతిభను, జ్ఞానాన్ని, ధనాన్ని లోభమోహాలకే వెచ్చించకుండా, ఒక పెద్ద భాగాన్ని యుగదేవత ఆలోచనలను ప్రచారం చేయడానికి వినియోగించాలి. ఈ విషమ పరిస్థితుల్లో ఈ మాత్రం మనం చేయకపోతే, దీనిని మానవ జాతి యొక్క దౌర్భాగ్యమనే అనాలి. మహాకాలుని లీలా సహచరులే ఈ మాత్రం ధైర్యం చేయలేక పోతే, ఇక సాధారణ మనుష్యులు, పశుప్రవృత్తులు కలవారి నుండి ఏం ఆశిస్తాము? ప్రకాశం ఇచ్చిన పిలుపును నిరాకరిస్తే, దాని అర్థం గురుదేవుల తపోపూరిత వ్యక్తిత్వాన్ని, ఆయన నేర్పించింది మనం మరచిపోయినట్టు, ఆయన్ని అనుసరించే వారి తరం అంతరించిపోతున్నట్టే.

### నేడు చేయవలసిన అతిపెద్ద తపస్సు - యుగ సాధన

ఇంత గొప్ప జీవితాన్ని సార్థకపరిచేందుకు అవసరమయ్యే ధైర్యం కూడగట్టుకుంటున్నామా లేదా అని మన వాళ్ళందరు వెయ్యిసార్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి. **ఇప్పటి అతిపెద్ద తపస్సు యుగసాధన అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి)ని విస్తృతంగా పంచడం వల్లనే ఇది సాధ్యమవుతుంది. ఈ ఆపత్కాలంలో ఇంతకు మించిన పూజ, భజన, జప, తప,**

**ఇతరుల బరువును నువ్వు ఎత్తితే, నీ బరువును గురువు ఎత్తుతాడు**

**వ్రత, జ్ఞాన, ధ్యాన విధానాలు మరేమీ లేవు. ఆదర్శవాదాన్ని నిలపడానికి యుగావతారుని సందేశాన్ని ప్రతి మనిషికీ అందివ్వాలంటే మన శక్తులన్నిటినీ ఒడ్డి నిలబడాలి.** నాస్తికవాద అపనమ్మకం ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా యుద్ధరంగంలో సంసిద్ధంగా నిలబడి ఉంది. దాని వ్యూహరచన గెలిస్తే మాత్రం 21వ శతాబ్దంలో ఉజ్జ్వల భవిష్యత్తును తీసుకొచ్చే ఆధారాలన్నీ నాశనమైనట్టే.

ఆపత్కాలంలో ఆపద్ధర్మాలుంటాయి. ఆపద్ధర్మంగానే ఈ మసైపోతున్న సమాజం మీద గురుదేవుల సంజీవని చల్లేందుకు ముందుకు రావాలి. అందుకు చిన్న చిన్న సుఖాలను సౌకర్యాలను వదులుకోవాలి. గొప్పగా ఆలోచించి, ధైర్యం కూడగట్టుకుని, ముందడుగు వేయడానికి ఇంతకు మించిన గొప్ప సమయం లేదు. మహామానవులెందరో చాలా సమయాలలో ఎన్నో ఆహుతులు సమర్పించారు. వారి జీవితదీపాలే ఆ యుగపు చీకటిని పాలద్రోలాయి. ఆ దీపాలన్నింటినీ కలిపి, దానిలో ప్రాణతపస్సును ధారపోసి, గురుదేవులు మనకోసం అఖండ దీపాన్ని వెలిగించారు. ఈ ప్రకాశాన్ని దారితప్పిన సమాజానికి చూపించే బాధ్యత మనది. అతి చిన్నస్థాయి మనిషికి కూడా అతి గొప్ప మానసిక స్థితి ఉండవచ్చు, అలాంటి మనిషి ఎన్నో వనరులున్న వారిని కూడా ఆశ్చర్యపరిచే అద్భుత పనులు చేయవచ్చు అని గురుదేవులు చెప్తుంటారు. కానీ మనం ఇప్పుడు అడుగుతున్నది రోజుకు 41 పైసలు చొప్పున 365 రోజులకు రూ. 150 మాత్రమే పెరిగిన అఖండజ్యోతి వార్షిక చందా ఇంతే.

### పాఠకులతో ఒక తప్పనిసరి ఒప్పందం

ఈ చిన్న మొత్తాన్ని మనం, మనకు తెలిసిన వారి జీవితాలలో ఎంతగా కలగలిసిపోయేటట్టు చేయాలంటే, మన ఆదర్శవాదాన్ని ప్రతిష్ఠింపజేసే అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులకు, పరిజనులకు ఇదొక తప్పనిసరి ఒప్పందం అనిపించాలి. గురుదేవులు అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి)ని విస్తరించాలి, ప్రచారం చేయాలి అని చాలాసార్లు చెప్పారు. ఇంకా ఎన్నిసార్లు చెప్పాలి? ఇప్పుడు ఆయన కొడుకులు, కూతుళ్ళు అందరు ఈ పని చేసి తీరాలి. పిల్లలు కాక తండ్రి బాధ్యతలు ఎవరు నెరవేరుస్తారు? కుటుంబంలో ప్రతి సభ్యుడు వారి ప్రత్యేక స్థితిని అవలోకన చేసుకుని కనీసం పదిమందికి అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి)కి సభ్యులుగా చేర్చాలి. ఈ విన్నపాన్ని వినీ వినకుండా, పట్టించుకోకుండా ఉండడం సులువే. కానీ ఆత్మకళ్యాణం, లోకకల్యాణం దృష్టిలో ఇంతకన్నా అవివేకం వేరేది లేదు. ఈ నష్టాన్ని అంత సులువుగా భర్తీ చేయలేము, ఆ తరువాత అనంతకాలం వరకు పశ్చాత్తాప పడాలి. కాబట్టి ఈ కనీస ప్రయత్నానికి కావలసిన ధైర్యాన్ని తప్పక కూడగట్టుకోవాలి.

నవ నిర్మాణం అనే గొప్ప ప్రణాళిక ఒంటరి చేతులతో కుదరదు అన్న విషయం వేరే చెప్పక్కర్లేదు. అయితే ఒంటరిగా కూడా మొదలుపెట్టవచ్చు. వ్యాపించడానికి సంఘశక్తి కావాలి. ఒకటిని పది చేసి కొత్త సంవత్సరంలో వసంతపంచమికి గురుదేవులకు శ్రద్ధాంజలిని తప్పక సమర్పించుకోవాలి. గురుదేవులు స్వయంగా ఆశతో వేచి చూస్తున్న కనీసపు అనుదానం. నిజం చెప్పాలంటే ఇంతకు మించిన గురుభక్తి, ఈశ్వరభక్తి మరేదీ లేదు.

*– అఖండజ్యోతి, డిశంబరు 2014*
*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

## సుఖంగా ఉండాలనుకొంటే తృష్ణను విడనాడాలి

*రాజైన 'శ్రేణికుడు' ఎందువల్లనో అశాంతితో ఉంటున్నాడు. నిద్రలేమితో, ఉదాసీనునిగా, అసంతృప్తితో, భయసందేహాల నడుమ సతమతమవుచున్నాడు. ఇందుకు కారణం తెలుసుకోగోరి ఈయన బుద్ధ భగవానుని చెంతకు చేరాడు.*

*అప్పుడు భగవానుని సత్సంగంలో భిక్షువులంతా ఆనందంగా వారి మాటలు వింటూ ఉన్నారు. వారందరి ముఖాలు తేజస్సుతో, ఆనందంతో పులకించిపోతూ అందరు దివ్యంగా వెలిగిపోసాగారు.*

*రాజు యొక్క జిజ్ఞాసను గమనించిన తథాగతులవారు ఆ ప్రవచనంలోనే ఈ సత్యాన్ని జోడించి చెప్పసాగాడు. "మానవుడు ఎందువల్ల ఉత్సాహం లేనివానిగా, ఆనందం పొందలేనివానిగా ఉంటాడనగా–తృష్ణలు మనిషిని తినటం చేతనే! వాటి నుండి దూరమైననాడు రాజు–పేద అందరు సమానంగానే సుఖించగలరు" అంటూ ముగించాడు.*

*– అనువాదం: జి. చెన్నకేశవరావు*

**గురువులతో సత్సంగం చేయుటకు అనువైన మార్గం వారి పుస్తకములు చదువుటయే**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## కర్నూలు జిల్లాలో

కర్నూలు జిల్లాలో గాయత్రీ పరివార్ స్టేట్ కమిటీ మెంబర్, రాయలసీమ రీజినల్ కో-ఆర్డినేటర్ శ్రీ వేంకటేశులుగారు మరియు వారి ధర్మపత్ని శ్రీమతి రమామణిగార్లచే నిర్వహించ బడిన గాయత్రీ మహాయజ్ఞము, దీపయజ్ఞ కార్యక్రమములు.

**21.11.2014 –** గోనేగండ్ల మండలము, యన్నేకండ్ల గ్రామములో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయములో 9 కుండీల గాయత్రీ మహా యజ్ఞము నిర్వహించబడినది. ఇందులో 900 మంది పాల్గొన్నారు.

**22.11.2014 –** కోడుమూరు టౌనులో శ్రీమతి కల్కి వసుంధర మరియు నాగరాజు దంపతుల నివాసములో గాయత్రీ యజ్ఞము నిర్వహించబడినది. ఇందులో 40 మంది పాల్గొన్నారు. వసుంధర గారు గత 5 సంవత్సరములగా అచ్చట 10 మందితో ప్రజ్ఞామండలి నిర్వహిస్తున్నారు.

**22.11.2014 –** కోడుమూరు టౌనులో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానములోని మహిళామండలి సభ్యులచేత దీపయజ్ఞ కార్యక్రమము నిర్వహించబడినది. ఇందులో 50మంది మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. 1998లో శ్రీమతి రమామణిగారు అచ్చట నాటిన బీజములతో అక్కడ ప్రతి పౌర్ణిమకి గాయత్రీ యజ్ఞము జరుపుచున్నారు.

**23.11.2014 –** వెల్దుర్థిలో శ్రీ భువన గాయత్రీ దేవాలయ నిర్మాణ కార్యక్రమములు జరుగుచున్నవి. శ్రీ బాలకృష్ణ దంపతులు మరియు వారి కుమారుడు, ధర్మపత్ని అచ్చట పూర్తి సమయదానము అందిస్తునారు. 15 సెంట్ల స్థలమును ఉచితముగా దాతలు ఇవ్వడము జరిగినది. రాయలసీమ జిల్లాలకు ఈ ఆశ్రమమును కేంద్రంగా చేయుటకు గాయత్రీ పరివార్ స్టేట్ కమిటీ మెంబర్, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీ వేంకటేశులు గారు సంకల్పించినారు. ఇందులో భాగంగా లక్ష రూపాయల విలువగల పూజ్య గురుదేవుల సాహిత్యము, 108 కుండముల గాయత్రీ యజ్ఞమునకు కావలసిన వస్తువులన్నింటినీ సమకూర్చారు. అక్కడ ప్రముఖులను సమావేశపరచి, నిర్మాణ సంబంధిత, నిత్య యజ్ఞము నిర్వహించుటకు ప్రయత్నములు చేస్తున్నారు.

**06.11.2014 –** కర్నూలు సమీపమునందున ఉన్నటువంటి బ్రహ్మగుండమునందు శివాలయములో 3 కుండములతో గాయత్రీ యజ్ఞము శ్రీ గురురాజారావుగారు, శ్రీ బాలకృష్ణ దంపతులు, శ్రీ శ్రీనివాసులు గారు మరియు శ్రీ శశిధర్ గార్లచే నిర్వహించబడినది. ఇందులో 400 మంది పాల్గొన్నారు.

**10.11.2014 –** తాడిపత్రిలోని శ్రీ రామ్‌మోహన్‌గారి ఇంట్లో, శ్రీ వేంకటేశ్‌గారు, శ్రీ బాలరాజుగారు దీపయజ్ఞమును నిర్వహించగా 50 మంది పాల్గొన్నారు.

**25.11.2014 –** తాడిపత్రిలో శ్రీ చంద్రశేఖర్‌రెడ్డిగారి ఇంట్లో, శ్రీ వేంకటేశ్‌గారు, శ్రీ బాలరాజుగారు దీపయజ్ఞమును నిర్వహించారు.

## మెదక్ జిల్లా అన్నారం గ్రామంలో

అన్నారం గ్రామం, జిన్నారం మండలం, మెదక్ జిల్లాలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం 2014 డిసెంబర్ 13, శనివారమునాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహింపబడింది. దీనికి ముందస్తుగా 24 కుటుంబాల్లో దేవస్థాపన జరిపి, నిత్యము 3 మాలలు గాయత్రీ మంత్ర జపం నిర్వహింపబడింది. 2014 డిసెంబర్ 12, శుక్రవారము సాయంత్రము 5 గం॥ల నుండి కలశయాత్ర ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం నుండి ప్రారంభమై, యజ్ఞశాల ప్రాంగణం వరకు శోభాయమానంగా సాగింది. అటుపిమ్మట 1008 దీపాలతో కన్నులపండువగా దీపయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ గ్రామానికి మొట్టమొదటిసారిగా గాయత్రీ యజ్ఞం మరియు పూజ్యగురుదేవులను పరిచయం చేయుట జరిగింది.

మరునాడు శనివారము నవకుండీ గాయత్రీయజ్ఞము నిర్వహించారు. యజ్ఞములో 150 మంది పాల్గొనగా వీరిలో 90 శాతము స్త్రీలు పాల్గొన్నారు. నారీలోకం అత్యంత ప్రభావితం చెందింది. ఈ యజ్ఞంలో ఆది నుంచి పాల్గొని మిగుల

***(తరువాయి 48వ పేజీలో...)***

**శక్తిపాతం గురుదేవుల బాధ్యత - సాధన మన వ్యక్తిగత బాధ్యత**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 9

## శ్రీ డి.వి.ఆర్.మూర్తి



1వ తేది జులై 1962లో మేనమామ గారి ఇంట హైదరాబాదులో రాములు, వెంకటసుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వీరి విద్యా భ్యాసమంతా చీరాలలో జరిగింది. చీరాలలోని వి.ఆర్.ఎస్.ఎమ్ & వి.ఆర్.ఎన్. కళాశాలలో బి.కాం చదివారు. తదుపరి వృత్తిపరంగా తన నైపుణ్యాలను మెరుగు పరచుకొనుటకై 1982 నుండి 1993 వరకు ఆడిటర్ల వద్ద హైదరాబాద్ నగరంలో పనిచేశారు. వ్యాపారం వర్గం వారు తమ ఆదాయపు పన్ను మరియు అమ్మకం పన్నులను వార్షికంగా మదింపు చేయించుకొని వానిని సకాలంలో, సక్రమంగా ప్రభుత్వానికి చెల్లించుటలో తగిన సహాయ సహకారాలను మార్గదర్శనాన్ని అందించే వృత్తిలో చీరాలలో స్థిరపడ్డారు.

మూర్తిగారికి తన విద్యార్థి దశలో సహచరుడుగానున్న వెంకటరావుగారిద్వారా గాయత్రీ పరివార్‌తో పరిచయం కలిగింది. చీరాలలో నిర్వహించిన యజ్ఞం ద్వారా ప్రభావితుడై 1996లో హరిద్వార్‌లోని శాంతికుంజ్‌ను దర్శించుట జరిగింది. అప్పుడు మే మాసం, పదిదినాలు అచ్చట శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. దీనితో మరింత ప్రభావితులై, భావోద్రేకాలతో కూడిన తీవ్రభావ సంవేదనలకు లోనై పూజ్య గురుదేవుల సాహిత్యాన్ని 100 పుస్తకాలను ఒకేసారి ఖరీదు చేశారు. పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని అనువదించి తెలుగువారికి ఆ విశిష్ఠ జ్ఞానాన్ని అందించాలనే తపన వీరిలో బయలుదేరింది. ఇది ఆయనను నిద్రింపనీయలేదు. ఇక ఆలస్యం చేయక వెనువెంటనే ఆంధ్రీకరణ చేయుటకు శ్రీకారం చుట్టారు. దీనికి పూర్వము, కర్మకాండతో కూడిన గాయత్రీ హవన ప్రక్రియను, సంస్కారాల ప్రక్రియలను క్షుణ్ణంగా అవగాహన చేసికొని ఆచరణలో పెట్టుచూ, పదుగురికి ఈ సేవలనందజేయుచూ, క్రమక్రమంగా గాయత్రీ పరివార్‌ను నిర్మించుటలో తన వంతు కర్తవ్యాన్ని పోషించుట ప్రారంభించారు.

తదుపరి చర్యగా ప్రప్రథమంగా "కర్మకాండ భాస్కర్" అనే హిందీ గ్రంథాన్ని అదే నామంతో తెలుగులోనికి అనువదించి ముద్రించారు. ఈ విధంగా తెలుగువారికి పూజ్య గురుదేవుల గాయత్రీ హవనవిధిని పరిచయం చేసిన ఘనకీర్తిని స్వంతం చేసికొన్న ధన్యజీవి. అటు తదుపరి గాయత్రీ పరివార్ శాంతికుంజ్ వారికి, ఆంధ్రప్రదేశ్‌లో గాయత్రీ పరివార్‌ను వ్యాప్తిగావించుటకై తన వంతు కర్తవ్యాన్ని అత్యంత సమర్థ వంతంగా పోషిస్తూ, సహకారాన్ని అందించుచున్న నిత్య కృషీ వలుడు మన మూర్తిగారు. శాంతికుంజ్ పరివార్‌వారి హిందీ ప్రసంగాలకు అనువాదం చెప్పుచూ, గాయత్రిపట్ల పూజ్యగురు యుగ్మం పట్ల తెలుగువారిలో ముఖ్యంగా సర్కారు జిల్లాలలోని వారికి చక్కని అవగాహనను కల్పించుటలో ఎనలేని పాత్రను పోషించిన ఘనుడు, విశ్వగాయత్రీపరివార్ ప్రధాన సంచాలకులైన శ్రీ ప్రణవ్‌పండ్యా మరియు వందనీయ శైలదీది గార్ల హిందీ ప్రసంగాలకు తెలుగు అనువాదం చెప్పుచూ ఆయా కార్యక్రమా లను విజయవంతం గావించుటలో మరువజాలని చక్కని సేవలనందించారు.

2007లో ఒకేసారి 20 పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. అట్లే క్రాంతిధర్మి సాహిత్యంలో 7 పుస్తకాలను, బుద్ధిని వికసింపజేసికొనే వైజ్ఞానికవిధి, మున్నగువానిని పూర్తి చేశారు.

తిరుపతి అశ్వమేధ యజ్ఞంలో (2001) ప్రముఖుల హిందీ ప్రసంగాలను తెనుగులో అనువదించి అచ్చటనున్న అత్యధిక తెలుగువారికి అర్థమయ్యేందుకు కృషిచేశారు. ప్రతి సంవత్సరం ఆంధ్రదేశం నుండి 30 నుండి 40 మంది కొత్త వారిని శాంతికుంజ్‌కు పరిచయం చేస్తూ గాయత్రీ పరివార్ వ్యాప్తికై తనవంతు కృషిని పట్టువీడని విక్రమార్కునిలా గత దశాబ్ద కాలం నుండి కొనసాగిస్తున్న ధీశాలి. అట్లే సర్కారు జిల్లాలలో జరిగే పెద్ద పెద్ద యజ్ఞాల విజయానికి తనవంతుగా సహాయ సహకారాలను అలుపెరుగక కొనసాగిస్తున్నారు.

అట్టి వీరికి పరమపూజ్య గురుయుగ్మము ఆయుః ఆరోగ్యాలను వనరులను ప్రసాదించవలసిందిగా ప్రార్థిస్తూ, యుగశక్తి గాయత్రి వీరికి వీరి కుటుంబానికి శుభాశీస్సులను అందిస్తున్నది.

**ఆధ్యాత్మిక జగత్తులో తన్మయత్వం నేర్చుకోవాలి**

**శ్రీ వూటుకూరి సుబ్బారావు - పార్వతి దంపతులు**



శ్రీ వూటుకూరి సుబ్బారావుగారు 1944లో బంగారు మరియు సరస్వతి దంపతులకు కారంచేడు గ్రామం, ప్రకాశం జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం మరియు హైస్కూలు ఉన్నత విద్య స్వగ్రామం కారంచేడులోనే పూర్తిచేసి తదుపరి ప్రి యూనివర్సిటీ కోర్సు చీరాల కళాశాలలో పూర్తి చేశారు. సంపాదిస్తూ విద్యనభ్యసించు అనే మూల సూత్రానికి కట్టుబడి, తల్లిదండ్రులకు భారం కారాదని నిశ్చయించుకొని తన చిన్ననాటనే కారంచేడు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చిరు ఉద్యోగిగా(అటెండర్) తన జీవనయానాన్ని ప్రారంభించారు. కానీ ఆయనలో నివురుగప్పి ఉన్న విద్యాభ్యాస తృష్ణ ఆయనను మిన్నకుండనివ్వనందున, శాఖా పరమైన పరీక్షలలో ఉత్తీర్ణులవుతూ, జీవన వైకుంఠపాళి పటంలో ఒక్కొక్క నిచ్చెన ఎక్కుతూ తన జీవితాన్ని ప్రారంభించారు. అన్నపూర్ణమ్మ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా చేరారు. అటు పిమ్మట జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎల్.డి.సి.గా ప్రమోషన్‌పై ఒంగోలులో చేరారు. ఆత్మ విశ్వాసంతో తన విద్యార్హతల పెంచుకొనే దిశగా ఎదుగుటకై ప్రైవేటుగా చదివి బి.ఎ. మరియు బి.ఇడి. డిగ్రీలను పొందారు.

1967 మే 28వ తేదిన మచిలీపట్నం నివాసియైన శ్రీప్రకాశరావు మరియు వెంటకసుబ్బమ్మ దంపతులు గారాల పట్టి, ఏకైక సంతానమైన పార్వతీదేవిని జీవితభాగస్వామినిగా చేసికొన్నారు. ఈమె మెట్రిక్ వరకు చదివి, విద్యకు ఫుల్‌స్టాప్ పెట్టారు. 1970లో భర్త ప్రోత్సాహంతో చీరాల కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో ప్రవేశించారు. తదుపరి భర్తగారైన శ్రీ సుబ్బారావుగారి ప్రోత్సాహంతో తన విద్యను కొనసాగిస్తూ ప్రైవేటుగా బి.ఎ. పూర్తిచేశారు. పిమ్మట 1990లో ఉద్యోగానికి సెలవుపెట్టి నాగపూర్ యూనివర్సిటీలో ఎమ్.ఎ. డిగ్రీని పొంది, హిందీ ఉపాధ్యాయిని వృత్తిలో స్థిరపడ్డారు.

నిత్యకృషీవలునిలో తీవ్ర ఆకాంక్ష ముప్పిరిగొన్న శ్రీసుబ్బారావుగారు, శాఖాపరమైన పరీక్షలలో ఉత్తీర్ణుడై, వచ్చిన అవకాశాలనన్నింటిని అందిపుచ్చుకొంటూ ఒంగోలులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ పదవిని చేపట్టారు. ఈ విధంగా ఆయనకు జిల్లాలోని ఉపాధ్యాయ వర్గంతో చక్కని సంబంధాలు ఏర్పడ్డాయి.

శ్రీమతి పార్వతిగారికి ఆమె చిన్ననాటి నుండి భగవద్భక్తి అలవడింది. దీనితో భక్తి గీతాలు ఆలపిస్తూ భక్తి సంఘాలతో కలసిమెలసి తన సేవలను అందిస్తూ ఉండేది. సమయాను కూలంగా, ఈ ఆదర్శ కుటుంబానికి ఇరువురు సంతానం కలిగింది.

పై రీతిగా భౌతికపరంగా తమను తాము పటిష్ఠపరచుకొన్న పార్వతి–సుబ్బారావు దంపతుల అడుగు ఆధ్యాత్మిక దిశగా వేసే సమయం ఆసన్నం కాగానే నూతనంగా చీరాలలో నిర్మించుకొన్న వారి గృహప్రవేశవేళ, ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ గాయత్రీ పరివార్ వ్యాప్తికై కృషి చేయుచున్న శ్రీమతి సీతామహాలక్ష్మి, శ్రీ బి.సత్యనారాయణ మాష్టారు మున్నగు వారు గాయత్రీ యజ్ఞాన్ని వీరి ఇంటిలో నిర్వహించారు. దీనిలో వస్త్ర వ్యాపారి అయిన శ్రీ సవాయిసింగ్ చీరాల వారు తమ వంతు పూర్తి సహకారాన్ని అందించి యజ్ఞాన్ని సఫలం గావించారు. ఈ రీతిగా సుబ్బారావు దంపతులు 1984లో ఆధ్యాత్మిక జగత్తులో అడుగిడుట జరిగింది.

తదుపరి 1988లో జనవరి వసంత పంచమి పర్వదినాన శ్రీ సవాయిసింగ్ ప్రోద్బలంతో వారివెంట గుంటూరు పట్టణంలో శ్రీ శ్రీరామకృష్ణమాష్టారి సమక్షంలో శ్రీ శివరామకృష్ణారెడ్డి (డా॥ తుమ్మూరి)గారు నిర్వహించిన గాయత్రీయజ్ఞంలో పాల్గొన్నారు. పూజ్యులు డా॥ శ్రీరామకృష్ణ మాష్టారి దృష్టి ఈ దంపతులపై పడగా, శ్రీ సవాయిసింగ్ ద్వారా ఈ దంపతులను ఇద్దరిని మాష్టారు అదే రోజు వేణుగోపాల్‌నగర్‌లోని తమ ఇంటిలో జరిగే యజ్ఞభోజన ప్రసాదాల స్వీకృతికై ఆహ్వానించారు. బ్రాహ్మణుల (మాష్టారి) ఇంట భోజనం చేస్తే నిమ్నకులస్థులనుగా పరిగణింపబడే తమను (ఆనాటి సమాజస్థితి) తాము తిన్న విస్తరాకుల తామే ఎత్తి వేయవలసి ఉంటుంది. కావున తినవద్దు అనే భావన సుబ్బారావు దంపతుల మదిలో నెలకొన్నది. దీనిని పసిగట్టిన మాష్టారు "ఇచ్చట ఎవ్వరు తిన్న విస్తరాకులను

**దేవాలయాలకి దేవతలుగా మారటానికి వెళ్ళండి**

ఎత్తివేయవలసిన పని లేదు. కావున నిర్భయంగా వచ్చి, నిశ్చింతగా భోజన ప్రసాదాలు స్వీకరించండి" అన్న మాష్టారి మాటలు సుబ్బారావు దంపతులను కడు ఆశ్చర్యంలో ముంచెత్తాయి. దీనితో మాష్టారి పట్ల వారి మనస్సులో పొడ చూపిన అనుమాన తెరలు తొలగిపోయాయి. దీనితో క్రమ క్రమంగా వీరికి, మాష్టారి పట్ల గాయత్రీపరివార్ పట్ల విశ్వాసం గట్టిపడసాగింది.

వీరి కుటుంబంలో జరిగిన మరో సంఘటన వీరిని మాష్టారివద్దకు మరింత దగ్గరకు చేర్చింది. ఒకసారి సుబ్బారావు గారు నిచ్చెనపై నిలబడి సర్దుచుండగా నిచ్చెన జారి క్రిందపడి పోగా తుంటిఎముక చిట్లింది. వెంటనే మాష్టారికి ఫోనులో తెలుపగా, ఏమి కాదు, హరిద్వార్, శాంతికుంజ్‌లోని గురువు గారికి జాబు వ్రాయండి అన్నారట. (ఈ సంఘటనకు పూర్వము సుబ్బారావుగారి భార్య శ్రీమతి పార్వతిగారు ఒక సంవత్సర కాలంలో వసంత పంచమి, గాయత్రీ జయంతి, గణేశ్, దుర్గా, శ్రీరామనవమి నవరాత్రులు వరుసగా దీక్షగా పూర్తిచేశారు.) వెంటనే శాంతికుంజ్‌కు లేఖ వ్రాయగా, మాతాజీ ప్రత్యుత్తరం ఇస్తూ పార్వతీగారు పూర్తిచేసిన అనుష్టానాలు, తన భర్త సుబ్బారావు ప్రాణాలను కాపాడి ఆయనకు పునర్జన్మను ప్రసాదించాయి, తద్వారా ఆమె దీర్ఘసుమంగళి అయ్యింది అని తెలిపారట.

అటు పిమ్మట శాంతికుంజ్ ప్రయాణం కట్టారు. అప్పుడే పూజ్యగురుదేవులు తమ ఏడాది సూక్ష్మీకరణ సాధనను పూర్తి చేసికొని పరివారానికి దర్శనమీయసాగారు. వందనీయ మాతాజీ అనుగ్రహంతో, పూజ్యగురుదేవుల దర్శనం వీరికి లభించింది. దర్శనవేళ, పూజ్యగురుదేవులు "ఆజ్ సే ఏ సుబ్బారావ్ నహీ హై-ఏ శివ్‌హై - ఏ దోనోం శివపార్వత్ హై" (నేటి నుండి ఈయన సుబ్బారావు కాదు - ఈయన శివుడు - వీరిరువురూ శివపార్వతులు) అని ఆశీర్వదించారట.

అటు పిమ్మట ఓడరేవు గ్రామంలోని (చీరాల తాలుకా లోని) 9 రోజుల సాధనా శిబిరాన్ని జాన్‌డేవిడ్ హైస్కూలు విద్యార్థుల వసతి గృహం ఆవరణలో శ్రీరామకృష్ణ మాష్టారి సారథ్యంలో నిర్వహించారు. అప్పుడు మాష్టారు సముద్రం ఒడ్డున ఆశ్రమ నిర్మాణానికై కొంత స్థలాన్ని సేకరించమని శ్రీ సుబ్బారావు గారిని ప్రోత్సహించుట జరిగింది. "అంతా వెతికాం, స్థలం అమ్మకానికి లేదు" అని జవాబిచ్చారు సుబ్బారావు. అయినా మాష్టారు పట్టువీడక, స్థలం దొరుకు తుంది వెతకండి అని చెప్పగా, చిట్టచివరికి సుబ్బారావుగారు రెండు ఎకరాల భూమి ఖరీదు చేసి ఓడరేవులో సముద్రం ఒడ్డున ఆశ్రమ నిర్మాణం చేపట్టుట జరిగింది. ఇదియే నేటి "శ్రీరామహంస ఆశ్రమము-ఓడరేవు. ఇచ్చట గాయత్రి వ్యాప్తికై "సజల శ్రద్ధ - ప్రఖర ప్రజ్ఞ" నిర్మాణం జరిగింది. శ్రీ సుబ్బారావు దంపతులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి ఆశ్రమంలోనే నివాసముంటూ ఆశ్రమ అభివృద్ధికి తీవ్రంగా కృషిచేసిన ధన్యజీవులు. ఆశ్రమ నిర్వహణలో పార్వతిగారు పూజ్యమాతాజీ అడుగు జాడల్లో నడుస్తూ, ఆశ్రమ సందర్శకులకు తానే స్వయంగా వంటచేసి, వడ్డించి, వారిని సంతృప్తులుగావిస్తున్నది.

వయోభారం పైబడగా, ఆరోగ్యం కుంటుపడగా తప్పని స్థితిలో తమ మనస్సులను ఆశ్రమంలో ఉంచి, భౌతికంగా చీరాలలో నివసిస్తున్న ఈ ధన్యజీవులకు తగిన ఆయుః ఆరోగ్యాలను, ఆనందాన్ని ప్రసాదించవలసిందిగా ఋషి యుగ్మాన్ని యుగశక్తి గాయత్రి ప్రార్థిస్తున్నది.

---

***(...45వ పేజీ తరువాయి)***

ప్రభావితుడై యజ్ఞ క్రతువును, దీపయజ్ఞాన్ని, కలశయాత్రలను గాయత్రీ చేతనాకేంద్ర ప్రతినిధులైన శ్రీయుతులు బి. శ్రీనివాస రావు, శ్రీమతి హైమావతిగార్లు మరియు గాయత్రీ పరివార్ కార్యకర్తలైన శ్రీ నవరతన్ నిర్వహించారు. యుగప్రబోధ గీతాలను హిందీలో మరియు తెలుగు భాషలలో శ్రీ పారస్‌నాథ్ ఎయిర్ ఫోర్స్, దుండిగల్, వీరి కుమారుడు రాహుల్ మరియు నవరతన్‌లు ఆలపించారు.

ఈ యజ్ఞ విజయానికి ప్రముఖంగా గ్రామ సర్పంచి శ్రీ తిరుమలవాసు, శ్రీయుతులు రాంచంద్రారెడ్డి, రుక్మారెడ్డి, జయశంకర్‌గౌడ్, భిక్షపతిచారి, బి. భిక్షపతి, సత్యన్నారాయణ, వీరారెడ్డి, షేక్ కరీం-వార్డు మెంబర్, డా॥ రవికుమార్‌రెడ్డి మున్నగువారు చక్కని సహకారాన్ని అందించారు. గ్రామ సర్పంచి స్వయంగా యజ్ఞములో పాల్గొని కలశపూజను నిర్వహించారు. శ్రీ కత్తుల వెంకటరెడ్డి తనకుగల ధూమపాన వ్యసనాన్ని విడచిపెట్టెదనని సంకల్పాన్ని తీసుకొన్నారు. (రోజుకు 4 పెట్టెల సిగరెట్లు కాల్చెడి అలవాటు ఉన్న వ్యక్తి) యజ్ఞ సఫలతకిది ఒక తార్కాణం.

**మానసికస్థితి మారాలంటే ఆహారం మారాలి**

# 2016లో ఆంధ్రప్రదేశ్‌లో అశ్వమేధ మహాయజ్ఞము నిర్వహణ

## యుగశక్తి గాయత్రి పాఠకులకు / గాయత్రీ పరివార్ కార్యకర్తలకు విజ్ఞప్తి

కర్నాటక రాష్ట్రములోని బెంగుళూరు మహానగరంలో 2014 జనవరిలో జరిగిన అశ్వమేధ మహాయజ్ఞము ముగింపు వేడుకల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో అశ్వమేధ మహా యజ్ఞమును నిర్వహించవలయునని శాంతికుంజ్ వరిష్ట ప్రతినిధి శ్రీ అశ్విని సుబ్బారావుగారి కోరిక మేరకు అఖిల విశ్వగాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు డా॥ ప్రణవ్‌పండ్యా గారు సభాముఖముగా ప్రకటించారు.

పై మహాక్రతువును నిర్వహించుటకై ఈ క్రింది వనరులను ముందుగానే సిద్ధము చేసికొని, ఆంధ్రప్రదేశ్‌లోనున్న గాయత్రీ పరివార్ సామూహికంగా తమ పూర్తి సంసిద్ధతను శాంతికుంజ్, హరిద్వార్‌నకు లిఖిత పూర్వకంగా కనీసము డిసెంబరు 2015 నాటికి పూర్తి వివరాలు తెలుపుచూ అందజేయవలసి ఉన్నది.

## డిసెంబరు 2015 నాటికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని గాయత్రీ పరివార్ చేపట్టి పూర్తిచేయవలసి పనులు:

1. కనీసం 2000 నుండి 2500 గాయత్రీ ప్రజ్ఞాపీఠాలను/ మహిళా మండళ్ళను యువ మండళ్ళను ఏర్పాటు చేయుట.
2. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు గల నగరాలు మరియు పట్టణాలలో కాలనీలలో, హౌసింగ్‌బోర్డు కాలనీలలో గ్రామాల్లో గాయత్రీ ప్రజ్ఞామండళ్ళను / మహిళా మండళ్ళను / యువ మండళ్ళను ప్రారంభింపచేయుట.
3. ఒక్కొక్క మండలితో కనీసము ఐదుగురితో కూడిన కమిటీని ఏర్పాటుచేసి కార్యక్రమాలను ప్రారంభించాలి.
4. ఖర్చు తక్కువతో ప్రారంభించుటకై తొలుత దీపయజ్ఞాలతో ప్రారంభించి, తదుపరి అవసరానుసారం హవన యజ్ఞాలు చేపట్టవచ్చు.
5. ఒక్కొక్కరు కనీసము 5 నుండి 10 ప్రజ్ఞామండలులను స్థాపించి, వారి నివాసానికి సమీపంలోనున్న వానిని ఎన్నుకొని ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టాలి.

## ప్రజ్ఞా / మహిళా / యువ మండలులు చేపట్టవలసిన కార్యక్రమాలు:

దేవాలయాలుగా, వైద్యాలయాలుగా మరియు విద్యాలయాలుగా ప్రజ్ఞా మండలులు ప్రజలకు తగిన సేవలను అందించాలి.

**1) దేవాలయాలు:** దేవాలయాలు జనులలో జాగృతిని కలిగించాలి. దీనికై పూజ్యగురుదేవులు, మాతాజీలు చక్కని మార్గోపదేశం చేశారు.

ఎ) గాయత్రీ ఉపాసన క్రియద్వారా నిత్యము మూడు మాలలు గాయత్రీ మంత్రజపాన్ని చేయాలి. ఒక మాల తనలో పరివర్తనకై రెండవది కుటుంబ పరివార పరివర్తనకు, మూడవ మాల సమాజ పరివర్తనకై చేయాలి.

బి) క్రమానుసారంగా సత్సంగాలు నిర్వహిస్తూ హవన / దీప యజ్ఞాల ద్వారా సామూహిక శక్తిని పెంపొందింపజేస్తూ సంస్కార ప్రక్రియల పెంపొందించుతూ వాని ప్రాధాన్యతను తెలియజేస్తూ నిత్యజీవితంలో అవి ఒక భాగంగా రూపుదాల్చాలి.

సి) పండుగల ప్రాధాన్యతలు తెలుపుచూ సామూహికంగా వానిని నిర్వహించాలి.

డి) పైవానిని ఆసరాగా తీసుకొని సామాజిక సేవకుల తయారీకి మార్గం సుగమం చేయాలి.

**2) వైద్యాలయాలు:** ఆయా ప్రాంతాల ప్రజావసరాలకు అనుగుణ్యమైన వైద్య సదుపాయాలను, ప్రాథమిక చికిత్సా విధానాలను చిన్న చిన్న అనారోగ్యాల చక్కబరచుటకు హోమియో, ఆయుర్వేద వైద్య విధానాలను ప్రాచుర్యంలోనికి తేవాలి. అత్యంత చౌకగా ఈ సేవలను అందించాలి. సంచార వైద్యుల సేవలను అందుబాటులోనికి తేవాలి.

**3) విద్యాలయాలు:** గ్రామాలు స్వయంపోషకాలుగా ఎదుగుటకు ప్రజలలో విద్యావ్యాసాంగాలు పెరగాలి. నిరక్షరాస్యతను తొలగించాలి. అట్లే గ్రామీణ యువత ఉన్నత పాఠశాల విద్యను పూర్తిచేసికొనేలోపు, విద్యార్థులకు తగిన వృత్తివిద్యలు, స్వయంపోషక వృత్తులలో తగిన శిక్షణనిచ్చి వారు

ప్రకృతిలో సమస్యతోపాటే సమాధానం ఉంటుంది

చక్కని నైపుణ్యంతో పాఠశాల విద్యను పూర్తిగావించుకొని బయటి ప్రపంచంలో, స్వయం పోషకులుగా స్వావలంబన దిశగా, ఆత్మవిశ్వాసంతో నిజ జీవితంలో అడుగిడేలా చూడాలి.

చిన్న చిన్న గ్రంథాలయాలను స్థాపించాలి. దీనికై సమర్థ గురు రామదాసు మార్గాన్ని అనుసరిస్తూ వారిని ప్రేరణగా కొని, సమాజ సేవకై కార్యకర్తలను తయారు చేయాలి.

**గాయత్రీ ప్రజ్ఞా / మహిళా / యువ మండలులు చేపట్ట వలసిన ఇతర కార్యక్రమాలు:**

ఈ మండలులు వారి వారి పరిధిలోని ప్రాంతాలలో వృక్షాలు నాటుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టుట, పాడి పంటల దిగుబడులు పెంచుటలో తగిన ఆధునిక శాస్త్ర, సాంకేతిక, పరిజ్ఞానాన్ని వినియోగంలోనికి తెచ్చుకొనుట, వృద్ధులకు, అనాథలకు తగిన చేయూతనిచ్చి వారికి ఆనందాన్ని అందించుట, బాధాతప్తులైన వారికి బాసటగా నిలచి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుట వగైరా సేవలనందించే యంత్రాంగాన్ని, మంత్రాంగాన్ని సమకూర్చుట.

పైవిధంగా అన్ని రంగాలలో సామూహిక శక్తిద్వారా ప్రగతిని సాధించుట.

ముందర ఉదహరించిన విస్తృత కార్యాచరణ ప్రణాళికను చేబూని గాయత్రీ పరివార్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు వారి వారి ప్రాంతాలలో ఉద్యమించవలసినదిగా కోరుచున్నాం. మీకు కావలసిన మార్గదర్శనాన్ని, చేయూతను, సలహా, సూచనలను సకాలంలో మీకు అందించుటకు గాయత్రీ చేతనా కేంద్రం ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటుంది. పై కార్యాచరణ అమలులో మీరు ఎదుర్కొనెడి సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను ఎప్పటికప్పుడు మీకు అంద జేస్తుంది.

కావున యావన్మంది కార్యకర్తలు వారు చేపట్టిన, చేపట్ట నున్న కార్యాచరణ, పథక వివరాలు గాయత్రీ చేతనా కేంద్రానికి తెలియపరచవలసినదిగా ప్రార్థన.

మీ మీ సంశయాల నివృత్తికై తగిన మార్గదర్శనానికి గాయత్రీ చేతనాకేంద్రం, హైదరాబాదును సంప్రదించ వలసినదిగా కోరటమైనది.

**సంప్రదించవలసిన ఫోన్ నెం:**
**040-23700722, సెల్: 9949111175**

**భవదీయ**
**అశ్విని సుబ్బారావు**

## అసలు గురూజీ ఎవరు?

*'పరమసిద్ధుడు ఆనందపు దుందుభి' అని ఆదిశంకరులు వివేక చూడామణిలో వ్రాశారు. ఆనందపు దుందుభి అంటే అర్థం – 'చిన్నపిల్లలలా నవ్వుతూ నవ్విస్తూ వినోదంగా జీవించడం'. అలాగే గురుదేవులకు సన్నిహితంగా వచ్చిన వ్యక్తులు ఆయన నవ్వుల తరంగాలలో స్నానం చేయకుండా ఉండరు.*

*గురుదేవులు తపోభూమిలో ఇద్దరు కార్యకర్తలతోపాటు కూర్చుని ఉన్నారు. వారిలో ఒక కార్యకర్తకు గడ్డం, జుట్టు పెంచుకోవడం సరదా. తిలకం ధరించి, పసుపుపచ్చని దుస్తులు ధరిస్తే అతడు మహంత్‌లా శోభిస్తాడు. సంభాషణ సాగుతూ ఉండగా ఒక వ్యక్తి లోపలకు వచ్చాడు. "నేను గురూజీని కలుసుకోవాలి" అన్నాడు.*

*గురుదేవులు నవ్వుతూ ఇలా అన్నారు – "ఈ ముగ్గురిలో గురూజీ ఎవరో గుర్తుపట్టండి చూద్దాం" ఆ వ్యక్తి కాసేపు ఇటూ అటూ చూస్తూ ఉండిపోయాడు. తర్వాత పొడవైన గడ్డం కలిగిన కార్యకర్త పాదాలపై నుదురు ఉంచాడు. పాపం ఆ కార్యకర్త కంగారు పడ్డాడు. గురూజీ తాను కాననీ, వీరనీ వివరించసాగాడు. ఈ తమాషా చూస్తున్న గురుదేవులు నవ్వుతూ ఇలా అన్నారు – "మోసపోయి గురువుగారి చరణాలను వదలవద్దు. ఈయనే గురూజీ".*

*ఈలోగా చుట్టుప్రక్కల ఉన్న మరికొందరు వచ్చారు. వాతావరణంలో హాస్య వినోదాలు సాగాయి. వచ్చిన వ్యక్తికి ఆ తర్వాత తెలిసింది అసలు గురూజీ ఎవరో. అతడు కూడా గురుదేవులు చిన్నపిల్లవాడిలా నవ్వుతూ ఉండడం చూచి ముగ్ధుడు అయ్యాడు.*

**కృతజ్ఞత లేకపోవడం వలన అనేక ఆనందాలు కోల్పోతున్నారు**